ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698



తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

Estd : 2002

# జనంసాక్షి

www.janamsakshi.org

ఆదివారం 11.05.2025 | సంపుటి : 11 | సంచిక : 292 | పేజీలు : 12 | వెల : రూ. 4/-

RNI NO.TELTEL / 2013 /50370

తెలంగాణ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్







కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిన అనంతరం కొన్నిగంటల్లోనే పాక్ మళ్లీ డ్రోన్ దాడులకు తెగబడటంతో జమ్ముకాశ్మీర్‌లో బ్లాక్అవుట్ ప్రకటించగా ఆ ప్రాంతం మొత్తం చిమ్మచీకట్లు అలుముకున్న దృశ్యం

## కాల్పుల విరమణ ప్రతిపాదన..
# వెనువెంటనే ఉల్లంఘన

### తీరు మారని పాక్.. తన వక్రబుద్ధిని మరోసారి చాటుకున్న శత్రుదేశం

### కాల్పుల విరమణ ప్రకటించిన గంటల్లోనే మళ్లీ దాడులకు తెగబడిన వైనం

శ్రీనగర్(జనంసాక్షి):కాల్పులవిరమణకుఅంగీకరించిన కొన్ని గంటల్లోనే పాక్ తన వక్రబుద్ధిని చాటుకున్నట్లు తెలుస్తోంది. తాజాగా జమ్మూ కశ్మీర్‌తోపాటు ఇతర సరిహద్దు రాష్ట్రాల్లో పాక్ డ్రోన్ దాడులకు తెగబడుతున్నట్లు సమాచారం. శ్రీనగర్‌లో భారీ శబ్దాలు వినిపిస్తున్నాయని జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా పేర్కొన్నారు. ఈ సందర్భంగా కాల్పుల విరమణ సంగతేంటని ఆయన 'ఎక్స్' వేదికగా ప్రశ్నించారు.కాల్పులవిరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించి అంతర్జాతీయ సరిహద్దుతోపాటు నియంత్రణ రేఖ వెంబడి శనివారం రాత్రి అనేక ప్రాంతాల్లో పాక్ దాడులకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. జమ్మూ కశ్మీర్‌లోని ఉధంపుర్, శ్రీనగర్‌లలో భారీ శబ్దాలు వినిపిస్తున్నాయి. ఈ పాక్ డ్రోన్లను గగనతల రక్షణ వ్యవస్థలు ఎప్పటికప్పుడు ధ్వంసం చేస్తున్నట్లు తెలుస్తోంది.

మిగతా 2లో..

- జమ్మూ కశ్మీర్‌లోని ఉధంపుర్, పూంచ్, శ్రీనగర్‌లలో దయాది మళ్లీ డ్రోన్ దాడులు
- పోఖ్రాన్‌లో, శ్రీనగర్‌లోని ఆర్మీ హెడ్ క్వార్టర్స్ సమీపంలో పలు డ్రోన్లు కూల్చివేత
- తనకు భారీ శబ్దాలు వినిపిస్తున్నాయని సీఎం ఒమర్ అబ్దుల్లా వెల్లడి
- కాల్పుల విరమణ ప్రకటించాక కూడా ఈ దుశ్చర్యలేంటని ప్రశ్నించిన ముఖ్యమంత్రి

## ఢిల్లీ లక్ష్యంగా పాక్ క్షిపణి ప్రయోగం

శ్రీనగర్ విమానాశ్రయం సమీపంలో పాక్ ప్రయోగించిన డ్రోన్నలకు కూల్చివేసిన ఇండియన్ ఆర్మీ




- హతాఫ్-2 మిస్సైల్‌ను అడ్డుకున్న భారత్
- హర్యానాలోని సిర్సా వద్ద కూల్చివేత
- శ్రీనగర్ ఎయిర్‌పోర్టుపైనా దాడికి యత్నం భారత్ ప్రతిదాడుల్లో
- నాలుగు పాక్ ఎయిర్‌బేస్‌లు ధ్వంసం



## అంతకు ముందు ఇరుదేశాలు కాల్పుల విరమణకు అంగీకారం

### భారత్,పాక్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ మిలటరీ ఆపరేషన్స్ స్థాయిలో చర్చలు

### భూ, గగన, సముద్రతలాల నుంచి దాడుల నిలిపివేస్తామని ప్రకటన

### తమ ఆధ్వర్యంలోనే సయోధ్య కుదిరిందన్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్

న్యూఢిల్లీ(జనంసాక్షి): భారత్ - పాక్ ఉద్రికత్తతలపై శనివారం ఉదయం నుంచి నాటకీయ పరిస్థితులు నెలకొన్నాయి. కాల్పుల విరమణకు ఇరు దేశాలు అంగీకరించినట్లు భారత విదేశాంగశాఖ ప్రకటించింది. శనివారం సాయంత్రం 5గంటల నుంచి ఇవి అమల్లోకి వచ్చినట్లు తెలిపింది. అంతకు ముందు ఇదే అంశంపై స్పందించిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. భారత్- పాక్‌లు కాల్పుల విరమణకు అంగీకరించాయని, ఇందుకు అమెరికా మధ్యవర్తిత్వం వహించిందని ప్రకటించారు. శనివారం సాయంత్రం భారత విదేశాంగశాఖ ప్రతినిధి విక్రమ్ మిస్రీ మాట్లాడుతూ.. "మధ్యాహ్నం 3.35 గంటలకు ఇరుదేశాల డైరెక్టర్ జనరల్ ఆఫ్ మిలటరీ ఆపరేషన్స్ స్థాయిలో ఇరుదేశాల మధ్య చర్చలు జరిగాయి. పాకిస్థాన్ డీజీఎంఓ భారత డీజీఎంవోకు ఫోన్ చేశారు. కాల్పుల విరమణకు ఇరు దేశాల సైనికాధికారులు అంగీకరించారు. సాయంత్రం 5గంటల నుంచి ఇది అమల్లోకి వచ్చింది. భూ, గగన, సముద్రతలాల నుంచి ఇరు దేశాల మధ్య కాల్పుల విరమణ కొనసాగుతుంది. వీటికి సంబంధించి ఇరుదేశాల సైన్యానికి తగిన ఆదేశాలు వెళ్లాయి. ఈ నెల 12న సాయంత్రం డీజీఎంవోలు మళ్లీ చర్చలు జరుపుతారు" అని విదేశాంగ మంత్రి విక్రమ్ మిస్రీ వెల్లడించారు. ఇరు దేశాల మధ్య కుదిరిన కాల్పుల విరమణపై


మిగతా 2లో..

## కాల్పుల విరమణ ఒప్పందం ఉల్లంఘన అత్యంత దుర్మార్గం

- ఈ చర్యలకు సంపూర్ణ బాధ్యత పాక్‌దే
- దీనికి సైన్యం తగిన విధంగా జవాబిస్తుంది
- భారత విదేశాంగశాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ

శ్రీనగర్(జనంసాక్షి):సరిహద్దుల్లో పాకిస్థాన్ కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించిందని భారత విదేశాంగశాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ తెలిపారు. శనివారం రాత్రి దిల్లీలో ఆయన

మిగతా 2లో..



## ఇకపై ఉగ్ర చర్యలను యుద్ధంగానే పరిగణిస్తాం

అందుకు దీటుగా బదులిచ్చేందుకు సిద్ధం

కాల్పుల విరమణ ఒప్పందానికి ముందు ప్రధాని సమక్షంలో త్రివిధ దళాల సమావేశంలో నిర్ణయం

న్యూఢిల్లీ(జనంసాక్షి):పాకిస్తాన్‌కు భారత్ సీరియస్ వార్నింగ్ ఇచ్చింది. ఇకపై ఏ ఉగ్రదాడినైనా యుద్ధ చర్యగా పరిగణిస్తామని హెచ్చరించింది. పాకిస్థాన్ రెచ్చిపోతే అంతకు మించి ప్రతిదాడితో విరుచుకుపడాలని నిర్ణయించింది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన త్రివిధ దళాధిపతులతో జరిపిన అత్యున్నత స్థాయి సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు

మిగతా 2లో..

## కాల్పుల విరమణకు అంగీకరించినా.. నిరంతరం సన్నద్ధతతోనే ఉంటాం

- భవిష్యత్తులో పాకిస్థాన్ దాడులకు తెగబడితే దీటుగా సమాధానమిస్తాం
- కొన్ని రోజులుగా భారత్‌పై దయాది దేశం అవాస్తవాలు ప్రచారం చేస్తోంది
- భారత్ లౌకిక దేశం.. ప్రార్థనా మందిరాలపై ఎప్పుడూ దాడి చేయదు
- కాల్పుల విరమణ ప్రకటన అనంతరం మీడియాతో భారత సైనికాధికారులు వెల్లడి

2లో






## సీతమ్మసాగర్, సీతారామ పూర్తికి ప్రణాళికలు

హైదరాబాద్(జనంసాక్షి):ఉమ్మడి ఖమ్మం జిల్లాను సస్యశ్యామలం చేయనున్న సీతారామ ప్రాజెక్టు, సీతమ్మ సాగర్ మల్టిపర్పస్ ప్రాజెక్టుల పూర్తికి ప్రణాళికలు రూపొందించుకున్నామని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. రెండు ప్రాజెక్టులను పూర్తి చేసి 7.80 లక్షల ఎకరాలకు సాగునీరు అందించడమే కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ సంకల్పమన్నారు. శనివారం రోజున నీటిపారుదల శాఖా కేంద్ర కార్యాలయం జలసౌధలో ఆ రెండు ప్రాజెక్టుల పురోగతి పై ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖామంత్రి తుమ్మల

మిగతా 2లో..

- ఈ ప్రాజెక్టుల కింద 7.80 లక్షల ఎకరాలకు సాగునీరు అందించడమే లక్ష్యంగా పెట్టుకున్నాం
- సీతరామ ప్రాజెక్టుకు గత ప్రభుత్వం నీటి కేటాయింపుల సమస్యను పరిష్కరించలేకపోయింది
- కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం 16 నెలల్లోనే సీడబ్ల్యూసీని ఒప్పించి నీటిని సాధించింది: మంత్రి ఉత్తమ్
- క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ ప్రాజెక్టుల పురోగతిని పర్యవేక్షించాలని అధికారులకు సూచన





## హైదరాబాద్‌లో అట్టహాసంగా మిస్‌వరల్డ్ పోటీలు

హైదరాబాద్(జనంసాక్షి): నగరంలో 72వ మిస్ వరల్డ్ పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. శనివారం సాయంత్రం గచ్చిబౌలి స్టేడియం వేదికగా పోటీలను ప్రారంభించారు. ఈ పోటీలకు సీఎం రేవంత్ రెడ్డి హాజరయ్యారు. 110కిపైగా దేశాలకు చెందిన సుందరీమణులు ఈ కిరీటం కోసం పోటీపడుతున్నారు. భారత్ తరఫున మిస్ ఇండియా నందిని గుప్తా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. గచ్చిబౌలి స్టేడియంలో 'జయజయహే తెలంగాణ' రాష్ట్ర గీతం ఆలాపనతో పోటీలు మొదలయ్యాయి. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా నిర్వహించిన కార్యక్రమాలు అలరించాయి. 250 మంది కళాకారులతో పేరిణి నృత్య ప్రదర్శన నిర్వహించారు. పరిచయ కార్యక్రమంలో భాగంగా పోటీదారులు విభిన్న వస్త్రధారణతో ఆకట్టుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, డీజీపీ జితేందర్, తెలంగాణ రాష్ట్ర పర్యాటక శాఖ ఛైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డి, నగర మేయర్ విజయలక్ష్మి, మిస్ వరల్డ్ సీఈవో జూలియా మోర్లే, మిస్ వరల్డ్-2024 విజేత క్రిస్టినా పిస్కోవా తదితరులు ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరయ్యారు.కాగా ఇండో,- పాక్ సరిహద్దుల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో మిస్ వరల్డ్ పోటీలను రద్దు చేయాలని, లేదా

మిగతా 2లో..

### జయజయహే రాష్ట్ర గీతాలాపనతో ప్రారంభం

### 250 మంది కళాకారులతో పేరిణి నృత్య ప్రదర్శన

### ప్రారంభ వేడుకలకు హాజరైన సీఎం రేవంత్

## చైనాపై టారిఫ్‌లు 80 శాతానికి తగ్గిద్దాం

### ట్రంప్ ప్రతిపాదన

వాషింగ్టన్(జనంసాక్షి): చైనాపై విధించిన టారిఫ్‌లను 145% నుంచి 80 శాతానికి తగ్గించాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రతిపాదించారు. ఈ వారాంతంలో అమెరికా, చైనా వాణిజ్య అధికారుల మధ్య సమావేశానికి ముందు ఈ ప్రతిపాదన చేయడం గమనార్హం.చైనా ఉత్పత్తులపై ట్రంప్ భారీగా టారిఫ్‌లను విధించాక, ఇరు దేశాల మధ్య వాణిజ్య యుద్ధ ఉద్రిక్తతలు పెరిగాయి. ఆ తర్వాత మొదటి సారిగా స్విట్జర్లాండ్‌లో ఇరు

మిగతా 2లో..

## 27నే కేరళకు నైరుతి

### తెలంగాణలో మూడు రోజులు వర్షాలు
### హైదరాబాద్ వాతావరణ కేంద్రం

హైదరాబాద్(జనంసాక్షి):న్యూఢిల్లీ(జనంసాక్షి): ఈసారి దేశంలోకి నైరుతి రుతుపవనాలు అంచనాల కంటే ముందే ప్రవేశించనున్నాయి. సాధారణంగా జూన్ 1 నాటికి రుతుపవనాలు కేరళలోకి ప్రవేశించడం ద్వారా దేశమంతటా వర్షాలు మొదలవుతాయి.జులై 8 నాటికి ఇవి దేశమంతా విస్తరిస్తాయి. మళ్లీ వాయవ్య భారతం నుంచి సెప్టెంబరు 17తో రుతుపవనాల ఉపసంహరణ మొదలై అక్టోబరు 15 నాటికి ముగుస్తుంది. ప్రస్తుతం ఇవి జూన్ 1 కంటే ముందుగా మే 27న కేరళను తాకే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ శనివారం ప్రకటించింది. గతేడాది మే 30న రాగా.. 2023 జూన్ 8న, 2022 మే 29న దేశంలోకి ప్రవేశించాయి. ఈ సీజన్‌లో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం

మిగతా 3లో..





## కర్రెగుట్టల్లో కూంబింగ్‌కు బ్రేక్

### ఉద్రిక్తతల నేపథ్యంలో సరిహద్దులకు భారత బలగాలు
### ఆపరేషన్ 'కగార్' తాత్కాలిక వాయిదా

న్యూఢిల్లీ(జనంసాక్షి):ఆపరేషన్ కగార్‌పై ఆపరేషన్ సిందూర్ ఎఫెక్ట్ పడింది. సరిహద్దుల్లో ఉద్రిక్తతల నేపథ్యంలో మావోయిస్టుల ఏరివేతే లక్ష్యంగా కొనసాగుతున్న ఆపరేషన్ కగార్‌కు కేంద్రం తాత్కాలిక బ్రేక్ వేసింది. భారత్ - పాకిస్థాన్ వార్ నేపథ్యంలో కేంద్రం సంచలన నిర్ణయం తీసుకుంది. మావోయిస్టులను ఏరివేసేందుకు కర్రెగుట్టలను జల్లెడ పడుతున్న సీఆర్పీఎఫ్ బలగాలు వెనక్కి

మిగతా 2లో..

## కాల్పుల విరమణపై పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు నిర్వహించండి

### ప్రధాని మోదీ నేతృత్వంలో అఖిలపక్ష సమావేశం నిర్వహించండి

### గత 18 రోజులగా జరిగిన పరిణామాలపై అన్ని పార్టీలకు వివరించండి.. కేంద్రానికి కోరిన కాంగ్రెస్

న్యూఢిల్లీ(జనంసాక్షి):భారత్- పాక్ మధ్య కాల్పుల విరమణకు అంగీకారంపై కాంగ్రెస్ పార్టీ స్పందించింది. ప్రధాని మోదీ నేతృత్వంలో అఖిలపక్ష సమావేశం నిర్వహించి రాజకీయ పార్టీలన్నింటికి జరిగిన పరిణామాలను వివరించాలని కోరింది. పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు

మిగతా 9లో..





## పాక్‌కు ఐఎంఎఫ్ రుణం షాక్‌కు గురిచేసింది

### కాంగ్రెస్

గువహటి(జనంసాక్షి): పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకార చర్యగా భారత్ 'ఆపరేషన్ సిందూర్'తో గట్టిగా బదులు తీర్చుకుంది. ప్రస్తుతం ఇరుదేశాల మధ్య యుద్ధ వాతావరణం నెలకొంది. ఇలాంటి తరుణంలో పాకిస్థాన్‌కు రుణం ఇవ్వకూడదని భారత్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసినప్పటికీ అంతర్జాతీయ

మిగతా 2లో..

జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం
11.05.2025

# ఇకపై ఉగ్ర చర్యలను యుద్ధంగానే పరిగణిస్తాం


తెలుస్తోంది. పాక్‌పై పూర్తి స్థాయి యుద్ధానికి మోదీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని సమాచారం. ఇకపై ఏ ఉగ్రదాడినైనా యుద్ధ చర్యగా పరిగణించాలని, అంతే తీవ్ర స్థాయిలో బదులివ్వాలని ప్రధాని దిశానిర్దేశం చేశారని తెలిసింది. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోబాల్ ఈ కీలక సమావేశంలో పాల్గొన్నారు. భారత్‌లో 26 లొకేషన్లపై పాక్ డ్రోన్ దాడులకు ప్రతిగా శనివారం తెల్లవారు జామున నాలుగు పాక్ ఎయిర్‌బేస్‌లపై భారత్ దాడులు చేసింది. ఈ పరిణామాల నేపథ్యంలో మోదీ ఈ సమావేశం నిర్వహించారు. దేశ భద్రతా విషయంలో మరింత కఠిన వైఖరి ప్రదర్శించాలని సమావేశంలో కీలక నిర్ణయం తీసుకున్నట్టు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. భారత ప్రయోజనాలను దెబ్బతీసేలా భవిష్యత్తులో ఎలాంటి ఉగ్రవాద చర్యలకు పాల్పడినా దానిని యుద్ధ చర్యగా పరిగణించాలని సమావేశంలో కీలక నిర్ణయం తీసుకున్నట్టు ఆ వర్గాలు వెల్లడించాయి. దీంతో ఇకపై ఉగ్రవాద చర్యలను కేవలం అంతర్గతా భద్రతా చర్యలుగానే పరిగణించలేమని, ప్రతిస్పందన అత్యంత భీకరంగా ఉంటుందనే ప్రత్యక్ష హెచ్చరిక సందేశాన్ని భారత్ ఇచ్చినట్లయింది. భారత్‌-పాక్‌ల మధ్య తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్న వేళ ఈ కీలక పరిణామం చోటు-చేసుకుంది. భారత్‌లోని సరిహద్దు రాష్ట్రాలపై పాకిస్థాన్ డ్రోన్లు, క్షిపణులతో వరుసగా దాడులకు పాల్పడుతోంది. విమానాశ్రయాలు, సామాన్య పౌరులే లక్ష్యంగా దాయాది ఈ చర్యలకు దిగుతోంది. ఈ నేపథ్యంలో తాజా పరిస్థితులపై ప్రధాని మోదీ ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తున్నారు. ఇదిలావుంటే గత రెండు రోజులుగా జమ్మూకశ్మీర్, పంజాబ్‌లోని ప్రాంతాల్లో పాకిస్థాన్ చేసిన డ్రోన్ల దాడులను భారత ఆర్మీ సమర్థంగా ఎదుర్కొంది. ఆ దాడులకు ప్రతిస్పందనగా భారత ఆర్మీ ఉగ్రవాద లాంచ్ ప్యాడ్‌లపై ఎటాక్ చేసి ధ్వంసం చేసింది. దానికి సంబంధించిన వీడియోను ఇండియన్ ఆర్మీ తన సోషల్ మీడియా ఖాతాలో పోస్టు చేసింది. భారత సరిహద్దుకు దగ్గరగా ఉన్న ఉగ్రవాద లాంచ్‌ప్యాడ్‌ల నుంచి గతంలో భారత పౌరులు, భద్రతా దళాలపై దాడులకు ప్రణాళికలు రూపొందించారు. ఇక్కడి నుంచి దాడులు కూడా చేశారు. భారత సైన్యం సత్వరమే స్పందించి ఉగ్రవాద స్థావరాలపై దాడి చేసింది. ఇపుడు లాంచ్‌ప్యాడ్‌ను ధ్వంసం చేయడంతో వారి మౌలిక సదుపాయాలు, సామర్థ్యాలకు భారీ దెబ్బ తగిలిందని పోస్టులో భారత ఆర్మీ తెలిపింది. ఇకపోతే పాకిస్థాన్ కావాలనే భారత్‌ను రెచ్చగొడుతోందని, యుద్ధానికి పురిగొల్పుతోందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఒకవేళ ద్వైపాక్షిక చర్చలు, వెనక్కి తగ్గుతామని ప్రకటించినా ఆ దేశాన్ని అంత సులువుగా నమ్మకూడదని అంటున్నారు. గతానుభవాలే ఇందుకు నిదర్శనమిన చెబుతున్నారు. భారత్‌తో పూర్తిస్థాయి యుద్ధానికి కాలు దువ్వితే పాక్ ఆక్రమిత కశ్మీర్, బలోచిస్థాన్ వంటివి కోల్పోవాల్సి వస్తుందని బయం కూడా పాక్‌లో ఉందంటున్నారు. పహల్గాంలో పర్యాటకానికి వచ్చిన వారిని మతం అడిగి మరీ పాకిస్థాన్ ఉగ్రవాదులు దాడికి పాల్పడ్డాక దానికి ప్రతిగా భారత్ 'ఆపరేషన్ సిందూర్' చేపట్టింది. భారత్ కేవలం పాక్ ఉగ్రస్థావరాల మీదే దాడికి పాల్పడింది. మిలటరీ, పౌరుల జోలికి పోలేదు. భారత్ తనంతట తానుగా యుద్ధాన్ని కోరుకోవడం లేదనడానికి ఇదే నిదర్శనం. పాక్ పరిస్థితి వేరు. ఆర్థికంగా అంతంత మాత్రంగానే ఉన్నా.. భారత్‌ను చూసి ఓర్వలేక కావాలనే కయ్యానికి కాలు దువ్వుతోంది. అక్కడి ప్రజలను, దేశ ఆర్థిక పరిస్థితి గురించి పట్టించుకునే పరిస్థితిలో ఆ దేశం లేదు. అక్కడి మిలటరీదే పైచేయి. ఉగ్రవాదుల్ని ముందు పెట్టి మిలటరీ వెనుకుండి నడిపిస్తోందని వీరు అభిప్రాయపడ్డారు. భారత్ తమపై చేస్తున్న సైనిక దాడిని ఇక్కడితో ఆపితే తాము కూడా ఉద్రిక్తతలు తగ్గించడానికి చర్యలు తీసుకుంటామని పాక్ విదేశాంగ శాఖ మంత్రి చేస్తున్న వ్యాఖ్యలను నమ్మరాదనికూడా వీరు హెచ్చరిస్తున్నారు. ఇలా చెబుతూనే మరోవైపు తమ సైన్యాన్ని సరిహద్దులవైపు నడిపిస్తోంది. మన దృష్టి మరల్చేందుకు పాక్ ఇలాంటి కుయుక్తులను పన్నుతుందని, పాక్ ఎప్పుడు ఏ మూల నుంచైనా దాడి చేసే అవకాశం ఉందని గుర్తుంచాలని అన్నారు. పాక్ ఓ వైపు డ్రోన్లను ప్రయోగిస్తోంది. స్కూళ్లు, ప్రార్థనా మందిరాలు, ఆస్పత్రుల మీద దాడులు చేస్తోంది. మనం పాక్ పౌరుల జోలికి పోకపోయినా.. దాయాది దేశం మాత్రం ఉన్మాదంతో ఈ తరహా దాడులకు పాల్పడుతోంది. తమ ఆర్మీ బలమైనదని నిరూపించుకునే ప్రయత్నం చేస్తోందని అన్నారు. ఒకవేళ ప్రస్తుత ఉద్రిక్తత పరిస్థితులను నిజంగా తగ్గించుకోవాలని ఆ దేశం అనుకుంటే పాకిస్థానే వెనక్కి తగ్గాలి కదా అని అన్నారు. ఉగ్రవాదులను రెచ్చగొట్టి భారత్‌పై ఉసిగొల్పుతున్న పాకిస్థానే ఈ విషయంలో వెనక్కి తగ్గక పోవడం వెనక ఆర్మీ ప్రోద్బలం ఉందన్నారు. గతంలో భారత్‌తో పెట్టుకుని తూర్పు పాకిస్థాన్ గా ఉన్న బంగ్లాదేశ్ను కోల్పోయింది. కార్గిల్ విషయంలో ఎదురుదెబ్బ చూసింది. ఆర్థికంగానూ నష్టపోయింది. ఇప్పుడూ అదే ధోరణిని కనబరిస్తే పీఓకేను స్వాధీనం చేసుకోవడానికి భారత్ ఏమాత్రం వెనుకాడరాదని నిపుణులు సూచిస్తున్నారు. మరోవైపు పాక్ బలోచిస్థాన్ రూపంలో తిరుగుబాటు- ఎదుర్కొంటోంది. ఏ క్షణంలోనైనా బలోచిస్థాన్ విముక్తి జరగొచ్చు. పాకిస్థాన్‌కు అఫ్గానిస్థాన్‌తోనూ గొడవలు ఉన్నాయని అంటున్నారు. భారత్‌తో నేరుగా తలపడలేని పాకిస్థాన్ ఓ వైపు ఫేక్‌న్యూస్‌ను ప్రచారం చేస్తోందని హెచ్చరించారు. ఇవన్నీ దృష్టిలో పెట్టుకుని పాక్‌ను దనుమాడాలని కూడా సూచిస్తున్నారు.

# పాక్‌కు దెబ్బమీద దెబ్బ

### స్వతంత్ర దేశంగా ప్రకటించుకున్న బలూచీ

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**యుద్ధం వల్ల పాకిస్తాన్‌కు తేరుకోలేని దెబ్బ తగులుతోంది. పాక్ ఆర్థికంగా కోలుకోవడానికి ఇంకో వందఏళ్లు పడుతుందని అంటున్నారు. అసలుకే ఆర్థికంగా చితికి పోయిన పాక్ ఈ యుద్ధంతో భారీగా నష్టపోయింది. ఇంకా నష్టపోతుంది కూడా. భారత్ ఎంతో తెలివిగా పాకిస్తాన్ ఆర్థిక మూలాలను దెబ్బ తీస్తోంది. ఏయిర్‌బేస్‌లను టార్గెట్ చేసి ధ్వంసం చేస్తోంది. తాజాగా, దాదాపు 60 ఏళ్ల చరిత్ర కలిగిన రహీమ్యార్ ఏయిర్‌బేస్‌ను భారత్ ధ్వంసం చేసింది. ఈ ఏయిర్‌బేస్ రాజస్తాన్ సరిహద్దు ప్రాంతానికి అతి దగ్గరలో ఉంది. మిలటరీ కార్యకలాపాలతో పాటు సివిల్ ఏవియేషన్‌కు కూడా పాక్ దీన్ని వాడుతోంది. చరిత్రలో ఎంతో ప్రాధాన్యత కలిగిన ఈ ఏయిర్‌బేస్, ఇంటర్‌నేషనల్ ఏయిర్‌పోర్టును భారత్ ధ్వంసం చేసింది. భారత్‌పై దాడి చేసి నష్టాన్నికలిగించామని అబద్దాలు ప్రచారం చేసుకుంటున్న పాక్, తమ దేవంలో జరుగుతున్న నష్టాన్ని కప్పి పు÷-చుకుంటోంది. మరోవైపు స్థానిక ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వస్తోంది. ఇప్పటికే పలువురు ఎంపిలు ప్రధాని షెహబాజ్‌ను తిట్టి పోస్తున్నారు. మరోవైపు బలూచీ ఆందోళనలు, దాడులు పాక్‌ను ఊపిరిపీల్చుకోకుండా చేస్తున్నాకు. భారత్‌తో యుద్ధానికి దిగిన పాకిస్థాన్‌కు బలూచిస్థాన్ పక్కలో బల్లెంలా మారింది. బలూచిస్థాన్‌ను స్వతంత్య్ర దేశంగా ప్రకటించుకునే దిశగా బలూచిస్థాన్ లిబరేషన్ ఆర్మీ' (బీఎల్‌ఏ), ఇతర వేర్పాటువాద గ్రూప్‌లు అడుగులు వేస్తున్నాయి. తాము స్వాతంత్య్రం పొందామని బలూచిస్థాన్‌ను ప్రత్యేక దేశంగా గుర్తించాలని ఐక్యరాజ్యసమితి, ప్రపంచ దేశాలకు విజ్ఞప్తి చేశాయి. బలూచిస్థాన్‌లో వరుస దాడులతో పాక్ సైన్యాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. భారత్‌పై మిస్సైళ్లు, డ్రోన్లతో దాడి చేసేందుకు పాక్ సైన్యం ప్రణాళికలు రచిస్తుంటే.. బలూచిస్థాన్‌లో కీలక ప్రాంతాలపై బీఎల్‌ఏ పట్టు- సాధిస్తున్నది. బాంబుదాడులు, బుల్లెట్లతో విరుచుకుపడుతూ అక్కడ గస్తీ కాస్తున్న పాక్ సైన్యానికి కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నది. మొత్తంగా ఇటు- తూర్పు ప్రాంతమైన భారత్ నుంచి, అటు- పశ్చిమ ప్రాంతమైన బలూచిస్థాన్ నుంచి జరుగుతున్న దాడులతో పాకిస్థాన్ ఉక్కిరిబిక్కిరి అవుతున్నది.

# కాల్పుల విరమణ ప్రతిపాదన.. వెనువెంటనే ఉల్లంఘన



పోఖ్రాన్‌లో, శ్రీనగర్‌లోని ఆర్మీ హెడ్ క్వార్టర్స్ సమీపంలో పలు డ్రోన్లను కూల్చివేసినట్లు సమాచారం. మళ్లీ ఉద్రిక్త పరిస్థితులు తలెత్తడంతో పంజాబ్‌లోని పఠాన్‌కోట్, ఫిరోజ్‌పుర్, రాజస్థాన్‌లోని జైసల్మేర్, బాడ్‌మేర్‌లలో పూర్తిగా కరెంటు నిలిపివేశారు. కరువాలో బ్లాక్‌అవుట్ పాటిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా సైరన్లు మోగుతున్నాయి. పంజాబ్‌లోని మోగాలోనూ కరెంటు నిలిపివేశారు. గుజరాత్‌లోనూ పాకిస్థాన్ డ్రోన్ దాడులకు తెగబడినట్లు తెలుస్తోంది. కచ్ జిల్లాలో అనేక చోట్ల డ్రోన్లు కనిపించాయని గుజరాత్ హోంమంత్రి హర్ష్ సంఘవి వెల్లడించారు. ప్రస్తుతం పూర్తి బ్లాక్‌అవుట్ అమలు చేస్తున్నామని చెప్పారు. ప్రజలు సురక్షితంగా ఉండాలని, భయాందోళనలకు గురికావద్దని 'ఎక్స్' వేదికగా సూచించారు.

విదేశాంగశాఖ మంత్రి ఎస్ జైశంకర్ ఎక్స్ వేదికగా స్పందించారు. కాల్పుల విరమణ, సైనిక చర్యలను నిలిపివేయడంపై భారత్, పాక్ ఈ రోజు ఓ అవగాహనకు వచ్చాయన్నారు. ఉగ్రవాదం విషయంలో మాత్రం భారత్ తన రాజీలేని వైఖరిని కొనసాగిస్తుందని పేర్కొన్నారు. అంతకు ముందు నడ్డి విరిగి..నడవలేని పరిస్థితుల్లో పాకిస్తాప్ కాళ్లబేరానికి వచ్చింది. నేరుగా భారత్ కాళ్లనే పట్టుకున్నా...కాదనడంతో అమెరికాను ఆశ్రయించింది. చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో చెప్పించింది. ఐదు రోజుల్లోనే పాక్ ఇక ముందుకు అడుగు వేయలేని దుస్థితికి చేరింది. భారత రక్షణ దళాల దెబ్బకు పాక్ కోలుకోలేని దెబ్బతింది. ఇక యుద్ధంకాదుకదా...భారత సైన్యం ముందు నిలబడలేని దుస్థితికి వచ్చింది. ఈ క్రమంలో యుద్ధం వద్దంటూ కాళ్లావేళ్లా పడింది. మరోవైపు ప్రతీ ఉగ్రదాడిని యుద్ధచర్యగానే పరిగణిస్తామని శనివారం భారత్ చేసిన ప్రటకనతో వణికిపోయింది. మరోవైపు బలూచీస్థాన్ స్వతంత్రం ప్రకటించకుంది. ఈ క్రమంలో భారత్‌తో తలపడలేని పరిస్థితిలో చేతులెత్తేసింది. ఇప్పటికే చేయాల్సిన నష్టం చేసిన భారత్ కూడా ...కాల్పుల విరమణకు సరేనంది. అయితే..షరతలు వర్తిస్తాయని తేల్చిచెప్పేసింది. ఈ క్రమంలో విదేశాంగ మంత్రి జై శంకర్ కాల్పుల విరమణ ప్రకటిస్తూ ట్వీట్ చేశారు. మొత్తంగా పహల్గామ్ ఊచకోత తరవాత..పివోకెలో ఉగ్ర శిబిరాలపై దాడితో పాక్ దిమ్మతిరిగి మైండ్ బ్లాక్ అయ్యింది. తామేమీ తక్కువ తినలేదని బీరాలకు పోయి యుద్దానికి కాలు దువ్వింది. గత బుధవారం భారత్ ఉగ్రశిబిరాలను ధ్వంసం చేయగానే ..పాక్ యుద్దానికే దిగింది. దీంతో భారత్ తన దెబ్బ ఎలావుంటుందో రుచి చూపింది. ఈ దెబ్బకే దిమ్మతిరిగిన పాక్ చేతులెత్తేసింది. ఇప్పటికే అక్కడి ఎంపిలు పాక్‌ను దమ్మెత్తి పోశారు. యుద్ధం చేయలేమని హెచ్చరించారు. వినకుండా ఆర్మీ చీఫ్ మునీర్ ఒత్తిడితో కాలుదువ్వి...కాళ్లు విరగొట్టుకుంది. మొత్తంగా గత కొన్ని రోజులుగా భారత్‌-పాక్ మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తతలకు తెరపడింది. కాల్పుల విరమణకు ఇరు దేశాలు

# అంతకు ముందు ఇరుదేశాలు కాల్పుల విరమణకు అంగీకారం

అంగీకరించినట్లు భారత విదేశాంగశాఖ ప్రకటించింది. శనివారం సాయంత్రం 5గంటల నుంచి ఇవి అమల్లోకి వచ్చినట్లు తెలిపింది. అంతకుముందు ఇదే అంశంపై స్పందించిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. భారత్‌-పాక్‌లు కాల్పుల విరమణకు అంగీకరించాయని, ఇందుకు అమెరికా మధ్యవర్తిత్వం వహించిందని ప్రకటించారు. శనివారం సాయంత్రం భారత విదేశాంగశాఖ ప్రతినిధి విక్రమ్ మిస్రీ మాట్లాడుతూ.. మధ్యాహ్నం 3.35 గంటలకు ఇరుదేశాల డైరెక్టర్ జనరల్ ఆఫ్ మిలటరీ ఆపరేషన్స్ స్థాయిలో ఇరుదేశాల మధ్య చర్చలు జరిగాయి. పాకిస్థాన్ డీజీఎంఓ భారత డీజీఎంవోకు ఫోన్ చేశారు. కాల్పుల విరమణకు ఇరు దేశాల సైనికాధికారులు అంగీకరించారు. సాయంత్రం 5గంటల నుంచి ఇది అమల్లోకి వచ్చింది. భూ, గగన, సముద్రతలాల నుంచి ఇరు దేశాల మధ్య కాల్పుల విరమణ కొనసాగుతుంది. వీటికి సంబంధించి ఇరుదేశాల సైన్యానికి తగిన ఆదేశాలు వెళ్లాయి. నెల 12న సాయంత్రం డీజీఎంవోలు మళ్లీ చర్చలు జరుపుతారని విదేశాంగ మంత్రి విక్రమ్ మిస్రీ వెల్లడిం చారు. ఇరు దేశాల మధ్య కుదిరిన కాల్పుల విరమణపై విదేశాంగశాఖ మంత్రి ఎస్ జైశంకర్ ఎక్స్ వేదికగా స్పందించారు. కాల్పుల విరమణ, సైనిక చర్యలను నిలిపివేయడంపై భారత్, పాక్ ఈ రోజు ఓ అవగాహనకు వచ్చాయన్నారు. ఉగ్రవాదం విషయంలో మాత్రం భారత్ తన రాజీలేని వైఖరిని కొనసాగి స్తుందని పేర్కొన్నారు. పహల్గాం ఉగ్రదాడితో కయ్యానికి కాలుదువ్విన పాకిస్తాన్ ఇప్పుడు భారత్ కన్నెర్ర చేయడంతో దిగ్గుతోచని పరిస్థితుల్లో పడింది. ఓవైపు ఆర్థిక వ్యవస్థ కుదేలయ్యిందంటూ ప్రపంచ దేశాల ముంగిట రుణాల కోసం వెంపర్లాడుతూ, ఉద్రిక్తతలు తగ్గించేందుకు ముందుగా భారత్ చొరవ తీసుకోవా లంటూ మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తోంది. మరోవైపు, సొంత పౌరుల ప్రాణాలు బలపెట్టేందుకు నిస్సిగ్గుగా సిద్ధమవుతోంది. పాకిస్తాన్ దాడుల విషయంలో కేవలం ప్రతిసారీ మౌనంతో సాధ్యపడదని భారత్ ఇటీవల దాడులతో నిరూపించింది. ఈ క్రమంలోనే భారత్, పాకిస్తాన్ మధ్య ఉద్రిక్తతలు తీవ్ర స్థాయికి చేరుకున్నాయి. భారత్, తన శక్తిని మౌనంగా చూపించకుండా, స్పష్టంగా వ్యూహాత్మకంగా పాకిస్తాన్ దురుద్దేశాలకు గట్టి కౌంటర్ ఇచ్చింది. ఈ ప్రతిస్పందనతో పాక్ చివరికి వెనక్కి తగ్గింది. అమెరికా మధ్యవర్తిత్వంతో, కాల్పుల విరమణ ఒప్పందానికి భారత్ అంగీకరించింది. ఈ నేపథ్యంలో శనివారం సాయంత్రం ఈ పరిస్థితులకు ముగింపు లభించింది. అయితే శాంతి అంటే బలహీనత మాత్రమే కాదు. అది సమర్థత, స్థిరత్వం, దేశ ప్రజల పట్ల నిబద్ధత గురించి ఆలోచించి తీసుకున్న నిర్ణయమని చెప్పవచ్చు. ఈ పరిణామం శాంతిని నిలుపు కోవడంతోపాటు సైనిక శక్తి ఎలా ఉపయోగిస్తుందో భారత్ మరోసారి పాకిస్తాన్ సహా అనేక దేశాలకు చూపించింది. ఈ క్రమంలో ఇరు దేశాల ప్రజల ప్రాణాల గురించి ఆలోచించిన భారత్ చివరకు శాంతి విధానానికి సమ్మతించింది. భారత్‌పై ఇటీవల పలు వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన ఆ దేశ రక్షణ శాఖ మంత్రి ఖవాజా ఆసిఫ్ తాజాగా మరోసారి తన నీచ బుద్ధిని, చేతకానితనాన్ని చాటుకున్నారు. ఇందుకు నిస్సిగ్గుగా పార్లమెంటును వేదికగా చేసుకున్నారు. అత్యవసర పరిస్థితులు తలెత్తితే మదర్సాలలో చదువుకునే విద్యార్థులను రెండవ రక్షణ కవచంగా ఉపయోగిస్తామని ఖవాజా ఆసిఫ్ పార్లమెంటులో ప్రకటించారు. అయితే భారతదేశం ప్రతీకార చర్యతో పాకిస్థాన్ పూర్తిగా భయపడింది. మధ్యవర్తిత్వం కోసం అమెరికాను ఆశ్రయించింది.

# కాల్పుల విరమణ ఒప్పందం ఉల్లంఘన అత్యంత దుర్మార్గం

మీడియాతో మాట్లాడారు. కాల్పుల విరమణ అవగాహనను పాక్ ఉల్లంఘించడం సరికాదన్నారు. డీజీఎంవో మధ్య జరిగిన అవగాహనను ఉల్లంఘించడాన్ని ఖండిస్తున్నట్టు చెప్పారు. కొన్ని గంటలుగా పాక్ కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తోందని, ఇది అత్యంత దుర్మార్గమని ఘాటుగా స్పందించారు. కాల్పుల ఉల్లంఘనకు సంపూర్ణ బాధ్యత పాక్‌దేనని స్పష్టం చేశారు. సరిహద్దుల్లో పాక్ ఉల్లంఘనలకు సైన్యం తగిన విధంగా జవాబిస్తుందన్నారు. పాక్ అతిక్రమణను నిలువరించేందుకు సైన్యానికి సంపూర్ణ అధికారాలు ఇచ్చామని తెలిపారు. ఇప్పటికైనా ఈ ఉల్లంఘనలను పాకిస్థాన్ నిలువరిస్తుందని ఆశిస్తున్నట్టు విక్రమ్ మిస్రీ చెప్పారు.

## అబద్దాల ప్రచారంలో పాక్ ఆరితేరింది

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**పాకిస్తాన్ అబద్దాలు ప్రచారం చేస్తూనే..జనావాసాలు, ప్రార్థనా మందిరాలు లక్ష్యంగా దాడులు చేస్తోందని, అయితే వీటిన భారత్ దళాలు తిప్పికొట్టాయని భారత రక్షణశాఖ వెల్లడించింది. విదేశాంగశాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ, కల్నల్ సోఫియా ఖురేషీ, వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్‌లు ఆపరేషన్ సింధూర్‌పై ఢిల్లీలో మీడియా ప్రతినిధుల సమావేశం నిర్వహించారు. శనివారం ఉదయం జరిగిన ఈ మీడియా సమావేశంలో మిస్రీ మాట్లాడుతూ.. ' గత రెండు రోజుల నుంచి పాకిస్తాన్ రెచ్చగొట్టే విధంగా ప్రవర్తిస్తోంది. పాకిస్తాన్ రెచ్చగొట్టే చర్యలకు భారత్ కేవలం ప్రతిస్పందిస్తోంది. పాకిస్తాన్ దాడులను అడ్డుకుంటోంది.. తిప్పికొడుతోంది' అని అన్నారు. అనంతరం కల్నల్ సోఫియా ఖురేషి మాట్లాడుతూ.. ' పశ్చిమ భాగం వైపు పాకిస్తాన్ దాడులకు పాల్పడుతోంది. భారత సైనికులు లక్ష్యంగా డ్రోన్లు, లాంగ్ రేంజ్ ఆయుధాలతో దాడులు చేస్తోంది. నియంత్రణ రేఖ వెంబడి కూడా కాల్పులకు తెగబడుతోంది. మిస్సైల్స్‌తో కూడా దాడులకు ప్రయత్నించింది. వాటిని ఆర్మీ విజయవంతంగా ధ్వంసం చేసింది. భారత ఏయిర్ బేస్‌లపై దాడులకు యత్నించింది. ఉదమ్ పూర్, పఠాన్ కోట్, ఆదమ్ పూర్‌లతో పాటు- మరికొన్ని చోట్ల కాల్పులకు తెగబడింది. పలువురు సైనికులు గాయపడ్డారని అన్నారు. వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్ మాట్లాడుతూ.. పాకిస్తాన్ తప్పుడు ప్రచారాలు చేస్తోంది. ఇండియన్ ఃూ-400 సిస్టమ్‌ను.. సిర్సా, సూరత్ ఘర్‌లోని ఏయిర్ ఫీల్డ్స్‌ను ధ్వంసం చేసినట్లు- ప్రచారం చేస్తోంది. పాకిస్తాన్ చేస్తున్నవన్నీ తప్పుడు ప్రచారాలు. అందులో ఎలాంటి సందేహం లేదు' అని అన్నారు. పాక్ సైన్యం సరిహద్దుల దిశగా కదులుతోందని ఆర్మీ ప్రతినిధి సోఫియా ఖురేషీ పేర్కొన్నారు. పశ్చిమ సరిహద్దుల్లో పాక్ నిరంతరం దాడులు చేస్తోంది. డ్రోన్లు, దీర్ఘశ్రేణి ఆయుధాలు, లాయిటరింగ్ మ్యూనిషన్, ఫైటర్ జెట్లను వాటి.. భారత మిలిటరీ స్థావరాలపై దాడులు చేస్తోంది. చాలా ముప్పులను భారత్ తిప్పికొట్టింది. కానీ, 26 చోట్ల పాక్ ఆయుధాలు గగనతలంలోకి చొచ్చుకొచ్చాయి. అవి ఉధంపూర్, భుజ్, పఠాన్‌కోట్, భటిండా వాయుసేన స్థావరాల్లోని పరికరాలను దెబ్బతీసి, సిబ్బందిని గాయపర్చాయి.


# ఢిల్లీ లక్ష్యంగా పాక్ క్షిపణి ప్రయోగం

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**ఒక పక్క భారత దళాల ధాటికి విలవిలలాడుతున్నప్పటికీ.. పాకిస్థాన్ తన వక్ర బుద్ధి చూపిస్తూనే ఉంది. భారత్ పై మిస్సైళ్లతో దాడికి పాల్పడుతూ రెచ్చగొడుతోంది. జనావాసాలు లక్ష్యంగా దాడులకు పాల్పడుతూ రెచ్చొట్టే చర్యలకు దిగుతోంది. ఢిల్లీ, శ్రీనగర్‌తో పాటు, సరిహద్దు వెంబగి గ్రామాలపై దాడులకు తెగబడుతోంది. ఢిల్లీపై దాడి చేయడమే లక్ష్యంగా చేసిన దాడిని భారత్ సైన్యం ధీటుగా తిప్పికొట్టింది. పాకిస్థాన్ డ్రోన్లను మన సైన్యం ఎప్పటికప్పుడు తిప్పికొడుతున్నా.. మళ్ళీ క్షిపణులు ప్రయోగిస్తోంది. తాజాగా ఢిల్లీని టార్గెట్ చేసుకున్న పాక్.. శనివారం ఫతా 2 క్షిపణి ప్రయోగించింది. అయితే.. ఫతా 2 క్షిపణిని భారతదళాలు కూల్చేసాయి. హర్యానాలోని సిర్సా సమీపంలో భారత వైమానిక రక్షణ దళాలు ఆ క్షిపణిని అడ్డుకుని ధ్వంసం చేసినట్లు సమాచారం. ఫతా 2 క్షిపణి ఉపరితలం నుండి ఉపరితలానికి 400 కిలోమీటర్ల రేంజ్ తో ఉంటుందని తెలుస్తుంది. శనివారం తెల్లవారుజామున, రావల్పిండిలోని నూర్ ఖాన్, పంజాబ్‌లోని చక్వాల్‌లోని మురిద్, షోర్కోట్‌లోని రఫీకితో సహా నాలుగు పాకిస్తాన్ వైమానిక స్థావరాలపై భారత దళాలు దాడి చేసినట్లు సమాచారం. పాకిస్తాన్ వైమానిక స్థావరాలపై దాడి జరిగినట్లు ఆ దేశ డైరెక్టర్ జనరల్ ఇంటర్ సర్వీసెస్ పబ్లిక్ రిలేషన్స్ లెఫ్టినెంట్ జనరల్ అహ్మద్ షరీఫ్ చౌదరి వెల్లడించారు. ఎల్‌ఓసీ వెంబడి 26 డ్రోన్లు కనిపించాయని.. వీటిలో అనుమానిత సాయుధ డ్రోన్లు ఉన్నాయి. బారాముల్లా, శ్రీనగర్, అవంతిపోరా, నగ్రోటా, జమ్మూ, ఫిరోజ్‌పూర్, పఠాన్‌కోట్, ఫాజిల్కా, లాల్‌గఢ్ జట్టా, జైసల్మేర్, బార్మర్, భుజ్, కుర్బెట్ మరియు లఖీ నాలా ఉన్నాయి. విచారకరంగా, ఫిరోజ్‌పూర్‌లోని పలు ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుని డ్రోన్ దాడికి పాల్పడ్డట్టు ప్రభుత్వం తెలిపింది. భారత్‌పై క్షిపణులు, డ్రోన్లతో దాడులకు తెగబడుతున్న పాకిస్థాన్ తాజాగా శ్రీనగర్‌లో మరోసారి భారీ పేలుళ్లు సంభవించినట్లు ఆర్మీ అధికారులు పేర్కొన్నారు. శ్రీనగర్ విమానాశ్రయం సమీపంలో ఉదయం 11.45 గంటల ప్రాంతంలో రెండు భారీ పేలుళ్ల శబ్దాలు వినిపించాయని తెలిపారు. ఈ పేలుళ్ల కారణంగా ప్రజలు భయాందోళనకు గురయ్యారని.. విద్యుత్ సరఫరా నిలిచిపోయిందని అన్నారు. పేలుళ్ల శబ్దం వినిపించిన వెంటనే పలు ప్రాంతాల్లో సైరన్లు మోగించి.. ప్రజలను అప్రమత్తం చేశామని పేర్కొన్నారు. అవంతి పురం సమీపంలో ఐదుసార్లు భారీ పేలుడు శబ్దాలు వినిపించినట్లు అధికారులు పేర్కొన్నారు. శ్రీనగర్‌లోని దాల్ సరస్సులో క్షిపణి లాంటి వస్తువు పడినట్లు- గుర్తించామన్నారు. శనివారం తెల్లవారు జామున శ్రీనగర్ విమానాశ్రయంపై.. ఎయిర్ బేస్‌పై డ్రోన్లతో దాడి చేయగా.. సైన్యం వాటిని తిప్పికొట్టింది. సరిహద్దు ప్రాంతాల్లో పాక్ వరుస దాడులకు పాల్పడుతుండడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

# సీతారామ, సీతమ్మసాగర్ ప్రాజెక్టుల పూర్తికి ప్రణాళికలు

నాగేశ్వరరావు, రెవిన్యూ శాఖామంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి నీటిపారుదల శాఖా ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్,ఆర్ ఆర్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి, నీటిపారుదల శాఖా సలహాదయూ అదిత్యా దాస్ నాథ్,ఇ. ఎన్.సి అనిల్ కుమార్,సి.ఇ శ్రీనివాస రెడ్డి తదితరులు పాల్గొన్నారు అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ సీతారామ ప్రాజెక్టుకు గత ప్రభుత్వ హయాంలో నీటి కేటాయింపులు సాధించ లేక పోయిందని ఆయన తెలిపారు. కేవలం 16 నెలల వ్యవధిలో కాంగ్రెస్ ప్రభుత్వం సి.డబ్ల్యూ.సి ని ఒప్పించి 67 టి.యం.సి ల నీటిని కేటాయించుకున్నట్లు ఆయన వెల్లడించారు ప్రాజెక్టు పురోగతి పై ఆయన స్పందిస్తూ ఇప్పటికే మూడు పంప్ హౌజ్ ల నిర్మాణం పూర్తి కావడంతో పాటు నాలుగో పంప్ హౌజ్ నిర్మాణ దశలో ఉందన్నారు.మొత్తం మీద ఇప్పటికీ 97 శాతం పనులు పూర్తి అయినట్లు ఆయన వెల్లడించారు. పాలేరు లింక్ కెనాల్,సత్తుపల్లి ట్రంక్ కెనాల్,ఎన్కూరు లింక్ కెనాల్లు పురోగతిలో ఉన్నయని,భూసేకరణను పూర్తి చేయడంతో పాటు టన్నెల్ నిర్మణాలకు సంబంధించిన పర్యావరణ అనుమతులు త్వరితగతిన పొందేందుకు ప్రణాళికలు రూపొందించుకున్నట్లు ఆయన తెలిపారు. అయితే అదే సమయంలో పనులలో జరుగుతున్న జాప్యం పై ఆయన అధికారులను సూటిగా ప్రశ్నిస్తూ వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారుక్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ ప్రాజెక్టుల పురోగతిని పర్యవేక్షించాలని ఆయన అధికారులకు సూచించారు. తదుపరి సమీక్షా సమావేశం నాటికి భూసేకరణ పురోగతితో పాటు చెల్లింపులకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని అందించాలని అధికారులను ఆయన ఆదేశించారు సీతమ్మ సాగర్ మల్టిపర్పస్ ప్రాజెక్టుకు అవసరమైన పర్యావరణ అనుమతులు వేగవంతంగా పూర్తి చేసేందుకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. ఈ ప్రాజెక్టు కు సంబంధించి కొన్ని పనులు అనుమతులు లేకుండానే ప్రారంభించినందుకు జాతీయ హరిత ట్రిబ్యునల్ విధించిన 53.41 కోట్ల జరిమానాను రద్దు పరిచేందుకు చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇదే ప్రాజెక్టుకు అనుసంధానంగా నిర్మిస్తున్న 282.8 మేఘా వాట్ల విద్యుత్ ఉత్పత్తి కేంద్రానికి సంబంధించిన ప్రతిపాదనలు జెన్కో కు పంపించినట్లు ఆయన తెలిపారు దుమ్ముగూడెం-పాలేరు మెయిన్ కెనాల్ పూర్తికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. గోదావరి జలాలతో ఉమ్మడి ఖమ్మం జిల్లాను సస్యశ్యామలం చేసేందుకు కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం కట్టుబడి పని చేస్తుందని,అందుకు సంబంధించిన ప్రణాళికలు రూపొందించుకుని పనులలో వేగవంతం పెంచేందుకు అన్ని రకాల చర్యలు తీసుకున్నామన్నారు. ఇల్లెందు మాజీ శాసనసభ్యులు గుమ్మడి నర్సయ్య ప్రతిపాదించిన ప్రతిపాదనలను పరిశీలనలోకి తీసుకుంటామన్నారు. సాధ్య సాధ్యాలను పరిశీలించి తుది నిర్ణయం తీసుకుంటున్నామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.

## హైదరాబాద్‌లో అట్టహాసంగా మిస్ వరల్డ్ పోటీలు



వాయిదా వేయాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. ఈనెల 31వ తేదీ వరకు నగరంలోని గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో అత్యంత వైభవంగా ఈ పోటీలను నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు- చేస్తోంది. జూన్ 1వ తేదీన హైటె-క్స్‌లో గ్రాండ్ ఫినాలే జరుగనుండగా 120 దేశాలకు చెందిన సుందరీమణులు ఈ పోటీ-ల్లో పాల్గొంటున్నారు.

# కర్రెగుట్టల్లో కూంబింగ్‌కు బ్రేక్

రావాల్సిందిగా కేంద్రం ఆదేశించింది. దీంతో కర్రెగుట్టల్లో మావోయిస్టుల వేటకు విరామం పడింది. దాదాపు ఐదు వేల మందికి పైగా బలగాలను కేంద్రం వెనక్కి రప్పిస్తోంది. కర్రెగుట్టల నుంచి బలగాలు వెనక్కి వెళ్తున్నాయి. తెలంగాణ - ఛత్తీస్‌గఢ్ సరిహద్దులోని సీఆర్‌పీఎఫ్ కోబ్రా జవాన్లను తమ హెడ్ క్వార్టర్స్‌లో రిపోర్ట్ చేయాలని ఆదేశాలు జారీ అయ్యాయి. దీంతో కేంద్ర బలగాలు హుటాహుటిన వెనుతిరుగుతున్నాయి. ములుగు జిల్లాలోని వెంకటాపురం, ఆలూబాక, వీరభద్రవరం పెద్దగుట్ట పరిసరాల్లో మోహరించిన బలగాలకు రిలీవ్ ఇచ్చారు. కేంద్రం ఆదేశాల మేరకు ఆదివారం ఉదయంలోగా భారత్‌- పాక్ బార్డర్‌కు బలగాలు వెళ్లనున్నాయి. కాగా.. వచ్చే ఏడాది మార్చి నాటికి మావోయిస్టులు లేకుండా చేయడమే లక్ష్యంగా చేపట్టిన ఆపరేషన్ కగార్ దూకుడుగా సాగుతోంది. ఆపరేషన్ కగార్‌లో జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లో భారీగా మావోయిస్టులు ప్రాణాలు కోల్పోయారు. వారిలో పలువురు అగ్రనేతలు కూడా ఉన్నారు. గత కొద్దిరోజులుగా ఆపరేషన్ కర్రెగుట్టలు పేరుతో మావోయిస్టులను ఏరివేసేందుకు భద్రతా బలగాలు కర్రెగుట్టలపై సెర్చ్ కొనసాగిస్తున్నాయి. మావోయిస్టు అగ్రనేతలే టార్గెట్‌గా ఆపరేషన్ కర్రెగుట్టల్లో పెద్ద ఎత్తున కూబింగ్ కొనసాగిస్తున్నారు. 145 ఎకరాల విస్తీర్ణం ఉన్న కర్రెగుట్టల చుట్టూ దాదాపు పదివేల మంది భద్రతా బలగాలు మోహరించి ఉన్నాయి. అలాగే కర్రెగుట్టల్లో బంకర్లను ఏర్పాటు- చేసుకుని మావోయిస్టులు ఉన్నట్లు- గుర్తించిన భద్రతా బలగాలు కర్రెగుట్టలను జల్లడపడుతున్నాయి. గత కొద్దిరోజులుగా జరుగుతున్న కూంబింగ్‌లో పలువురు మావోయిస్టులు తారసపడటంతో ఎన్‌కౌంటర్లు జరిగాయి. చాలా మంది మావోయిస్టులు మరణించారు కూడా. అలాగే మావోయిస్టులు అమర్చిన మందుపాతర పేలి నలుగురు గ్రౌహౌండ్స్ కానిస్టేబుళ్లు ప్రాణాలు కోల్పోయారు. మావోయిస్టుల కోసం మరింతగా కూంబింగ్ నిర్వహిస్తున్న సమయంలో బలగాలను వెంటనే వెనక్కి రావాల్సిందిగా కేంద్రం నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి. భారత్‌-పాక్ యుద్ధం నేపథ్యంలో సీఆర్పీఎఫ్ బలగాను కేంద్రం వెనక్కి రప్పిస్తోంది. దీంతో బార్డర్‌కు వెళ్లేందుకు భద్రతా బలగాలు కర్రెగుట్టలను వీడుతున్నారు.

## చైనాపై టారిఫ్‌లు 80 శాతానికి తగ్గిద్దాం

దేశాల అధికారులు చర్చలు జరపనున్నారు. చైనాపై 80 శాతం టారిఫ్ సరైనవని ట్రంప్ తన సామాజిక మాధ్యమ ఖాతాలో పేర్కొన్నారు. ప్రస్తుతం చైనాపై అమెరికా టారిఫ్‌లు 145 శాతం, అమెరికాపై చైనా టారిఫ్‌లు 125 శాతంగా ఉన్నాయి.

# పాకిస్థాన్‌కు ఐఎంఎఫ్ రుణం షాక్‌కు గురిచేసింది

ద్రవ్య నిధి నుంచి 1 బిలియన్ డాలర్ల నిధులు (దాదాపు రూ.8,540 కోట్లు) మంజూరయ్యాయి. ఎక్స్‌టెండెడ్ ఫండ్ ఫెసిలిటీ కింద ఈ మొత్తాన్ని ఇవ్వడానికి ఐఎంఎఫ్ ఆమోదం తెలిపింది. దీనిపై కాంగ్రెస్ ఎంపీ గౌరవ్ గొగొయ్ స్పందించారు. పాక్‌కు ఐఎంఎఫ్ రుణం ఇవ్వడం షాక్‌కు గురి చేసిందన్నారు. 'పహల్గాం దాడి తర్వాత %ఖుణ% 1 బిలియన్ డాలర్ల రుణం ఆమోదించడం షాకింగ్‌గా అనిపించడంతో పాటు నిరాశకు గురిచేసింది. ఈ రుణం పాకిస్థాన్‌లో శాశ్వత సైనిక పాలనకు దారితీసేందుకే దోహదం చేస్తుంది' అని గౌరవ్ గొగొయ్ ఎక్స్‌లో పోస్టు పెట్టారు. కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ కూడా ఈ విషయంపై స్పందించారు. పాకిస్థాన్‌కు ఐఎంఎఫ్ రుణానికి వ్యతిరేకంగా భారత్ ఓటు వేయాలని ఏప్రిల్ 29న కాంగ్రెస్ డిమాండ్ చేసిందన్నారు. కానీ, భారత్ ఓటింగ్‌కు దూరంగా ఉందన్నారు. మోదీ ప్రభుత్వం వెనక్కి తగ్గిందని, ఓటింగ్‌లో పాల్గొని వ్యతిరేకంగా ఓటు వేస్తే బలమైన సందేశం వెళ్లేదన్నారు. ఈ నేపథ్యంలో అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ ఎక్స్ వేదికగా కాంగ్రెస్ నాయకులు జైరాం రమేశ్, పవన్ ఖేరాలకు కౌంటర్ ఇచ్చారు. వీరు పాకిస్థాన్‌కు అంతర్జాతీయ ద్రవ్య నిధి బెయిలౌట్‌పై ప్రచారంలో మునిగి తేలుతున్నారని ఆరోపించారు. తప్పుడు సమాచారంతో దేశ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు.

# కాల్పుల విరమణకు అంగీకరించినా.. నిరంతరం సన్నద్ధతతోనే ఉంటాం

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**కొన్ని రోజులుగా భారత్, పాక్‌ల మధ్య నెలకొన్న ఉద్రిక్తతలకు తెరపడింది. కాల్పుల విరమణకు అంగీకరించినట్లు ఇరుదేశాల విదేశాంగ శాఖలు ప్రకటించాయి. అయితే, ఈ ప్రకటన అనంతరం భారత సైనికాధికారులు మీడియాతో మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. భారత్‌పై పాక్ అసత్యాలు ప్రచారం చేస్తోందన్నారు. కాల్పుల విరమణ ఒప్పందానికి కట్టుబడి ఉంటామని, అయినప్పటికీ భారత సైన్యం ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉంటుందని వెల్లడించారు. భవిష్యత్తులో పాకిస్థాన్ దాడులకు తెగబడితే దీటుగా సమాధానమిస్తామని స్పష్టం చేశారు. 'కొన్ని రోజులుగా భారత్‌పై పాక్ అవాస్తవాలు ప్రచారం చేస్తోంది. ఎస్‌-400, బ్రహ్మోస్ వ్యవస్థలపై వాళ్లు దాడి చేశారనడం అవాస్తవం. సిర్సా, జమ్మూ, బఠిండా, భుజ్‌లపై దాడి పాక్ దాడి చేశామని ప్రచారం చేసింది. నలియా, పఠాన్‌కోట్ వాయుసేన స్థావరాలకు నష్టం కలిగించామని, చండీగఢ్ ఆయుధాగారంపై దాడి చేసినట్లు పాక్ తప్పుడు ప్రకటనలు చేసింది.

# ఉగ్రవాదంపై పోరులో భారత్‌కు రష్యా అండ

- రక్షణశాఖ సహాయమంత్రి సంజయ్ సేథ్ వెల్లడి



మాస్కో, మే10 (జనంసాక్షి) : ఉగ్రవాదంపై పోరాడుతున్న భారత్‌కు తమ మద్దతు ఉంటుందని రష్యా మరోసారి స్పష్టం చేసింది. మునుపటి ఒప్పందాల ప్రకారం ఇరు దేశాల మధ్య సహకారం కొనసాగుతుందని తెలిపింది. ఈ క్రమంలో సంప్రదింపుల ప్రక్రియలో ఉన్న మిలిటరీ ఆర్డర్లను వెంటనే అందజేస్తామని హామీ ఇచ్చినట్లు పేర్కొంది. భిన్న రూపాల్లో ఉన్న ఉగ్రవాదంపై పోరాడుతున్న మనకు పూర్తి మద్దతు ఇస్తామని రష్యా హామీ ఇచ్చింది. ఇప్పటికే అమల్లో ఉన్న ఒప్పందాల ప్రకారం ఇరు దేశాల మధ్య సహకారం కొనసాగుతుందని రక్షణశాఖ సహాయమంత్రి సంజయ్ సేథ్ పేర్కొన్నారు. రష్యా విజయోత్సవాల్లో ఆయన భారత్ పరతినిధిగా పాల్గొన్నారు. పుతిన్‌నుకలిసి అభినందనలుతెలిపారు. మాస్కో పర్యటన ముగించుకొని భారత్‌కు బయలుదేరిన ఆయన అక్కడ మీడియాతో మాట్లాడారు. మాస్కోలో నిర్వహించిన విక్టరీ డే పరేడ్‌లో భారత్ తరఫున రక్షణశాఖ సహాయమంత్రి సంజయ్ సేథ్ పాల్గొన్నారు. అనంతరం రష్యా రక్షణశాఖ సహాయ మంత్రి అలెగ్జాండర్ ఫోమిన్‌తో సమావేశమై పలు అంశాలపై చర్చించారు. గతంలో రూపొందించుకున్న నిబంధనలు, వరుస సంప్రదింపుల ద్వారా సంబంధాలను మరింత బలోపేతం చేసుకునేందుకు ఇరుపక్షాలు అంగీకరించాయి. సీమాంతర ఉగ్రవాదంపై చేస్తున్న పోరాటానికి మద్దతు ప్రకటించడంపై రష్యాకు భారత్ ధన్యవాదాలు తెలిపింది.

# ఉగ్రవాదాన్ని సమూలంగా నిర్మూలించాలి

- కుల గణనకు కాలపరిమితి విధించండి
- సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ
- పాకిస్తాన్ దుశ్చర్యను ప్రపంచమంతా గమనిస్తోంది : మాజీ ఎంపీ అజీజ్ పాషా



హైదరాబాద్ (జనంసాక్షి) : భారత్ – పాకిస్థాన్ ల కాల్పుల విరమణను స్వాగతిస్తున్నట్లు సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ తెలిపారు. కానీ.. పహల్గామ్‌లో ఉగ్రదాడికి పాల్పడిన ఉగ్రవాదులను అప్పగించాలని భారత్ శాంతి చర్చల్లో ప్రతిపాదించాలని డిమాండ్ చేశారు. మానవాళికి బద్ద శత్రువైన ఉగ్రవాదం ఏ మతంలో ఉన్నా, ఏ కులంలో ఉన్నా, ఏ ప్రాంతంలో ఉన్నా దానిని సమూలంగా నిర్మూలించాల్సిందేనన్నారు. మృతుల తల్లిదండ్రుల కన్నీరు ఊరికే పోదని ఆయన వ్యాఖ్యానించారు. సిపిఐ రాష్ట్ర కార్యాలయం మగ్దూంభవన్ లో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాజీ ఎంపీ, సీపీఐ జాతీయ కార్యదర్శి సయ్యద్ అజీజ్ పాషాతో కలిసి నారాయణ మాట్లాడుతూ ఆపరేషన్ సిందూర్ ద్వారా భారత సైన్యం పక్కా ప్రణాళికతో పాకిస్తాన్ ఉగ్రవాద శిక్షణ కేంద్రాలను విజయవంతంగా ధ్వంసం చేయడం ద్వారా భారత సైనిక శక్తిని ప్రపంచానికి చాటారని డాక్టర్కే. నారాయణ ప్రశంసించారు. పహల్గామ్ ముష్కరులు కాళ్ల పారాణి ఆరకుండానే భార్య ముందు భర్తను చంపడం హేయమైన చర్య అన్నారు. సరిహద్దుల్లో ప్రాణాలు కోల్పోయిన ఎపికి చెందిన అగ్నివీర్ మురళి నాయక్ కు ఘనంగా నివాళులు అర్పింస్తున్నామని, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నామన్నారు. పాకిస్తాన్ కవ్వింపు చర్యలకు పాల్పడుతున్న నేపథ్యంలో దౌత్యపరంగా ప్రపంచ దేశాలతోమరింత మెరుగైన సంబంధాలను ఏర్పాటు చేసుకుని వాటిని ఏకం చేయాల్సిన అవసరముందన్నారు. తద్వారా అంతర్జాతీయ ఉగ్రవాది అయిన మాసుద్ అజర్ ను భారత్ రప్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. పాకిస్తాన్ కు చైనా మద్దతు ఇస్తుందనేది అపోహ మాత్రమేనని , ఇందుకు సంబంధించి చైనా అధికారికంగా సైతం స్పష్టం చేసినట్లు ఒక ప్రశ్నకు సమాధానంగా నారాయణ తెలిపారు.

### కుల గణనకు కాలపరిమితి విధించండి

కాగా, కేంద్ర ప్రభుత్వం చేపట్టనున్న కులగణనను సిపిఐ పూర్తిగా స్వాగతిస్తుందని, అయితే ఈ ప్రక్రియను పూర్తి చేసేందుకు ఖచ్చితమైన కాలపరిమితిని నిర్ణయించాలని డాక్టర్ నారాయణ కోరారు. తద్వారా రానున్న సార్వత్రిక ఎన్నికల నాటికి కుల గణన ప్రక్రియను పూర్తి చేసి చట్ట సభల్లో బిసిలకు రిజర్వేషన్లు కల్పించి వారు పోటీ చేసేందుకు అవకాశాన్ని కేంద్ర ప్రభుత్వం కల్పించాలని నారాయణ డిమాండ్ చేశారు. హైదరాబాద్లో నిర్వహిస్తున్న ప్రపంచ సుందరి పోటీలను సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ తప్పుబట్టారు. మహిళలను పూజించే ఈ దేశంలో మహిళల అంగాంగ ప్రదర్శనతో నిర్వహించే అందాల పోటీల ద్వారా ప్రజలకు ప్రభుత్వం ఏమి సందేశం ఇవ్వాలనుకుంటుందని ప్రశ్నించారు. ప్రపంచ సుందరీమణులను పర్యాటక ప్రదేశాల్లో ఊరేగించినంత మాత్రాన ఈ రంగం అభివృద్ధి చెందుతుందా అని నారాయణ ప్రశ్నించారు. పర్యాటక ప్రాంతాలకు రవాణా సౌకర్యం, మౌలిక సదుపాయాలను కల్పించడం ద్వారా వివిధ ప్రాంతాలకు పర్యాటకులు వచ్చేందుకు వీలు కలుగుతుందని సూచించారు.

### పాకిస్తాన్ దుశ్చర్యను ప్రపంచ మంతా గమనిస్తోంది : మాజీ ఎంపీ అజీజ్ పాషా

పాకిస్తాన్ దుశ్చర్యలను ఇప్పటికే ప్రపంచ దేశాలు నిశితంగా గమనిస్తున్నాయని, కేవలం టర్కీ దేశం తప్ప అన్ని దేశాలు భారత్ కు మద్దతుగా నిలిచాయని మాజీ ఎంపీ సయ్యద్ అజీజ్ పాషా అన్నారు. భారత్ పలు ప్రాంతాల్లో పాకిస్తాన్ తెగబడి 400 డ్రోన్లను ప్రయోగించగా, వాటిని భారత సైన్యాలు విజయవంతంగా తిప్పికొట్టడం అభినందనీయమన్నారు. అజ్మల్కసబ్ లాంటి ఉగ్రవాదులు శిక్షణ పొందిన లష్కరే తొయిబా లాంటి ప్రధానమైన ఉగ్ర శిబిరాలను భారత సైన్యం పూర్తిగా ధ్వసం చేయడం మన దేశ సైనిక శక్తి పాటవానికి నిదర్శమన్నారు. పాకిస్తాన్ మాత్రం జమ్ములోని చర్చిలు, గురుద్వారాలు, ఆలయాలపై దాడులు చేసి మతకల్లోలాలను సృష్టించడం ద్వారా అంతర్గత భద్రతను దెబ్బతీయాలనే కుట్ర చేస్తున్నప్పటికీ భారతీయులంతా ఐక్యంగా ఉన్నారన్నారని మాజీ ఎంపీ అజీజ్ పాషా అన్నారు.

# మహిళా కార్యకర్తలను వెంటనే విడుదల చేయాలి

- పౌరహక్కుల సంఘం

హైదరాబాద్ (జనంసాక్షి) : అక్రమంగా అరెస్టు చేసిన మహిళా కార్యకర్తలను వెంటనే విడుదల చేయాలని పౌరహక్కుల సంఘం డిమాండ్ చేసింది. దేశంలో ఒకవైపు యుద్ధ మేఘాలు కమ్ముకొని ఉద్విగ్న భరితమైన పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో ఒకవైపు ఖజానా దివాలా తీసింది అని చెబుతూనే మరొకవైపు 200 కోట్లు అందాల పోటీల నిర్వహణ కోసం కేటాయించిందని, మహిళను ఒక వస్తువుగా చిత్రీకరించి అణువణువు కొలిచి అందం నిర్ధారించే సంస్కృతికి వ్యతిరేకంగా పోరాడుతున్న మహిళల ను అరెస్టు చేయటం అన్యాయమన్నారు. ఈ సందర్భంగా అందాల పోటీలను అడ్డుకోవడానికి ప్రయత్నం చేసిన ఈ క్రింది మహిళా నాయకులు కార్యకర్తలు తెలంగాణ ప్రభుత్వం మే 10 న సాయంత్రం 6 గంటలకు గచ్చిబౌలి లో అరెస్టు చేసిందని, వారిని బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. చైతన్య మహిళా సంఘం నాయకురాలు ఎడ్ల జయ, పీకేఎం నుంచి పరాణి, పీడీఎం రవి, పీవో జయసుధ పి ఒ, పీడీఎస్‌యూ నేత సింహాద్రి, సావిత్రి, శ్రీదేవి, తిరుమల, సవిత తదితరులను అరెస్టు చేశారని, వారిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

# గొప్ప దార్శనీకుడు అంబేద్కర్

- జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు హుస్సేన్ నాయక్
- అంబేద్కర్ విగ్రహం ఆవిష్కరణ



మహబూబాబాద్ ప్రతినిధి, మే 10 (జనం సాక్షి) : డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గొప్ప దార్శనీకుడని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు జాటోతు హుస్సేన్ నాయక్ తెలిపారు. మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలంలో అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని స్థానిక బస్టాండ్ సెంట్రల్ లో భారత రాజ్యాంగ నిర్మాత స్ఫూర్తి ప్రదాత డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ గారి నూతన విగ్రహ ఆవిష్కరణ మహోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరై విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మానవ మనుగడకి కావాల్సిన కనీస వసతులను కల్పించిన గొప్ప మహనీయుడు డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ గారు 1947 లో స్వాతంత్రం సిద్ధించిన అనంతరం దేశం మొత్తం ఆనందంతో ఉంటే భావితరాల భవిషత్తు కోసం నాడు రాజ్యాంగాన్ని రచించి ప్రతి ఒక్కరికీ ఓటు రూపంలో ఒక ఆయుధాన్ని అంబేద్కర్ ఇచ్చారు. నేను నా దేశం అంటే దేశమే ముఖ్యం అనే నినాదంతో ప్రతి ఒక్కరూ దేశ సేవలో ముందుండలని ఎస్సీ ఎస్టీ బిసి వర్గాల వారికి చదువు అనే ఒక ఆయుధాన్ని ఇచ్చిన గొప్ప మహనీయుడు అంబేద్కర్ అని గూడూరు అడవితల్లి బిడ్డగా పెరిగి పుట్టిన ఈ గడ్డమీద అంబేద్కర్ గారి విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమనికి ముఖ్య అతిథిగా హాజరు కావడం నిజంగా నా అదృష్టమని మహబూబాబాద్ ప్రాంత ప్రజల సమస్యలను పరిష్కరించడం కోసం నేనే ఎల్లప్పుడూ ముందుంటా మీ సేవకు నేను సంసిద్ధునై ఉంటానని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో గూడూరు తహసీల్దార్ నాగేశ్వర్ రావు డాక్టర్ రవీందర్ రెడ్డి ,పిఏసిఎస్సి చైర్మన్ లింగారెడ్డి మాజీ జడ్పీటీసీ ధర్మారెడ్డి మాజీ సర్పంచ్ నూనవత్ రమేష్ మాజీ ఎంపీటీసీ కత్తి స్వామి గారు,పింగళి శ్రీనివాస్ గారు,రాధ గారు,మాజీ బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెంకన్న కొమ్మలు మాజీ ఎంపీటీసీ బిజెవైఎం రాష్ట్ర కార్యదర్శి మదన్ నాయక్ సురేందర్ రాంబాబు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టులకు ఆర్టీసీ ఎండీ సజ్జనార్ అభినందనలు



హైదరాబాద్ (జనంసాక్షి) : భారతదేశ సరిహద్దుల్లో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల గురించి ఎప్పటికప్పుడు ప్రజలకు తెలిసేలా నిరంతరం విధులు నిర్వహించిన మీడియా జర్నలిస్టులను సీనియర్ ఐపీఎస్ అధికారి, ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ ఎక్స్ వేదికగా అభినందనలు తెలిపారు. ప్రభుత్వాలకు, ప్రజలకు మధ్య వారధులుగా ఉండేది జర్నలిస్టులని, వారి వృత్తి కత్తిమీదసాము లాంటిదని, జర్నలిస్టులను ఎంత పొగిడినా తక్కువేనని కొనియాడారు. శత్రుసైన్యం దాడులు చేసిన ప్రాంతాలను ప్రాణాలు సైతం లెక్క చేయకుండా ప్రసారం చేయడం మామూలు విషయం కాదన్నారు. "నిజాయితీ, ధైర్యం, బాధ్యతతో నివేదించే జర్నలిస్టులకు వందనం. సత్యం, ప్రజాసేవ పట్ల మీ నిబద్ధత, తరచుగా వ్యక్తిగతంగా చాలా ప్రమాదంలో ఉన్నప్పటికీ, దేశానికి సమాచారం అందిస్తున్నారు. ముఖ్యమైన పనిని చేసినందుకు ధన్యవాదాలు." అని సజ్జనార్ చేసిన పోస్ట్ లో పేర్కొన్నారు.

# సరిహద్దు ఉద్రిక్తతలతో విద్యార్థుల ఆందోళన

- కేంద్రమంత్రి బండి చొరవతో స్వస్థలాలకు పయనం

శ్రీనగర్, మే10 (జనంసాక్షి) : భారత్–పాక్ మధ్య ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో శ్రీనగర్‌లోని షేర్–ఇ–కశ్మీరీ వ్యవసాయ విజ్ఞాన, సాంకేతిక విశ్వవిద్యాలయంలో విద్యార్థులు ఆందోళనకు గురవుతున్నారు. ఇందులో 300 మందికిపైగా విద్యార్థులు ఉండగా.. వీరిలో పలువురు తెలుగు రాష్ట్రాల విద్యార్థులు ఉన్నారు. సరిహద్దుల్లో బాంబుల మోతతో ఆందోళన చెందుతున్నట్లు విద్యార్థులు చెబుతున్నారు. తమను వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని కోరుతున్నారు. కేంద్ర మంత్రి బండి సంజయ్‌కు ఏపీ, తెలంగాణ విద్యార్థులు లేఖ రాశారు. దీంతో కేంద్ర మంత్రి తక్షణమే స్పందించారు. జిల్లా కలెక్టర్, వర్శిటీ డీన్‌తో మాట్లాడారు. సురక్షిత ప్రాంతానికి తరలించాలని కోరారు. దీంతో ఏపీ, తెలంగాణ, తమిళనాడుకు చెందిన మొత్తం 23 మంది విద్యార్థులను బస్సుల్లో శ్రీనగర్ నుంచి దిల్లీకి పంపించారు. అక్కడి నుంచి స్వస్థలాలకు చేరుకోనున్నారు.

# మే 27నే కేరళకు నైరుతి

ఉందని వాతావరణ శాఖ తెలిపింది. భారత ఉపఖండంలో సాధారణం కంటే తక్కువ వర్షాలు కురిసే ఎల్‌నినో పరిస్థితుల అవకాశాన్ని సైతం తోసిపుచ్చింది. మన దేశంలో 52% నికర సాగు భూమికి ఇప్పటికీ వర్షపాతమే ప్రధాన ఆధారం. దేశ మొత్తం వ్యవసాయ ఉత్పత్తిలో ఈ సాగు భూమి నుంచి ఏకంగా 40% దిగుబడి వస్తుంది. అందుకే భారత ఆహార భద్రత, ఆర్థిక స్థిరత్వంలో నైరుతి రుతు పవనాలు కీలక పాత్ర పోషిస్తాయి. దేశవ్యాప్తంగా తాగునీరు, విద్యుత్ ఉత్పత్తికి కీలకమైన జలాశయాలను తిరిగి నింపడానికి, దేశ జీడీపీకి 18.2 శాతం తోడ్పాటుకు ఇది ఎంతో ముఖ్యం. తెలంగాణలోని పలు జిల్లాల్లో మూడు రోజులు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. ఈ మూడు రోజుల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే రెండు నుంచి మూడు డిగ్రీలు తక్కువగా నమోదయ్యే అవకాశాలున్నాయని పేర్కొంది. ఇవాళ పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో పాటు గంటకు 30 కి.మీ. నుంచి 40 కి.మీ. వేగంతో ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది. రానున్న రెండు రోజులు కూడా గంటకు 40 కి.మీ. నుంచి 50 కి.మీ. వేగంతో ఈదురు గాలులతో కూడిన వర్షాలు కురుస్తాయని తెలిపింది.

# యువత క్రీడల్లోనూ రాణించాలి

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు




చిట్యాల మే 10( జనంసాక్షి) యువత క్రీడల్లోనూ రాణించాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ అన్నారు . ఈ మేరకు శనివారం సిసిపిఎల్ 3 అధ్యక్షులు ఇరుకులపాటి వినయ్ కుమార్ అధ్యక్షతన సీసీపీఎల్ క్రీడాకారులు గెలుపొందిన లక్ష రూపాయల విన్నర్ టీం డిఎస్ టైటాన్స్ భూపాలపల్లి, 50వేలు రన్నర్ రాయల్ చిట్యాల టీమ్ కు బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమనికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు హాజరై బహుమతులను అందజేశారు. అనంతరం ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ యువత కోసం క్రీడలను ప్రోత్సహిస్తూ వారిలోని క్రీడా నైపుణ్యాన్ని వెలికితీయడానికి క్రీడలు ఎంత గానో ఉపయోగపడుతాయని తెలిపారు. క్రీడాకారులకు కూడా ఒక స్పోర్ట్స్ యూనివర్సిటీ ని కూడా ఈ ప్రభుత్వం ఏర్పాటు చేయబోతుంది. స్కిల్ యూనివర్సిటీ తో పాటు స్పోర్ట్స్ యూనివర్సిటీ ని కూడా క్రీడాకారులకు నిర్వహించడమే కాకుండా క్రీడల నిర్వహించడంతోపాటు ఇంకా జిల్లా స్థాయిలో గెలుపొందిన వారు, రాష్ట్ర స్థాయిలో జాతీయ స్థాయిలో ఎదగాలి .ఓటమి చెందిన వారు నిరుత్సాహ పడకుండా మళ్లీ జిల్లా స్థాయిలో, రాష్ట్ర స్థాయిలో గెలుపు కొరకు కృషి చేయాలని కోరారు. ఓటమి రేపు గెలుపుకు నాంది కావాలి .అందరూ కూడా క్రీడలతో పాటు సమానంగా మన తల్లిదండ్రులు మన మీద పెట్టుకున్న విశ్వాసాన్ని నమ్మకాన్ని పెంపొందించే దిశలో మనం గోల్ రీచ్ కావాలి .అప్పుడే మన లక్ష్యం నెరవేరుతుంది. పట్టుదలతో మనిషి ఏదైతే కావాలనుకుని కృషి చేస్తాడో, ఆ కృషి తప్పకుండా విజయవంతమైతది. ఆ లక్ష్యం నెరవేరుతుంది .కనుక ఆ దిశలో ప్రతి ఒక్కరూ లక్ష్యం గోల్డ్ రీచ్ అయ్యేవిధంగా పనిచేయాలని అన్నారు. చిట్యాల హాస్పిటల్లో ఖాళీగా ఉన్న పోస్టులు నింపడమే నా లక్ష్యం. అదేవిధంగా భూపాలపల్లి జిల్లా హాస్పిటల్ 2003 పోస్టులను తీసుకొచ్చాం. ఫోర్త్ ఫ్లోర్ లో అదే విధంగా లిఫ్ట్ పెట్టి బెడ్లు పెంచి అందులో న్యూరాలజీ ,నెఫ్రాలజీ, తదితర డిపార్ట్మెంట్స్ పెట్టి ,హైదరాబాదులో ఆపరేషన్ చేసే డాక్టర్లను కూడా ఇక్కడ ఇవ్వాలని నేను ముఖ్యమంత్రి కి చెప్పాను. అతి త్వరలో కూడా సూపర్ స్పెషాలిటీ డాక్టర్ కూడా రాబోతున్నారన్నారు.

# 14న పౌరహక్కుల సంఘం ఉమ్మడి కరీంనగర్ 5వ మహాసభ

- ప్రజాసంఘాల ఆధ్వర్యంలో కరపత్రాల ఆవిష్కరణ



కరీంనగర్ (జనంసాక్షి) : ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ లో పీస్ కమిటీ చైర్మన్ రిటైర్డ్ జడ్జి జస్టిస్ చంద్ర కుమార్ ఆధ్వర్యంలో పౌర హక్కుల సంఘం ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఐదోవ మహాసభ జిల్లా కరపత్రాలను వివిధ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. 14న ఫిలిం భవన్ లో జరిగే సభకు ఉదయం 10 నుంచి రెండు గంటల వరకు వక్తలు, ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్ పౌర హక్కుల సంఘం అధ్యక్షులు తెలంగాణ, నారాయణ రావు గారు పౌర హక్కుల సంఘం రాష్ట్ర కార్యదర్శి, వీక్షణం ఎడిటర్ ఎస్ వేణు, మాదన కుమారస్వామి రాష్ట్ర సహాయ కార్యదర్శి గార్లు ప్రసంగిస్తారు. కగార్ ఆపరేషన్ ఆపాలి, మావోయిస్టులతో కేంద్ర ప్రభుత్వం చర్చలు జరపాలి అనే అంశంపై మాట్లాడుతారు. ఈకర పత్ర ఆవిష్కరణకు ముఖ్య అతిథిగా హాజరైన జస్టిక్స్ చంద్ర చూడు మాట్లాడుతూ ఆదివాసీల పై జరుగుతున్న మా రణ హోమాన్ని ఆపాలని మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని కోరారు. రాష్ట్ర సహాయ కార్యదర్శి మాదన కుమారస్వామి మాట్లాడుతూ మావోయిస్టులు శాంతి చర్చలు జరపాలని గత నెల రోజుల నుంచి మూడు లేఖలు రిలీజ్ చేశారని అట్లాగే నిన్నటికి నిన్న మా వైపు నుండి 6 నెలల వరకు కాల్పులు చేయమని కాల్పుల విరమణ ప్రకటించారు కాబట్టి అన్ని వామపక్ష, ప్రతిపక్ష రాజకీయ పార్టీలు డిమాండ్ మేరకు ప్రభుత్వం దిగివచ్చి మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. ఈ పోరాకుల సంఘం ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షులు శ్రీపతి రాజగోపాల్, పౌర హక్కుల సంఘం ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఉపాధ్యక్షురాలు శ్రీపతి పుల్ల సుచరిత నారా వినోద్, సహాయ కార్యదర్శి బొడ్డు పెల్లి రవి, గడ్డం సంజీవ్, లక్ష్మణ్, వెంకటి , సంపత్ బండారి రాయలింగు, నక్క సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# ఉత్సాహంగా సాగిన నడక పోటీలు



బెల్లంపల్లి, మే 10 (జనంసాక్షి) : తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని పాత బెల్లంపల్లిలోని నీలగిరి ప్లాంటేషన్లో శనివారం ఐదు కిలోమీటర్ల నడక పోటీలు నిర్వహించారు. "వనంలో మనం – ఆరోగ్యం కోసం నడక" అనే పిలుపుతో అటవీ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో సాగిన ఈ పోటీలను కాగజ్ నగర్ డివిజనల్ మేనేజర్ శ్రీశ్రావణి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పచ్చని చెట్ల మధ్య నడక పోటీలు ఆరోగ్యంతో పాటు మానసిక ఉత్సాహాన్ని కలిగిస్తాయన్నారు. ఈ నడక పోటీలకు పాత బెల్లంపల్లి, సోమగూడెం ప్రాంతాలకు చెందిన వారు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ నడక పోటీలలో ఎస్ కిరణ్ (ప్రథమ), సిహెచ్ అఖిల్ (ద్వితీయ), జంపం తిరుపతి (తృతీయ) విజేతలుగా నిలిచారు. పోటీల్లో ప్లాంటేషన్ మేనేజర్లు వి సునీత (బెల్లంపల్లి రేంజ్), గోగు సురేష్ కుమార్ (మంచిర్యాల రేంజ్), ఎడ్ల లక్ష్మణ్ (కాగజ్ నగర్ రేంజ్), డిప్యూటీ ప్లాంటేషన్ మేనేజర్ జె నరేష్, పాత బెల్లంపల్లి మాజీ సర్పంచ్ జయ రామస్వామి, స్థానిక పెద్దలు కందుల సదానందం, మేకల పవన్, రాజు పాల్గొన్నారు.

# శాంతి స్టేడియంలో మౌలిక సదుపాయాలు, సౌకర్యాలు కల్పించాలి




నస్పూర్, మే 10, (జనంసాక్షి): కృష్ణ కాలనీలోని శాంతి స్టేడియంలో మౌలిక వసతులు,సౌకర్యాలు కల్పించాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటియుసి డిప్యూటీ ప్రధాన కార్యదర్శిలు కందికట్ల వీరభద్రయ్య,ముష్కె సమ్మయ్య,బ్రాంచ్ కార్యదర్శి బాజీ సైదా లు డిమాండ్ చేశారు.శనివారం శ్రీరాంపూర్ ఏరియాలోని జనరల్ మేనేజర్ కార్యాలయంలో ఏరియా జియం ఎం శ్రీనివాస్ కు ఏఐటీయూసీ నాయకులు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా కందికట్ల వీరభద్రయ్య,ముష్కె సమ్మయ్య,బాజీ సైదా లు మాట్లాడారు.కృష్ణ కాలనీలోని శాంతి స్టేడియంలో కనీస సౌకర్యాలు లేక కార్మికులు,వారి కుటుంబ సభ్యులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు.స్టేడియం చుట్టూ ప్రహరీ గోడ లేకపోవడం వల్ల స్టేడియంలో కొందరు ఆకతాయిలు మద్యం సేవిస్తుండడంతో కార్మికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. స్టేడియంలో సరిపడా విద్యుత్ దీపాలు లేకపోవడం వల్ల అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని తెలిపారు.వర్షాకాలంలో వర్షపు నీరు ఆగి కార్మికులు వాకింగ్ చేయడానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కాబట్టి తక్షణమే యాజమాన్యం స్పందించి కార్మికుల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకొని శాంతి స్టేడియంలో ప్రహరీ గోడను నిర్మించి,వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయాలని,స్టేడియంలో ఒక స్టేజిని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు కొట్టే కిషన్ రావు, సహాయ కార్యదర్శి మోత్కూరి కొమురయ్య, కోశాధికారి నాగభూషణం,జిఎం చర్చల ప్రతినిధులు ప్రసాద్ రెడ్డి,బద్రి బుచ్చయ్య,సంపత్, గొల్లపల్లి రామచందర్,కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

# చివరి దశకు సరస్వతి పుష్కరాల ఏర్పాట్లు



కాళేశ్వరం, మే10,( జనం సాక్షి) : సరస్వతి పుష్కరాల ప్రారంభానికి ఇంకా కొన్ని రోజులు మాత్రమే మిగిలుండటంతో శనివారం భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పి కిరణ్ ఖరే సరస్వతి ఘాట్, సరస్వతి మాతా విగ్రహం, జాన దీపం, స్టాళ్లు, పుష్కర స్నానాలు ఆచరించే నది ప్రాంతం, పారిశుధ్య ఏర్పాట్లు, విద్యుత్ సరఫరా, తాగునీరు, మరుగుదొడ్ల ఏర్పాట్లు వంటి వాటిని పరిశీలించి పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయని తెలిపారు. కొద్ది రోజులు మాత్రమే సమయం ఉన్నందున రేయింబవళ్లు పనులు జరగాలని అధికారులను కాంట్రాక్టర్లు ను ఆదేశించారు. సరస్వతి మాతా విగ్రహం పూలతో ముస్తాబు చేయాలని సూచించారు. పటిష్ట బారికేడ్లు ఏర్పాటు చేయాలని, భక్తులు నదిలోకి వెళ్లకుండా ప్రమాద హెచ్చరికల బోర్డ్స్ ఏర్పాటు చేయాలని అన్నారు. ఈ పనులన్నింటిని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పి కిరణ్ ఖరే నిరంతరం పర్యవేక్షిస్తూ, అధికారులకు తగిన సూచనలు, మార్గదర్శకాలు అందిస్తున్నారు. పుష్కరాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని విభాగాల సమన్వయంతో ఏర్పాట్లు వేగంగా పూర్తిచేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. సరస్వతి పుష్కరాలను విజయవంతంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం సర్వం సిద్ధంగా ఉందని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్, ఇరిగేషన్, దేవాదాయ, పంచాయతి రాజ్, ఆర్ డబ్ల్యూఎస్, విద్యుత్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# క్షీణిస్తున్న భారత్ -పాక్ సంబంధాలు

## యుద్ధాలతో నష్ట పోతున్న ప్రజలు



1947లో విభజన అనంతరం భారత్, పాకిస్తాన్‌గా విడిపోయిన రెండు దేశాలు మొదటి నుంచీ శత్రుత్వానికి దారి తీసే మార్గంలోనే పయనించాయి. ఈ విభజన లక్షలాది మందిని వలసబాట పట్టించింది. వేలాది మంది హత్యకు గురయ్యారు.

స్వాతంత్ర్యం పొంది ఏడాదిలోనే 1947-48లో కాశ్మీర్ విషయం పై మొదటి యుద్ధం ప్రారంభమైంది. మహారాజా హరిసింగ్ భారతతో విలీన ఒప్పందంపై సంతకం చేయగానే పాకిస్తాన్ కుట్రల శ్రేణి మొదలైంది. సైనికులే కాకుండా కబాయిదీలను ముందుకు నెట్టి కాశ్మీర్‌ను ఆక్రమించేందుకు పాకిస్తాన్ ప్రయత్నించింది. భారత సైన్యం పాకిస్తాన్ అల్లరి మూకలను తరిమి కొట్టింది. కాశ్మీర్‌ను కాపాడింది.భారత్ లో విలీనం చేసుకుంది. కానీ, పాక్ ఆక్రమిత కాశ్మీర్‌ను కోల్పోయింది.

1965లో రెండవ యుద్ధం చోటుచేసుకుంది. ఇది కూడా కాశ్మీర్‌కు సంబంధించిన దురాశల వల్లనే జరిగింది. ఆ యుద్ధం ఆర్థికంగా భారత్‌కు రూ. వేల కోట్లు నష్టం కలిగించగా, వేలాది మంది సైనికులు ప్రాణాలు కోల్పోయారు. పాకిస్తాన్‌కి కూడా ఇదే స్థాయిలో నష్టం సంభవించింది. కానీ సమస్య మాత్రం తీరలేదు. 1971లో మూడవ యుద్ధం మరింత ఘోరంగా సాగింది. ఇది బంగ్లాదేశ్ ఏర్పాటుకు దారితీసింది. పాకిస్తాన్ మిలిటరీ తూర్పు పాకిస్తాన్ లో బంగ్లాదేశ్ ప్రజలపై అత్యాచారాలు, హత్యలు జరపడం వల్ల భారత్ లక్షల సంఖ్యలో శరణార్థులను స్వీకరించాల్సి వచ్చింది. ఫలితంగా భారత్, తూర్పు పాకిస్తాన్‌ను ముక్తి బాహిని సహకారంతో విడదీసింది. దాదాపు 90,000 పాక్ సైనికులు చేతులెత్తేయడంతో ఈ యుద్ధాన్ని చరిత్రలో అత్యంత ఘోరమైన పాక్ ఓటమిగా మార్చింది. కానీ పాకిస్తాన్ తాను నేర్చుకోవాల్సిన గుణపాఠం నేర్చుకోలేదు.

1999లో కార్గిల్ యుద్ధం జరిగింది.ఇది ఇరుదేశాల మధ్య జరిగిన శాంతి ఒప్పందానికి వ్యతిరేకంగా పాకిస్తాన్ జరిపిన విద్రోహ చర్య. నూక్ల సమయం అనంతరం జరిగిన ఈ యుద్ధంలో పాక్ సైనికులే భారత భూభాగంలోకి అక్రమంగా చొచ్చుకొచ్చారు. భారత సైన్యం తిరిగి వారిని తరిమి కొట్టినప్పటికీ, రెండు దేశాల మధ్య అనేక మంది చనిపోయారు.ఆర్థిక నష్టాలు గణనీయంగా ఉన్నాయి. వందలాది మంది భారత జవాన్లు ప్రాణాలు కోల్పోయారు. భౌగోళికంగా విజయం భారత పక్షాన నిలిచింది.శాంతి సంబంధాలు మాత్రం కుదుట పడలేదు.

ఇవి మాత్రమే కాకుండా, పాక్ ఆధారిత ఉగ్రవాద దాడులు భారత్‌ను తీవ్రంగా బలహీనపరిచాయి. 2001లో పార్లమెంట్‌పై దాడి, 2008 ముంబయి ఉగ్రదాడి, ఉరి , పోతే పుల్వామా దాడి - ఇవన్నీ పాక్ ప్రేరేపించిన భయానక ఉగ్రవాద ఆపరేషన్లే. 2016లో "ఉరి" దాడిలో 19 మంది జవాన్లు మరణించగా, భారత్ సర్జికల్ స్ట్రైక్స్‌తో ప్రతీకారం తీర్చుకుంది. 2019లో పుల్వామా దాడిలో 40 మంది సీఆర్‌పీఎఫ్ జవాన్లు మరణించగా, బాలాకోట్‌పై ఎయిర్ స్ట్రైక్స్ ద్వారా భారత్ పాకిస్తాన్ కు బలమైన దెబ్బ కొట్టింది.అయినా పాక్ గుణం మారలేదు.

ఈ పరస్పర విరుద్ధ చర్యల ఫలితంగా రెండు దేశాల మధ్య వేల కోట్ల రూపాయల ఆర్థిక నష్టం, వేలాది మంది పౌరుల ప్రాణ నష్టం సంభవించింది. సైనిక ఖర్చులు పెరగడం, అభివృద్ధి పనులు తగ్గిపోవడం, నిరంతర శత్రుత్వ వాతావరణం...ఇవన్నీ ప్రజల పైనే తీవ్ర భారం మోపుతున్నాయి. ఒకవైపు విద్యా, ఆరోగ్య రంగాల్లో వెనుకబాటుగా ఉన్న దేశాలు, మరోవైపు ఆయుధాల కోసం ఖర్చులు పెంచుకోవడం అసమంజసం. పాక్ భారత్ తో నేరుగా యుద్ధం చేయలేక భారత్ ను దొంగ దెబ్బ తీయడానికే ఎప్పటికప్పుడు ఉగ్రవాదాన్ని ప్రోత్సహించడం అనే దుష్ట కార్యక్రమాన్ని నిరంతరం కొనసాగిస్తుంది. అంతే కాకుండా, చర్చలకు వచ్చిన ప్రతిసారి తన తాహత్తుకు మంచిన యుద్ధ సంకేతాలు పంపడం, అంతర్జాతీయ వేదికలపై కాశ్మీర్ సమస్యను లేవనెత్తడం చేస్తుంది. భారత్ తో సత్సంబంధాల గురించి పాకిస్తాన్ ఎప్పుడూ ప్రయత్నించ లేదు. సరికదా ఎప్పుడూ భారత్ స్వయం కృషితో వివిధ రంగాల్లో సాధిస్తున్న ప్రగతిపై అసూయతో రగిలిపోతూ శత్రు వైఖరితోనే వ్యవహరించింది.

భారత్ పలు దఫాల్లో శాంతి చర్చలకు ముందు వచ్చినా, ప్రతిసారీ ద్రోహమే ఎదురైంది. వాణిజ్య, సాంస్కృతిక మార్పిడి అవకాశాలను కావాలనే దూరం చేసుకుంది.పాకిస్తాన్ ప్రజలు శాంతిని కోరుకుంటున్నా, పాలకుల పోకడలు శత్రుత్వాన్ని పెంచుతున్నాయి. పాకిస్తాన్ లో ప్రజలు ఎన్నుకున్న చట్టపరమైన ప్రజాస్వామ్య ప్రభుత్వం ఎప్పుడూ లేదు. వెనుక నుండి నడిపించేది మిలిటరీ నే. పాక్ మిలిటరీ, ఐఎస్ఐ లే ప్రతిసారీ పరోక్షంగా భారత్‌ను గాయపరిచే కుట్రలతో ముందుకెళ్తున్నాయి.

శాంతికి మార్గం కత్తులపై నాట్యం చేయడం కాదు. భవిష్యత్తు తరాలకు ఒక భయరహిత జీవనం కావాలి. కానీ ఇప్పటివరకు జరిగిన యుద్ధాలూ, దాడులూ ప్రజల జీవితాలను ఆర్థికంగా, మానసికంగా, భౌతికంగా విచ్ఛిన్నం చేశాయి. భవిష్యత్తులో మార్పు రావాలంటే పాకిస్తాన్ తన వైఖరిని మార్చాలి. లేకపోతే శాంతి కలలే గగన కాంక్షగా మిగిలిపోతాయి.

తాజాగా పహల్గాంలో కాశ్మీర్ అందాలు చూసి ఆనందిస్తున్న అమాయకపు టూరిస్ట్ లపై కాల్పులు జరిపిన పాకిస్తానీ ఉగ్రవాదులు భారత మహిళల సిందూరాన్ని నేలరాల్చిన పాక్ ముష్కరులను భారత సైన్యం వెంటాడి వారి రహస్య స్థావరాలపై భారత సైనిక వైమానిక రక్షణ దళాలు క్షిపణుల తో అగ్నివర్షం కురిపించాయి. ఉగ్ర వాదంపై ప్రతీకారంగా 'ఆపరేషన్ సిందూర్' పేరిట జరిపిన మహోగ్ర దాడిలో పాకిస్థాన్ గడ్డపై ఇష్టారాజ్యంగా నడుపుతున్న ఉగ్రవాద శిక్షణా స్థావరాలు సమూలంగా బూడిద కుప్పలుగా మారాయి. లక్ష్యాలను ఛేదించడంలో, శత్రు స్థావరాలను నేలమట్టం చేయడంలో మన సైనిక దళాల పాటవానికి "సిందూర్" నిలువుటద్దం పడుతున్నది. ఒకేసారి తొమ్మిది ఉగ్రవాద స్థావరాలపై ఇండియా గురిపెట్టి గట్టిగా చావు దెబ్బ కొట్టింది. మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత పాక్ భూభాగం, ఆక్రమిత కశ్మీర్లోని అనేక ఉగ్రవాద శిబిరాలు ధ్వంసమైనట్లు వీడియో సహిత వార్తా కథనాలు వెలువడుతున్నాయి. రక్షణ నిబంధ నల రీత్యా ఇంకా పూర్తి సమాచారం బయటికి రానప్పటికీ ఉగ్రవాద మూలాలను తెగటార్చే లక్ష్యంతో ఇవి జరిగాయనేది అధికారిక సమా చారం. భారత రక్షణ దళాలు మొత్తం తొమ్మిది లక్ష్యాలను ఎంచుకోగా అందులో ఐదు పాక్ భూ భాగంలో, మిగిలిన నాలుగు పాక్ ఆక్రమిత కశ్మీర్లో ఉన్నాయి. ఉగ్రదాడులకు పథకాలు వేసే. ఆ దాడులను నిర్దేశించే ప్రదేశాలే లక్ష్యంగా క్షిపణుల వర్షం కురిపించినట్లు రక్షణశాఖ వెల్లడించడం విశేషం.అక్కడ ప్రజలకు, ఆస్తులకు నష్టం జరగకుండా మన సైన్యం మానవత్వాన్ని చాటి చెప్పింది. మన లక్ష్యం ఉగ్రవాద మూకల రహస్య స్థావరాలను తుద ముట్టించటం.అందుకే భారత వైమానిక దళం ప్రధానంగా లష్కరే తోయిబా, జైషే మహమ్మద్ సంస్థల స్థావరాలను లక్ష్యంగా క్షిపణుల వర్షం కురిపించింది. మొత్తం 24 ప్రకంపనలు సంభవించినట్లు పాక్ అధికారికంగా వెల్లడించింది. ప్రస్తుతం భారత్ -పాకిస్తాన్ లో మధ్య క్షిపణులతో ,డ్రన్లతో యుద్ధం భీకరంగా కొనసాగుతోంది.



డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్
9849328496.



# అమ్మలోని గొప్పతనం

మాతృప్రేమ ముందు ఈ సృష్టిలో ఏశక్తీ నిలువలేదు. శివాజీ రాయగఢ్ కోట శత్రువులకు అభేద్యంగా కట్టుదిట్టంగా ఉండేది. ప్రొద్దున ఆరు ఇంటికి తెరిచిన కోట తలుపులు రాత్రి తొమ్మిది గంటలకు మూయబడుతాయి. ద్వారం మూసి ఉన్న సమయంలో చీమకూడా లోని నుండి బైటికి వెలుపల నుండీ లోనికి రాకూ డదు.ఇది ఛత్రపతి శివాజీ ఆజ్ఞ! రాజ్య రక్షణార్థం ఇట్టి కట్టుదిట్టాలు తప్ప లేదు.ఎట్టి పరిస్థితులలో నూ రాత్రి తొమ్మిది తరువాత కోటద్వారం తెరవబడదు.హీరాకానీ' అనే గ్రామవాసి రోజూ కో టలో ఉన్న అధికారులకు, సైని కులకు పాలుపోయటానికి వచ్చేది.అందరికీ తనకు చేత నైన సహాయం చేసేది.ఇలా ఉండగాఒకరోజుసాయంకాలం పాలుపోయటానికి కోటలోకి వచ్చింది హీరాకానీ. ఒక సైనికుడి భార్య ప్రసవవేదన పడుతున్నదని తెలిసి అక్కడే ఉండి ఆమెకు సహాయం చేసింది. పురుడు అయ్యేదాకా అక్కడే ఉన్నది. ఇంటికి వెళదామని సమయంచూస్తే తొమ్మిది దాటి పోయింది. పరుగులు తీసి కోట గుమ్మం చేరింది హీరాకానీ. కావలి వాళ్ళు హీరాకానీ చాలా మంచిది అని అభిమానం ఉన్నా రాజాజ్ఞ ధిక్కరించలేక తలుపులు తీయలేదు. అయ్యో! ఇంట్లో ఉన్న పసిపిల్లవాడికి ఆకలివేస్తుంది. వాడికి పాలివ్వాలి" అని ప్రాధేయపడింది. హీరాకానీ మీద జాలి పడిన కావలి వాళ్ళు "తల్లీ రాజాజ్ఞ మేము మీరలేము. ఈ ఒక్క పూటకి ఈ సైనికుని ఇంట్లోనే పడుకో. ఉదయం అవ్వంగానే నిన్ను మేమే స్వయంగా పంపిస్తాం అని ఊరడించినారు. మరనాడు ప్రొద్దురాగానే కావలివాళ్ళు హీరాకానీని వెదకసాగారు. ఎక్కడైనా ఆదమరచి నిద్రపోయిందేమో లేపి ఇంటికి పంపుదామనుకున్నారు. అలా వెదుకుతున్న వారికి కోటగోడ వద్ద హీరాకానీ పాల పెరుగు కుండ కనిపించింది. పైకి చూసేసరికి ఆమె పూసల గొలుసు కోటమీద రాయికి వ్రేలాడుతూ కనిపించింది. ఆశ్చర్యపోయిన కావలివాళ్ళు శివాజీకి ఈ విషయం విన్నవించారు. ఒక స్త్రీ అభేద్యమైన కోట అర్ధరాత్రి ఒంటరిగా దాటడమా? అది ఎలా సాధ్యం అని నివ్వెరపోతూ స్వయంగా పరిస్థితిని పరిశీలిద్దామని అక్కడికి వచ్చాడు శివాజీ. ఇంతలో 'హీరాకానీ' రానేవచ్చింది. వణుకుతూ శివాజీ ముందు నిలబడి "అయ్యా! రాత్రి పాలకై ఏడుస్తున్న నా బిడ్డడు గుర్తుకు వచ్చాడు. ఇక ఏ దారీ తోచలేదు. కోటగోడలెలా దాటానో నాకే తెలియదు. కొండలూ గుట్టలూ తుప్పలూ ఆ నడిరాత్రి ఎలా దాటానో కూడా తెలియలేదు. నా బిడ్డ ఒక్కడే నాకు జ్ఞప్తిలో ఉన్నాడు. నా తప్పు క్షమించండి ప్రభూ!" అని ప్రార్థించింది హీరాకానీ. శత్రువులకు సింహ స్వప్నమైన ఛత్రపతి కళ్ళు చెమ్మగిల్లాయి. 'హీరాకానీ'కి అందరూ చూస్తుండగా సాష్టాంగ వందనం చేశాడు! "అమ్మా! మాతృప్రేమ ముందు ఈ సృష్టిలో ఏ శక్తీ నిలువలేదు. ఇక ఈ కోటగోడలెంత? ఇక్కడ కట్టబోయే బురుజుకు నీ పేరే పెడతాను" అని ఆమెను పంపివేశాడు అమ్మ విలువ తెలిసిన శివాజీ. ఇప్పటికీ ఈ బురుజు 'హీరాకానీ బురుజు' అనే పిలవబడుతోంది.

ఉమాశేషారావు వైద్య, 9440408080

## సింధూరం

పాక్ ఒక మత పిశాచి
తీవ్రవాదులకు తలవంచి లాలూచీ
కాశ్మీర్ పై చేయి వేచి
ఉగ్రదాడిని తలపెట్టి పేచీ

తనకు తానై తవ్వుకుంది గోతి
అనాదిగా మారని మందమతి
పిడివాదాన్ని నమ్ముకున్న సంస్కృతి
అల్లా అంటూనే నీతిలేని దుర్మతి


దాయాదికి లేదిక ఆశ్రయం
ముష్కరుల అంతమే లక్ష్యం
మూకలను పెంచి పోషించిన శాప పాపం
క్షిపణులతో కూలిపోనుంది రాజ్యం

సహనం కోల్పోయింది భారతం
అందుకే మొదలైనది కురుక్షేత్రం
వైరికి గరుపాలి అసలైన గుణపాఠం
అరులకు అందనిది త్రివర్ణ పతాకం

పచ్చని జంటలను హింసించింది చాలు
మతాన్ని ప్రశ్నిస్తూ హరించింది చాలు
అమాయకులను పొట్టన పెట్టుకున్నది చాలు
పహల్గాం రక్తసిక్తం చేసింది చాలు

ఆరంభం కాదు ఇది అంతం
చుక్కలు చూపనుంది రణతంత్రం
విశ్వం గమనించింది నీ కుతంత్రం
నింగి నేల ఆపరేషన్ సింధూరం

రచన.
నమిల కొండ నాగేశ్వర్ రావు
8688553470 మేడ్చల్



## నేను - నా విషయాన్వేషణ

చెప్పని విషయంకోసం గాలిస్తున్నా
చూడని విషయంకోసం పరికిస్తున్నా
వ్రాయని విషయంకోసం ఆలోచిస్తున్నా
విన్నూతన విషయంకోసం వీక్షిస్తున్నా

అందమైన విషయంకోసం ఆత్రపడుతున్నా
ఆనందమైన విషయంకోసం అర్రులుచాస్తున్నా
అద్భుతమైన విషయంకోసం ఆరాటపడుతున్నా
అమోఘమైన విషయంకోసం అలమటిస్తున్నా

మంచి విషయంకోసం ముచ్చటపడుతున్నా
మధుర విషయంకోసం ఎదురుచూస్తున్నా
కమ్మని విషయంకోసం కష్టపడుతున్నా
చక్కని విషయంకోసం శ్రమిస్తున్నా

రసాత్మక విషయంకోసం రగిలిపోతున్నా
వ్యూహాత్మక విషయంకోసం వేచిచూస్తున్నా
పసందైన విషయంకోసం పారజూస్తున్నా
ప్రియమైన విషయంకోసం పాటుపడుతున్నా

మదులనుముట్టే విషయంకోసం మదిస్తున్నా
తలలనుతట్టే విషయంకోసం తపిస్తున్నా
శుద్ధమైన విషయంకోసం నిరీక్షిస్తున్నా
చిత్రమైన విషయంకోసం ప్రతీక్షిస్తున్నా

గుండ్లపల్లి రాజేంద్రప్రసాద్,

## కకావికల కలియుగం

గుడి చుట్టూ
ముక్తికా పుణ్యలోకాల ప్రాప్తికా
కొందరు చెట్టు చుట్టూ
కొందరు గోవు చుట్టూ
పాపాలు నశిస్తాయా
శాపాలు కృశిస్తాయా
కుజదోషమని వాదించే వాళ్ళకి
శనిదోషమని భేదించే వాళ్ళకి
సూర్యనమస్కారం
నదిని మొక్కి నీళ్ళు చల్లుకుంటే
మలినం వీడునా
స్నానించు హృదయం కల్మషం పోయేదాకా కష్మలం
వీడేదాకా
స్నానించు శరీరం శుభ్రం అయ్యేదాకా
అసూయ దూరమయ్యేదాకా
స్నానించు మెదడు స్వచ్ఛం అయ్యేదాకా
మరక చెరిగేదాకా
లోపించిన చిత్తశుద్ధితో నామాలు ధరిస్తేనేం
లోకించని భావశుద్ధితో బూడిద పూస్కుంటేనేం
చీకటి ఆవరిస్తే నకాంతికై
దుఃఖం ముంచుకొస్తే ఉపశమన బాటకై
ప్రయత్నమే పయనమే
మహత్తులు లేవు.. తాయత్తులు లేవు
సౌశీల్యం సంస్కారం సామాజికధర్మం వదిలేసి
భక్తిలతలతో అల్లుకుపోయేది మూఢ వీరులే
ఉల్లాసాల ఉద్రేకాల నడుమ ఉపవాస దీక్షలు
లక్ష్యం దిశగా సాగని లక్షబిల్వదళాలతో
అర్చనలు

మంగళం
మాటలోనే పాటలోనే బాటలో కాదు
వందలోనూ మందలోనూ మందబుద్ధులే
భక్తిలో వినమ్రత లేదు
ప్రేమలో పవిత్రత లేదు
క్రమబద్ధమైన
జీవనగమ్యాలను ఎంచుకోక
జీవితలక్ష్యాలను ఎన్నుకోక
అశాస్త్రీయ ఆలోచనప్రవంతిలో కొట్టుకుపోతూ
అమ్మల ఆశీస్సులతో తృప్తి పొందుతూ
స్వాముల సందేశాలతో సంతృప్తి చెందుతూ
ధర్మబద్ధ జీవితంలో ముద్రలులేని సాముద్రికాల
తార్కాణాలు లేని తర్కాల
అక్రమ సక్రమాలకు అంతుపట్టని చక్రాల
జతల వెతలు తీర్చని జాతకాల
జ్యోతి నివ్వని జ్యోతిష్యాల ఆలోచనలేల
సత్యనిష్ఠ పయనంలో
సంకుచిత సంచితకర్మ
లబ్ధిరహిత శుద్ధివిహిత ప్రారబ్ధకర్మ
గమ్యాగమ్యాల అగమ్య ఆగమకర్మ
పలవరింపులేల
అంకెలలో అందలం లేదు
అంకెలతో అదృష్టం లేదు
మౌఢ్యాలపేర మూఢనమ్మకాలలో చిక్కి
శూన్యమాసాల శుష్కప్రియాలతో సృక్కి
ఉత్తర దక్షిణ ధ్రువాలెరుగని
నయనాలకు ఆయనాలేల
ఉత్తమోత్తమ జనులకు ఉత్తరాయణమా
దయాదాక్షిణ్య హీనులకు దక్షణాయణమా

పురాకృత పాపపుణ్య రాతల కృతం
నర వా నర దానవుల కథల త్రేతం
మోహపూరిత మోసభరిత గాధల ద్వాపరం
కృషిచేయక శ్రమకూర్చక
సిరులకొరకై కకావికలం కలియుగం

కోటం చంద్రశేఖర్
9492043348

# మెరిసే డ్రెస్ కోడ్‌లోనే మెసేజ్

మనది క్రమశిక్షణ గల దేశం. అవతల వైపు తద్భిన్నంగా ఆటవిక దేశం. ఆ దేశ ప్రధానమంత్రి ఎక్కడున్నాడో తెలియదు. అక్కడి ఆర్మీ చీఫ్ ఏ స్థితిలో ఉన్నాడో ఏమో. మన ప్రధానమంత్రి నరేంద్ర దామోదర్ దాస్ మోదీ మన రక్షణ శాఖ మంత్రి రాజ్ నాథ్ సింగ్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోభాల్, చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ (సీడీఎస్) అనిల్ చౌహాన్, త్రివిధ దళాధిపతులైన ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది, ఎయిర్ చీఫ్ మార్షల్ ఏపీ సింగ్, నేవీ చీఫ్ అడ్మిరల్ దినేశ్ కే త్రిపాఠితో ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. ఆ దృశ్యాలు మనతోపాటు ప్రపంచం చూస్తోంది. ఆ దాయాదీ చూడడం లేదని అనుకోలేం.

విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రి భారత దేశ సైనికులు తలపెట్టిన కార్యకలాపాలను అధికారికంగా వివరిస్తున్నారు. మన దేశం స్ట్రక్చర్ ఇట్లా పర్ ఫెక్ట్ గా ఉంటుంది. మరి పాకిస్థానో.. అంతా అగాధం, అయోమయం. ఆ దేశం ఆర్మీ అస్తవ్యస్తం. టెర్రరిస్టులతో మమేకం, అంతా కలగాపులగం. ఎటువంటి ప్రామాణికత, ప్రమాణాలు (స్టాండర్డ్స్) లేని దిక్కుమాలిన వ్యవస్థ.

పద్ధతిపాడూ అంటూ లేని సైన్యం చెప్పుచేతల పాలకులు ఒకింత నిమిత్తమాత్రులు. ఉగ్రవాదులు, సైనికుల కోసమే సింహభాగం ఖర్చు పెడుతూ, సాధారణ ప్రజల కడుపుకొట్టే రకం. అలాంటి పాకిస్థాన్ విరచిత ఉగ్రవాదుల చేతుల్లో మన టూరిస్టుల ఊచకోతలకు ఎట్లా బదులు ఇవ్వాలో అట్లా ఇచ్చాక చేసింది మిస్రీ సమక్షంలో ఆర్మీ లెఫ్టినెంట్ కల్నల్ సోఫియా ఖురేషి, వాయుసేన వింగ్ కమాండర్ పైలట్ వ్యోమికా సింగ్ అనే మహిళా ఆఫీసర్లు మే 7న వివరంగా చెప్పినపుడు ప్రతీ భారతీయ గుండె ఉప్పొంగింది. వారు తమ తమ ఫార్మల్ యూనిఫాంలో ఆ రోజు మీడియా సమావేశంలో మాట్లాడారు. ఉగ్ర మూక కిరాతకానికి మన దేశం బదులిచ్చాక పాకిస్థాన్ అంతరితో మూసుకొని ఉండాల్సింది. కానీ ప్రతీకారంతో పాకిస్థాన్ పేట్రేగి కవ్వింపు దురాగతాలకు దిగి విఫలయత్నాలు చేయడంపైనా మన ఆ అధికార త్రయమే ఈ నెల 10న మళ్ళీ సమాజం ముందు సమాచారం ఉంచింది. ఈసారి



విలేకరుల సమావేశంలో వారు మెరిసే గంభీరమైన డ్రెస్ కోడ్ లో జరిగింది చెప్పారు. వారి వారి (ఆర్మీ, నేవీ) యూనిఫాంలో కాకుండా, ఏకరూప పోరాట దుస్తులు ధరించి ఎవరికి ఏ మెసేజ్ ఇవ్వాలో ఇచ్చేశారు. తదుపరి అడుగులు ఎలా ఉండబోతున్నాయో ఆ గంభీరమైన యూనిఫాంలు తేల్చాయి. ఆపరేషన్ సిందూర్ 2.0 ఉద్విగ్నతకు సిగ్నల్ ఇచ్చాయి.

ఇల్లెందుల దుర్గాప్రసాద్
సీనియర్ ఫ్రీలాన్స్ జర్నలిస్టు హైదరాబాద్, 9440850384

# యుద్ధం.. ప్రపంచానికి భారమే!

'యుద్ధాన్ని ప్రపంచం భరించలేదు' భారత్- పాకిస్తాన్ మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ డిప్యూటీ ప్రతినిధి ఫర్హాన్ హక్ ప్రకటన ఇది. ఆయన ప్రకటన వెనక ఎంతో అంతరార్థం దాగి ఉంది. ఇప్పటికే గాజా-ఇజ్రాయెల్, ఉక్రెయిన్-రష్యా మధ్య నెలలు, సంవత్సరాలుగా యుద్ధ పరిస్థితులు కొనసాగుతున్నాయి. తీవ్ర ఆస్తి, ప్రాణనష్టం సంభవిస్తున్నది. ఈ నేపథ్యంలో ప్రపంచ వాణిజ్యంపైనా తీవ్ర ప్రభావం పడింది. అనేక వస్తువుల ధరలు తీవ్రంగా పెరిగాయి. ఇది నిరుపేదలు, సామాన్య, మధ్య తరగతి ప్రజలకు భారంగా మారాయి. లక్షలాది కుటుంబాల ఆర్థిక పరిస్థితులు తలకిందులయ్యాయి. ఈ నేపథ్యంలో భారత్-పాకిస్తాన్ యుద్ధం మొదలైతే ప్రపంచ ఆర్థిక వ్యవస్థ కూడా అస్థిరత ఎదుర్కొనే ప్రమాదముంది. ప్రపంచ అనేక దేశాల ప్రజలపై తీవ్ర ప్రభావం పడుతుంది. ఈ నేపథ్యంలోనే అనేక దేశాల అధినేతలు యుద్ధ పరిస్థితులపై తీవ్ర ఆందోళన చెందుతున్నారు.



### ప్రపంచ దేశాల్లో ఆందోళన

రష్యా-ఉక్రెయిన్ యుద్ధం ప్రారంభమైనప్పుడు ప్రపంచవ్యాప్తంగా అనేక అంశాలపై ప్రభావం పడింది. రెండు దేశాల్లో ఉత్పత్తి అయ్యే వస్తువుల ధరలు ఆకాశాన్నంటాయి. యుద్ధం వల్ల గ్లోబల్ ద్రవ్యోల్బణం 2-3% పెరిగింది. రష్యా, ఉక్రెయిన్ గోధుమల సరఫరాలో 25 శాతం వాటాను కలిగి ఉన్నయి. అయితే యుద్ధం వల్ల 40-50 శాతం ధరలు పెరిగి ఆఫ్రికాలోని కొన్ని దేశాల్లో ఆహార సంక్షోభం సైతం ఏర్పడింది. పామాయిల్ ధరలు 40-50% పెరిగాయి, ఎరువుల ధరలు సైతం 30% పెరిగి వ్యవసాయ ఖర్చులు భారమయ్యాయి. అయితే ప్రత్యామ్నాయ మార్గాలు వెతుక్కోవడంతో కొన్ని నెలల తర్వాత పరిస్థితి అదుపులోకి వచ్చింది. కానీ అప్పటికే ప్రజలపై తీవ్ర ప్రభావం పడింది. ఇండియా-పాకిస్తాన్ యుద్ధం కొన్ని వారాలపాటు కొనసాగినా దాని ప్రభావం వివిధ అంశాలపై పడుతుందని ప్రపంచదేశాలు ఆందోళన చెందుతున్నాయి.

### ఎగుమతులు, దిగుమతులపై..

భారతదేశం ప్రస్తుతం 4.27 ట్రిలియన్ డాలర్లతో ప్రపంచంలోనే ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ. ఇండియా ఐటీ, ఫార్మా, వ్యవసాయం, టెక్స్ టైల్స్, ఆటోమొబైల్ రంగాల్లో ప్రధాన ఎగుమతిదారు. ప్రపంచంలో 40 శాతం బియ్యం సరఫరాలో ఇండియా ప్రపంచంలోనే అతిపెద్ద ఎగుమతి దారు. 10 శాతం సరఫరాతో పాకిస్తాన్ నాలుగో స్థానంలో ఉంది. అయితే ఒక వేళ యుద్ధం వల్ల ఓడరేవులు, రవాణా మార్గాలకు అంతరాయం కలిగితే మలేషియా, సింగపూర్, సౌదీ అరేబియా, యూఏఈ, బంగ్లాదేశ్, ఇండోనేషియాతోపాటు మరికొన్ని దేశాల్లో 20 నుంచి 30 శాతం బియ్యం ధరలు పెరగవచ్చు. ఆహార ద్రవ్యోల్బణం 5-10% పెరగవచ్చు. ఆసియాలోని దేశాల్లో చమురు ధరల్లో కూడా అస్థిరత ఉండవచ్చు. ఉల్లిపాయలు, ఔషధాల సరఫరా, టెక్స్ టైల్స్, ఐటీ సేవలపైనా ప్రభావం పడుతుంది. ఇండియా నుండి జెనెరిక్ ఔషధాలు దిగుమతి చేసుకునే నైజీరియా, కెన్యా, దక్షిణాఫ్రికా వంటి ఆఫ్రికా దేశాల్లో ఔషధ ధరలు 20-30% పెరగడం వల్ల ఆరోగ్య సంక్షోభాన్ని ఎదుర్కొనే ప్రమాదముంది. బియ్యం కొరత ఆహార సంక్షోభాన్ని తీవ్రతరం చేస్తుంది. ఇండియా నుంచి ఐటీ సేవలు, టెక్స్ టైల్స్, ఫార్మా ఎగుమతులు ఆగిపోతే అమెరికా, యూరప్ దేశాల్లో సాఫ్ట్ వేర్ డెవలప్‌మెంట్ ఖర్చులు, దుస్తులు, ఔషధ ధరలు 5-15% పెరగవచ్చు. చైనా ఇండియా నుండి రసాయనాలు, ఫార్మా మూలవస్తువులను దిగుమతి చేసుకుంటుంది. యుద్ధం వల్ల ఈ సరఫరా ఆగిపోతే చైనా ఔషధ ఉత్పత్తి ఖర్చులు పెరగవచ్చు.

### స్టాక్ మార్కెట్లపైనా తీవ్ర ప్రభావం

భారత్ పాకిస్తాన్ మధ్య నెలకొన్న ఉద్రిక్తతలు పూర్తిస్థాయి యుద్ధంగా మారితే వివిధ దేశాల్లో స్టాక్ మార్కెట్లపైన తీవ్ర ప్రభావం పడి మదుపరుల సంపద ఆవిరి అయ్యే ప్రమాదమున్నది. పహెల్గాం దాడి తర్వాత జరిగిన పరిణామాలతో పాకిస్తాన్ కు చెందిన కరాజీ స్టాక్ ఎక్స్ చేంజ్ 13 శాతానికి పైగా పడిపోయింది. ఆ దేశంలో కొన్ని రోజుల్లోనే 80 వేల కోట్లకుపైగా నష్టం వాటిల్లింది. భారత స్టాక్ మార్కెట్లు స్థిరంగానే ఉన్నా.. శుక్రవారం నిఫ్టి 250 పాయింట్లకు పైగా, సెన్సెక్ 800 పాయింట్లకు పైగా నష్టపోయాయి. అయితే ప్రస్తుతం భారత్ దగ్గర ఆర్థిక బలం ఎక్కువ. ఈ క్షీణత తాత్కాలికమేనని గతంలో ఎన్నో ఉదాహరణలు రుజువు చేశాయి. చైనా-పాకిస్తాన్ ఎకనామిక్ కారిడార్ లో చైనా ఇప్పటికే భారీ పెట్టుబడులు పెట్టింది. యుద్ధం జరిగితే, ఈ పెట్టుబడులపై రిస్క్ పెరుగుతుంది, ఇది చైనా స్టాక్ మార్కెట్‌లో స్వల్పకాలిక అస్థిరతను కలిగించే అవకాశముంది. ఐటీ, ఫార్మా రంగాల్లో అమెరికాకు భారత్ కీలక సరఫరాదారు. యుద్ధం వల్ల ఈ సరఫరాలకు ఆటంకం ఏర్పడితే, అమెరికన్ టెక్, హెల్త్ కేర్ స్టాక్‌లపై స్వల్ప ప్రభావం పడవచ్చు. యూరప్ లోనూ దీని ప్రభావం ఉండొచ్చు. బంగ్లాదేశ్ టెక్స్ టైల్ ఎగుమతులు ఇండియాపై ఆధారపడతాయి. వాణిజ్యానికి అంతరాయం ఏర్పడితే ఆ దేశ టెక్స్ టైల్ స్టాక్‌లు దెబ్బ తినొచ్చు.

### పాకిస్తాన్ అత్యుత్సాహంతో..

పహెల్గాం దాడి తర్వాత ఆపరేషన్ సిందూర్ పేరుతో భారతదేశం సర్జికల్ స్ట్రైక్ చేపట్టింది. ఉగ్రవాద కేంద్రాలను టార్గెట్ గా చేసుకొని దాడి చేసింది. సంయమనం పాటించాల్సిన పాకిస్తాన్ అత్యుత్సాహం చూపింది. రెచ్చగొట్టేలా ఇండియాలోని పలు చోట్ల డ్రోన్లతో దాడులు చేయడానికి ప్రయత్నించడంతో మళ్లీ ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. ఇప్పటికే పాకిస్తాన్ ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయి ఉన్నది. కేవలం 348 బిలియన్ డాలర్లతో అత్యంత బలహీనంగా ఉంది. 130 బిలియన్ డాలర్ల రుణంలో కూరుకుపోయి ఉంది. ఫారెక్స్ రిజర్వు నిల్వలు సైతం అతి తక్కువగా ఉన్నాయి. ఐఎంఎఫ్ బెయిలౌట్లపై ఆధారపడుతున్నది. భారత్ తీసుకున్న చర్యలకు ప్రతిగా ఇండియా నుంచి దిగుమతులను నిషేధించింది. ఇది ఆ దేశ వైద్యరంగంపై తీవ్ర ప్రభావాన్ని చూపింది. ప్రస్తుతం అక్కడ అత్యవసర మందులు దొరకని పరిస్థితి నెలకొన్నది. యుద్ధ భయాల నేపథ్యంలో పాకిస్తాన్ ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వెళ్లే ప్రయత్నాలు చేస్తున్నారు. యుద్ధం వస్తే ఆ దేశ పరిస్థితి మరింత దిగజారుతుంది. పాకిస్తాన్ రూపాయి మరింత పడిపోతుంది. నీటి కొరతతోపాటు గోధుమలు, బియ్యం, కూరగాయల ధరలు పెరుగుతాయి. పెట్రోల్, డీజిల్, గ్యాస్, విద్యుత్ ధరలు ఆకాశాన్నంటుతాయి. ఇప్పటికే చాలా ఎక్కువగా ఉన్న ధరలను భరించడం అక్కడి ప్రజలకు కష్టతరంగా మారింది. కొన్ని నివేదికల ప్రకారం ఆ దేశం వద్ద సైనిక వనరులు కూడా కొన్ని రోజులకు సరిపడా మాత్రమే ఉన్నాయి. అంతేకాకుండా ప్రపంచదేశాలు సైతం పాకిస్తాన్ ను దోషిగానే చూస్తున్నాయి. అక్కడి ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో ఐఎంఎఫ్ సహాయం, అంతర్జాతీయ సహకారం మరింత సంక్లిష్టంగా మారింది. ఇలాంటి పరిస్థితుల్లో పాకిస్తాన్ అక్కడి దేశ ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని మౌనంగా ఉండడమే మంచిది. అత్యుత్సాహానికి వెళ్లి భారత్ ను రెచ్చగొడితే ఆ దేశం తీవ్ర నష్టం ఎదుర్కోక తప్పదు. ఈ విషయం అక్కడి ప్రభుత్వానికి, ఆర్మీకీ తెలుసు. అయినా అలాగే వ్యవహరిస్తున్నారంటే ఆ దేశ పాలకులకు అక్కడి ప్రజల పట్ల ఏ మాత్రం చింత, పట్టింపు లేదని అర్థమవుతున్నది.



ఫిరోజ్ ఖాన్,
సీనియర్ ఫ్రీలాన్స్ జర్నలిస్ట్,
9640466464

# భారత రక్షణ శాఖకు ప్రతి పౌరుడు విధిగా విరాళాలు అందించాలి

- తెలంగాణలోని రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని ఆదర్శంగా తీసుకోవాలి
- భారత ప్రతిష్టను పెంపొందించేలా ప్రతి పౌరుడు కంకణబద్ధుడై ఉండాలి
- కాల్పుల విరమణకు ఇరుదేశాలు కుదుర్చుకున్న ఒప్పందం



మేడ్చల్, మే 10 (జనంసాక్షి) : పహల్గాం దాడిలో భారతీయులు అన్యాయంగా పొట్టన పెట్టుకున్న పాక్ ప్రేరేపిత ఉగ్రవాదులను అరికట్టడానికి భారత ప్రభుత్వం అన్నిరకాల చర్యలను తీసుకుంటుందనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. దీనికి ప్రధాన కారణం పాక్ ప్రభుత్వం కవ్వింపు చర్యలకు ఎన్ని రకాలుగా దురాక్రమణలకు పాల్పడుతున్న సమర్థవంతంగా తిప్పికొడుతూ పాక్ రక్షణ వ్యవస్థను ధ్వంసం చేసిన ఘనత భారత ప్రభుత్వానిదే. పహల్గాం దాడుల నేపథ్యంలో భారత ప్రభుత్వం పాకిస్తాన్ మీద ఉగ్రవాద స్థావరాలపైనే దాడులు చేసిందే తప్ప పౌరులపై ఎలాంటి దాడులు చేయలేదు. కానీ పాకిస్తాన్ మాత్రం కావాలని భారతదేశంలోని జైసల్మేర్, రాజస్థాన్, జమ్మూ కాశ్మీర్, చండీగఢ్, పంజాబ్ నియంత్రణ రేఖల వెంబడి కవ్వింపు చర్యలకు పాల్పడుతున్న భారత ప్రభుత్వం మాత్రం రక్షణ వ్యవస్థను సమర్థవంతంగా నిర్వహిస్తూ భారత పౌరులకు ధన, మాన, ప్రాణాలకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా చర్యలు తీసుకుంటూనే పాకిస్తాన్ పై దీటుగా యుద్ధం చేయడం భారత ప్రభుత్వం అనుసరిస్తున్న తీరు ప్రతి భారతీయ పౌరుడు సంతృప్తి చెందుతున్నారు. భారత ప్రభుత్వం గతంలో కంటే భిన్నంగా మొదట ప్రభుత్వానికి సింధు నది జలాల ఒప్పందాలను కాదని నది జలాలను అరికట్టడంతో పాకిస్తాన్ ప్రభుత్వం నీళ్లు లేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు అక్కడి ప్రజలు ఆందోళనలు వ్యక్తం చేస్తున్నారు. భారత ప్రభుత్వం ఇప్పటిదాకా ఒక లెక్క ఇప్పటినుంచి ఇంకో లెక్క అన్న విధంగా గతంలో కంటే భిన్నంగా పూర్తిగా సమర్థవంతంగా పాక్ ప్రభుత్వంపై దురాక్రమణను అడ్డుకుంటూనే పాక్ ప్రభుత్వాన్ని ఇతర దేశాల ముందు దోషిగా నిలబెడుతూ భారత్ తీసుకున్న అన్ని చర్యలు సమంజసమే అని అగ్రరాజ్యంతో పాటు రష్యా, మరిన్ని దేశాలు భారత ప్రభుత్వానికి సంఘీభావం తెలపడం శుభ పరిణామం. ఇదిలా ఉండగా భారత ప్రభుత్వం త్వరలో ఆర్థిక రంగంలో పరిపూర్ణమైన వృద్ధిని సాధిస్తుందన్న అనేక ప్రగతి నివేదికల ఆధారంగా కేవలం చైనా ప్రభుత్వం ధమన నీతి వల్ల పాక్ ప్రభుత్వం భారతదేశంపై ఇలా ప్రతిసారి ఉగ్రదాడులకు పాల్పడుతూ భారతదేశ సార్వభౌమత్వానికి ఆటంకం కలిగిస్తూ దృశ్చర్యలకు పాల్పడుతుంది. కానీ ఈ క్రమంలో మోడీ ప్రభుత్వం మాత్రం తీసుకుంటున్న చర్యల పట్ల ప్రతి పౌరుడు సంతోషం వ్యక్తం చేస్తున్నాడు. అంతేకాకుండా భారత ప్రభుత్వ శక్తి సామర్థ్యాలను యుద్ధరంగంలో మొదటిసారిగా ప్రపంచ దేశాలు మన రక్షణ వ్యవస్థ తీసుకుంటున్న చర్యలను చూసి కంగారు పడుతున్నారు. ఉగ్రవాదులకు వెన్నులో వణుకు వచ్చేలా భారత ప్రభుత్వం సమర్థవంతంగా అన్ని చర్యలు తీసుకుంటున్న క్రమంలో భారతీయ ప్రతి పౌరుడు విధిగా తమ తమ హక్కుగా భావించి రక్షణ శాఖకు విరివిరిగా విరాళాలు అందించి రక్షణ శాఖ వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని తద్వారా ప్రతి భారతీయుడు కలలు కన్నా భారతదేశం అగ్ర రాజ్యాలకు తీసిపోదు అన్న చందంగా భారత ప్రభుత్వం నిలబడుతుందని ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అందుకొరకు ప్రజలు విరాళాలు అందించాలని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

**కాల్పుల విరమణకు ఇరుదేశాలు ఒప్పందం**

విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రం మిశ్రీ శనివారం కీలక ప్రకటన చేశారు. ఈ కాల్పుల విరమణ ఒప్పందం శనివారం సాయంత్రం ఐదు గంటల నుంచి భారత్, పాక్ ప్రభుత్వాలకు సైతం వర్తిస్తుందని తెలియజేశారు. ఈ కాల్పుల విరమణ గగనతలంలో, సముద్ర జలాలలో, భూభాగంపై అన్ని రకాల మిలటరీ ఆపరేషన్స్ నిలిపివేస్తున్నామని ప్రకటన విడుదల చేశారు. అలాగే ఈనెల 12వ తేదీన పాకిస్తాన్ ప్రభుత్వంతో చర్చ సైతం కొనసాగుతాయని తెలియజేశారు.

# రాష్ట్రస్థాయి వీసా హెల్త్ అవార్డు అందుకున్న వినాయక సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్



తాండూరు, మే 10 (జనంసాక్షి) : రాష్ట్రస్థాయి వీసా హెల్త్ అవార్డు ఎంపిక లో తాండూర్ కు చెందిన వినాయక సూపర్ స్పెషాలిటీ హాస్పటల్ హెల్త్ అవార్డు ను సొంతం చేసుకుంది. శుక్రవారం తెలంగాణ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన డాక్టర్లకు హైదరాబాద్ ఫిలింనగర్ జే.ఆర్.సీ కన్వెన్షన్ హాల్లో నిర్వహించిన విసా హెల్త్ అవార్డుల పురస్కార లలో తాండూరు వినాయక సూపర్ స్పెషాలిటీ హాస్పటల్ అందుకుంది. హాస్పిటల్లో విధులు నిర్వహిస్తున్న డాక్టర్ హాస్పటల్ డైరెక్టర్ కేతావత్ రవీందర్ రాజా వారి కుటుంబ సభ్యులు ఈ అవార్డును మంత్రులు శ్రీధర్ బాబు సీతక్క చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. అవార్డు అందడం పట్ల ఆసుపత్రి చైర్మన్ విట్టల్ నాయ క్ సంతోషం వ్యక్తం చేస్తూ డాక్టర్ను అభినందించారు. అతి తక్కువ కాలంలోనే ప్రారంభించిన ఆరు నెలల లోపే రాష్ట్రస్థాయిలో వినాయక హాస్పిటల్ కు అవార్డు రావడం అభినందనీయమని అన్నారు. ఇక్కడ వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్లు మరియు ఆస్పత్రి సిబ్బంది కృషి వల్ల ఈ అవార్డు అక్కడ సంతోషకరంగా ఉందని డాక్టర్ రవీందర్ రాజా పేర్కొన్నారు.

# కమిటీ మెంబర్లు చెప్పిన వారి ఇందిరమ్మ ఇల్లు



బషీరాబాద్, మే 10 (జనం సాక్షి) : బషీరాబాద్ మండల పరిధిలో జీవన్గీ గ్రామంలో కమిటీ మెంబర్లు చెప్పిన వారికి ఇందిరమ్మ ఇల్లు ఇస్తారా,కాంగ్రెస్ నేతలకే ఇండ్లు మంజూరు,పరిశీలన కోసం వచ్చిన అధికారులపై గ్రామస్తులు భగ్గుమన్నారు. ఇందిరమ్మ ఇండ్ల సర్వేలో గ్రామస్తుల మధ్య అధికారుల మధ్య రగడ,వెన్ను తిరిగి వెళ్ళిన అధికారులు,ఇదేనా ఇందిరమ్మ రాజ్యం అంటున్న గ్రామస్తులు,ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారుల సర్వే కోసం ఏపీఓ పద్మరావు,పంచాయతీ కార్యదర్శి ప్రకాష్ గ్రామానికి వచ్చారు.గ్రామంలోని లబ్దిదారుల వివరాలను ఆరా తీస్తుండగా గ్రామంలో ఇండ్లు ఉన్న వారినే లబ్దిదారులుగా గుర్తించడం పట్ల ఆందోళనకు దిగారు.70శాతం మంది అనర్హులుగా ఉన్నప్పటికి ఎంపిక చేయడంపట్ల మండిపడ్డారు.అనర్హులను ఎలా ఎంపిక చేస్తారని నిలదీశారు. ఓ రాజకీయ నాయకుడి అండ దండలతో లబ్దిదారుల ఎంపిక చేశారని ఆరోపించారు.కాంగ్రెస్ కార్యకర్తలనే ఇందిరమ్మ ఇండ్ల కోసం ఎంపిక చేశారని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు.దీంతో గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల లొల్లి చర్చనీయాంశంగా మారింది.ఈ సందర్భంలో యువకులు,మహిళలు ఊగిపోతూ పూర్తిగా ఇల్లు లేకుండా కిరాయిలకు ఉంటున్న వారిని వదిలేసి కాంగ్రెస్ నాయకులకు ఇంద్ర మిల్లు మంజూరు చేస్తారా.ఇదేం ఇందిరమ్మ రాజ్యమని నిలదీశారు. ఇల్లులేని పేదలు,వికలాంగులు,వృద్ధులు, వితంతువులకు మొదటి ప్రాధాన్యత కల్పించాలని చెప్తుంటే కాంగ్రెస్ నాయకులు మాత్రం అవేమి పట్టవు అన్నట్టుగా వ్యవహరించారని ఆరోపించారు.ఈ సంఘటనపై స్థానిక ఎమ్మెల్యే కల్పించుకొని రీసర్వే చేయించాలని డిమాండ్ చేశారు.గ్రామస్తులు ఎంపీడీఓకు ఫిర్యాదు చేస్తామని చెప్పారు.

# అటు ఫిర్యాదు.. ఇటు స్పందన

- సర్కారు జాగాల్లో అక్రమ నిర్మాణాలను అరికట్టిన డిప్యూటీ మేయర్
- చాకచక్యంగా స్పందించి ఉన్నతాధికారుల దృష్టికి తార్నాక ఎర్రకుంట చెరువు స్థలాల్లో నిర్మాణాలు తొలగింపు
- ప్రభుత్వ భూముల పరిరక్షణే ధ్యేయంగా సీఎం రేవంత్ రెడ్డి పాలన
- హైడ్రా కృషిని అభినందించిన మోతె శ్రీలత శోభన్ రెడ్డి

హైదరాబాద్, మే 10 (జనంసాక్షి) : తార్నాక ఎర్రకుంట చెరువు ప్రభుత్వ స్థలం (సర్వే నెంబర్లు 121, 122, 123, 125) మొత్తం 9 ఎకరాల విస్తీర్ణంలో గుర్తు తెలియని వ్యక్తులు శనివారం ఉదయం 4 గంటల సమయంలో సుమారు 250పైగా గుడిసెలు నిర్మించారని స్థానికులు గ్రేటర్ హైదరాబాద్ నగర డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డికి సమాచారం అందించారు. ఈ విషయంపై వెంటనే స్పందించి, డిప్యూటీ మేయర్ స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఉస్మానియా యూనివర్సిటీ పోలీసులు వెంటనే రంగంలోకి దిగి, అక్రమంగా కబ్జా చేస్తున్న వారిపై చర్యలు తీసుకొని, గుర్తుతెలియని వ్యక్తులు కడుతున్న గుడిసెలను వెంటనే తొలగించారు. ప్రభుత్వ స్థలంపై అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాలని ఆదేశించారు. ఈ విషయం గురించి హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్‌కి, సికింద్రాబాద్ ఆర్డీఓ సాయిరాంకి సమాచారాన్ని తెలియజేశారు. కబ్జాకు పాల్పడిన వారిపై తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి, టిటియుసి రాష్ట్ర అధ్యక్షులు మోతే శోభన్ రెడ్డితో కలిసి తార్నాక ఎర్రకుంట ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ.. చెరువులు, నాళాలు, ప్రభుత్వ స్థలాల కబ్జాలను అరికట్టడంలో ప్రభుత్వం నిత్యం కృషి చేస్తోందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా ఈ విషయంలో ఎంతో తీవ్రంగా ఉన్నారని, ప్రజల శ్రేయస్సు కోసం ప్రభుత్వ స్థలాలను కాపాడటమే మా కర్తవ్యమని పేర్కొన్నారు.

**హైడ్రా ప్రత్యేక కృషికి అభినందనలు : మోతే శ్రీలత శోభన్ రెడ్డి, డిప్యూటీ మేయర్**

కబ్జా కార్యక్రమాలను అరికట్టడంలో కాంగ్రెస్ ప్రభుత్వం హైడ్రా ద్వారా పటిష్ఠమైన చర్యలు చేపడుతోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో హైడ్రా ప్రత్యేకంగా ఏర్పాటుచేయబడింది. ఇది నగరంలోని ప్రభుత్వ స్థలాలు, చెరువులు, నాళాలపై జరుగుతున్న అక్రమాలను గుర్తించి తక్షణమే చర్యలు తీసుకునేలా డిజైన్ చేయబడింది. హైడ్రా ఆధ్వర్యంలో ప్రత్యేక టాస్క్ ఫోర్స్ టీములు ఏర్పాటుచేయబడి, నగరంలో ప్రతి మూలకూ నిఘా ఉంచి, చెరువుల పునరుద్ధరణకు, పబ్లిక్ ఉపయోగానికి వాటిని అభివృద్ధి చేయడానికి చర్యలు చేపట్టబడుతున్నాయి. తార్నాక ఎర్రకుంట చెరువు ఘటనపై కూడా హైడ్రా ద్వారా ప్రత్యేక విచారణ చేపట్టనున్నామని డిప్యూటీ మేయర్ తెలిపారు.





**స్థానికుల కోసమే ఈ స్థలం : మోతే శోభన్ రెడ్డి, టిటియుసి రాష్ట్ర అధ్యక్షులు**

తార్నాక ఎర్రకుంట చెరువు జిహెచ్ఎంసి, హెచ్ఎండిఏ సంబంధిత స్థలం. ఈ స్థలాన్ని స్థానికుల కోసం వాకింగ్, పార్క్ ఏర్పాటు చేయడానికి ఉపయోగించాలని అనుకున్నాము. అయితే కొన్ని కోర్టు కేసుల కారణంగా ఆ ప్రక్రియ నిలిచిపోయింది. భవిష్యత్తులో ఈ ప్రాంతాన్ని ప్రజల అవసరాలకు ఉపయోగించేలా చూస్తాము. ప్రభుత్వం చేపడుతున్న ఈ చర్యల ద్వారా నగరంలోని ప్రతి ఒక్కరికి ప్రభుత్వ స్థలాలపై పూర్తి భద్రత కల్పించాలని సీఎం రేవంత్ రెడ్డి సంకల్పించారు.

# హెూమియోపతిక్ మెడిసిన్‌లో గోల్డ్ మెడల్ సాధించిన ఖమ్మం నగరానికి చెందిన తుమ్మలపల్లి చరిత



ఖమ్మం, మే 10 (జనం సాక్షి) : రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్, కర్ణాటక పరిధిలో బెల్గాం నగరంలో గల ఏ.ఎం. షేక్ హెూమియోపతిక్ మెడికల్ కాలేజ్, హాస్పిటల్ అండ్ పీజీ పరిశోధన సెంటర్, లో బ్యాచిలర్ ఆఫ్ హెూమియోపతిక్ మెడిసిన్ అండ్ సర్జరీ (బి.హెచ్.ఎం.ఎస్.) అండర్ గ్రాడ్యుయేషన్ లో అత్యధిక మార్కులు సాధించి నెంబర్ వన్ ర్యాంకును ఖమ్మం నగరానికి చెందిన తుమ్మలపల్లి చరిత సాధించారు. హెూమియోపతిక్ మెడిసిన్ లో టాపర్ గా నిలిచినందుకుగాను గోల్డ్ మెడల్ తో పాటు, ప్రతిష్టాత్మక డాక్టర్ బత్రాస్ స్కాలర్షిప్ కి ఎంపికైంది. ఈ సందర్భంగా జరిగిన గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమంలో రాజీవ్ గాంధీ హెల్త్ యూనివర్సిటీ హెూమియోపతి డీన్ శ్రీమతి. డాక్టర్. సహిదా ఎ. శిరసాంగి చేతుల మీదుగా డిగ్రీ పట్టాను మరియు గోల్డ్ మెడల్ ను చరిత అందుకున్నారు. తుమ్మలపల్లి చరిత దివంగత తెలంగాణ వసతి గృహ సంక్షేమ అధికారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షులు స్వర్గీయ తుమ్మలపల్లి రామారావు చిన్న కూతురు. ఈమె 2019 సంవత్సరంలో జాతీయస్థాయిలో నీట్ ఎగ్జాం లో ర్యాంక్ సాధించి, కర్ణాటక రాష్ట్రంలోని బెల్గాంలో బి.హెచ్.ఎం.ఎస్. కోర్సులో జాయిన్ అయింది. తుమ్మలపల్లి చరిత బెల్గాంలో అడ్మిషన్ తీసుకున్న కొద్ది నెలలకే తండ్రి రామారావు అకస్మాత్తుగా మరణించారు. తండ్రి లేని బాధ నుంచి కోలుకొని, తండ్రికిచ్చిన మాటను నిలుపుకొనుటకుగాను మనోధైర్యంతో చదివి అండర్ గ్రాడ్యుయేషన్ నాలుగు సంవత్సరాలలో ప్రతి సంవత్సరం మొదటి ర్యాంకు సాధించింది. కాలేజీ చరిత్రలోనే మొదటిసారిగా కర్ణాటక రాష్ట్రం వారు కాకుండా వేరే రాష్ట్రం వాళ్లు మొదటి ర్యాంకుతో గోల్డ్ మెడల్ సాధించటం ఇదే మొదటిసారి.

ఈ సందర్భంగా తుమ్మలపల్లి చరిత మాట్లాడుతూ మేము ఇద్దరం ఆడపిల్లలం అయినా కూడా నా తల్లి,తండ్రి చదువులో మమ్మల్ని బాగా ప్రోత్సహించారు. వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా అండర్ గ్రాడ్యుయేషన్ లో మొదటి ర్యాంకుతో గోల్డ్ మెడల్ సాధించానని, పీజీ పూర్తి చేసి, నా తండ్రి కోరుకున్న విధంగా పేద ప్రజలకు వైద్య సేవలు అందిస్తానని చెప్పారు. ఈ సందర్భంగా మొదటి ర్యాంకు తో గోల్డ్ మెడల్ సాధించిన తుమ్మలపల్లి చరితను కాలేజీ యాజమాన్యం ప్రత్యేకంగా సత్కరించింది. ఈ కాన్వకేషన్ కార్యక్రమంలో తల్లి విజయలక్ష్మి తో పాటు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# పీఏసీఎస్ సీఈఓని సస్పెండ్ చేసిన జిల్లా కలెక్టర్



పోచంపల్లి, మే 10 (జనం సాక్షి) : మండలంలోని జూలూరు గ్రామ పరిధిలోని అలీనగర్ పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ ఎం. హనుమంతరావు, నిర్వాహకంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన సీఈఓపై ఆగ్రహం వ్యక్తం చేసి వెంటనే సస్పెండ్ చేశారు. ధాన్యం తేమ శాతం సరిపోతే వెంటనే లోడింగ్ చేసి రైస్ మిల్లులకు తరలించాలన్న ఆయన, సెంటర్‌కు ఇంకా సందర్శించని సీఈఓపై అసంతృప్తి వ్యక్తం చేశారు. హమాలీలను ఏర్పాటు చేయకపోవడాన్ని కూడా తప్పుపట్టారు. జిల్లా లోపల ఇలాంటి నిర్లక్ష్యానికి తావులేదని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకూడదని స్పష్టం చేశారు. డీసీవోకు అన్ని పీఏసీఎస్ కేంద్రాల్లో హమాలీలు, త్రాగునీరు, టెంటులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

# వీర జవాన్ మురళి నాయక్‌కు నివాళులు



చేవెళ్ల, మే 10 (జనంసాక్షి) : దేశం కోసం ప్రాణత్యాగం చేసిన వీర జవాన్ మురళి నాయక్ కు చేవెళ్ల భాజపా కార్యాలయంలో భాజపా నాయకులు శనివారం ఆయన చిత్రపటానికి పూలమాలలతో నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... దేశ భద్రత కోసం పోరాడి ప్రాణాలర్పించిన మురళి నాయక్ లాంటి వీరులు దేశానికి గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో కెఎస్ రత్నం, అందే బాబయ్య, కంజర్ల ప్రకాష్, ప్రతాప్ రెడ్డి, అత్తెల్లి అనంత్ రెడ్డి, శ్రీకాంత్, ఆంజనేయులు, శంకర్ గౌడ్, నర్సింహా రెడ్డి, వెంకట్ రెడ్డి, వెంకటేష్, కుమార్ గౌడ్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచ పర్యావరణ సంస్థను అభినందించిన పుదుచ్చేరి ముఖ్యమంత్రి

హైదరాబాద్, మే 10 (జనంసాక్షి) : పుదుచ్చేరి ముఖ్యమంత్రి సీనియర్ రాజకీయ నాయకులు రంగస్వామి పుదుచ్చేరిలో స్వగృహంలో ప్రపంచ పర్యావరణ సంస్థ జాతీయ అధ్యక్షులు డాక్టర్ సిహెచ్ భద్ర ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా పర్యావరణ జీవజాతి సంరక్షణ కోసం మన ప్రపంచ పర్యావరణ సమస్య చేస్తున్న కార్యక్రమాలను అడిగి తెలుసుకుని ప్రత్యేకంగా అభినందించడం జరిగింది. ఈరోజులలో ఇటువంటి సమస్యను చూడడం చాలా ఆశ్చర్యంగా ఉందని ఆయన ఆశ్చర్యను వ్యక్తపరిచారు. ఈ భూమి మీద జీవజాతిని వృక్షజాతిని మానవజాతిని జంతు జాతిని జీవవైవిద్యాన్ని కాపాడటమే లక్ష్యంగా పాఠశాలలో విద్యార్థిని విద్యార్థులను చైతన్య పరుస్తూ ప్రపంచ పర్యావరణ సంస్థ పర్యావరణ పరిరక్షణ ఏకమవుదాం రండి అన్న ఏకైక నినాదంతో పని చేయడం నిజంగా ఎంతో గొప్ప విషయం అన్నారు. ఇటువంటి సమస్యతో కలిసి మా ప్రభుత్వం పని చేస్తుందని ఈ సందర్భంగా తెలియజేశారు. భవిష్యత్తులో పుదిచ్చేరి కేంద్ర పాలిత రాష్ట్రాన్ని పర్యావరణ పరిరక్షణ అనుకూలమైన ప్రదేశంగా తీర్చిదిద్దుతామని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ హైదరాబాద్ రికగ్నేషన్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ కరస్పాండెంట్స్ అసోసియేషన్ గౌరవ చైర్మన్ తమ్మినేని సత్యనారాయణ ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి ప్రతి పాఠశాల విద్యార్థి ప్రపంచ పర్యావరణ సంస్థ చెబుతున్న సూత్రాలను తప్పకుండా పాటించడానికి మీ ప్రభుత్వం సరైన చర్యలు తీసుకోవాలని అందుకోసం ప్రతి విద్యార్థి కనీసం తన పాఠశాల విద్య కాలంలో కనీసం 10 మొక్కలు నాటాలని వాటిని పరిరక్షించాలని అన్ని వేదికల మీద పర్యావరణానికి అనుకూలమైన విద్యార్థులను తయారు చేయాలని అందుకు పుదుచ్చేరి ప్రభుత్వం సంపూర్ణ సహయ సహకారాలు అందించాలని పుదుచ్చేరి భారతదేశంలోనే ప్రపంచంలోనే ఎంతో సుందరమైన ప్రదేశం ప్రతి సంవత్సరం లక్షలాది మంది పర్యాటకులు ఈ ప్రాంతాన్ని సందర్శిస్తార. ప్రతి పర్యాటకుడు పర్యాటకురాలు కనీసం ఒక మొక్కను నాటి అందమైన మన పుదిచ్చేరిని నిర్మించాలని అందుకోసం ప్రభుత్వం స్వచ్ఛంద సంస్థలు ముఖ్యంగా ప్రతి ఒక్కరు ప్రపంచ పర్యావరణ సంస్థ కలిసినడవాలని కలిసి రావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ ఎన్ రంగస్వామి మాట్లాడుతూ గత 12 సంవత్సరాలుగా పర్యావరణ పరిరక్షణ కోసం మన ప్రపంచ పర్యావరణ సంస్థ దేశంలో రాష్ట్రంలో ప్రపంచంలో ఏ సమస్త చేయలేనని కార్యక్రమాలు నిర్వహిస్తూ లక్షలాది మొక్కలు నాటుతూ వేలాది కార్యక్రమాలు టాక్స్ ఫైలింగ్ ఇండియా సంస్థ చైర్మన్ చల్లూరి శ్రీనివాస్ సహకారంతో నిర్వహిస్తూ ప్లాస్టిక్ వ్యతిరేకంగా దాదాపుగా రెండు నుంచి ఐదు లక్షల క్లాస్ బ్యాగులను పంచిపెట్టి ప్రతి విద్యార్థి ప్రతి ఒక్కరు తమ విద్యార్థి దశలో తమ పుట్టినరోజు తమ వివాహ దినోత్సవ



వేడుకలలో తమ పూర్వికులు చనిపోయిన వర్ధంతి దినోత్సవాల్లో మొక్కలని బహుమతులుగా సమర్పించాలని అందుకోసం ప్రపంచ పర్యావరణ సంస్థ చేస్తున్న అన్ని కార్యక్రమాలు నిస్వార్థంగా ప్రతి ఒక్కరు ముందుకు నడిపించాలని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ప్రపంచ పర్యావరణ సంస్థ పాండిచ్చేరి రాష్ట్ర కోఆర్డినేటర్ సురేష్ తదితరులు పాల్గొని ప్రపంచ పర్యావరణ సంస్థ చేస్తున్న కార్యక్రమాలు దేశం కోసం భవిష్యత్తు తరాల కోసం భూగోళం సంరక్షణ కోసం జరుగుతున్నాయని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రపంచ పర్యావరణ సంస్థ ప్రధాన కార్యదర్శి నిఖిల్, కోశాధికారి రిజ్వాన్, సహాయ కార్యదర్శి రాజేష్ గౌడ్ తదితరులు పాల్గొని సందర్భంగా ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు.

జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం
11 మే 2025

# దేశ రక్షణలో ప్రాణాలర్పించిన సైనికులకు సీపీఎం నివాళి

- మృతి చెందిన సైనికుల కుటుంబాలను కేంద్ర ప్రభుత్వం ఆదుకోవాలి
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చుక్క రాములు



**సంగారెడ్డి టౌన్ మే 10 (జనం సాక్షి) :** దేశ రక్షణ కోసం పాక్, భారత్ సరిహద్దు ప్రాంతంలో జరిగిన యుద్ధంలో దేశానికి చెందిన సైనికులు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన మురళి నాయక్‌కుల మృతి పట్ల ఈరోజు సంగారెడ్డి కేవల్ కిషన్ భవన్లో జరిగిన సిపిఎం జిల్లా కమిటీ సమావేశంలో తీవ్ర సంతాపం వ్యక్తం చేసి సభ్యులందరూ లేచి మౌనం పాటించి నివాళు లర్పించడం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చుక్క రాములు హాజరైనారు. ఈ సందర్భంగా చుక్క రాములు మాట్లాడుతూ జమ్మూ కాశ్మీర్ ప్రాంతంలో పాకిస్తాన్ తో జరిగిన యుద్ధంలో దేశ రక్షణ కోసం అమరులైన సైనికుల కుటుంబ సభ్యులకు సీపీఎం ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. వీర జవాన్‌లు ప్రదర్శించిన ధైర్య సాహసం ఎందరికో స్ఫూర్తిదాయకమన్నారు. దేశం కోసం ప్రాణాలొడ్డి పోరాడుతున్న సైనికుల సేవలు త్యాగాలు గొప్పవన్నారు. దేశం కోసం ప్రాణాలర్పించిన కుటుంబాలను కేంద్ర ప్రభుత్వం కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. జిల్లాలో మంచినీటి సమస్య రోజురోజుకు తీవ్రమవుతుందని అన్నారు. మంచినీటి సమస్యకు పరిష్కారం చూపాల్సిన అధికారులు నిర్లక్ష్యం వహించడం సరికాదన్నారు. జహీరాబాద్, నారాయణఖేడ్ ఆందోలు ప్రాంతాల్లో తీవ్ర నీటి ఎద్దడి ఉందన్నారు. వడ్ల కొనుగోలు కేంద్రాల్లో రైతులకు వసతులు కల్పించాలని కోరారు. తడిసిన ధాన్యం కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాజయ్య, సాయిలు, మాణిక్, నర్సింలు, జిల్లా కమిటీ సభ్యులు యాదగిరి, ప్రవీణ్, రేవంత్, నాగేశ్వర్ రావు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## అయిల్ రిఫనరి పనులు త్వరితగతిన పూర్తి చేయాలి



**నంగునూరు, మే 10 (జనం సాక్షి) :** సిద్దిపేట నియోజకవర్గం నంగునూర్ మండలం నర్మేట గ్రామం లో చేపట్టిన అయిల్ ఫామ్ ఫ్యాక్టరీ నిర్మాణ పనులను మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు పరిశీలించారు. ఈ సందర్బంగా ఫ్యాక్టరి నిర్మాణ పనులు క్షుణ్ణంగా పరిశీలించారు. క్షేత్ర స్థాయి లో కలియతిరుగుతూ నిర్మాణపనులు అడిగి తెల్సు కున్నారు.ఇప్పటికే అయిల్ ఫామ్ సాగు క్రాప్ అందుబాటులో కి వచ్చిందని..జులై నాటికీ ఫ్యాక్టరీ అందుబాటులో తేవలన్నారు.. ప్రతి యేటా జిల్లాలో అయిల్ ఫామ్ సాగు రైతు లు ఎంతో కష్టపడి చేస్తున్నారని.. రైతు లకు మేలు కోసమే ఈ ఫ్యాక్టరిని ఏర్పాటు చేసామన్నారు.. అయిల్ ఫెడ్ కమిషనర్ గారితో ఫోన్ లో మాట్లాడి అయిల్ రిఫనరి పనులు వేంటనే చేపట్టాలని చెప్పారు.పనులు యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని సూచించారు. జులై నాటికి హెల్త్నెన్ బ్యాటరీ అందుబాటులోకి తేవాలి.

## కరాచీ పేరు తొలగించాలి

- కరాచీ బేకరీ ముందు బిజెపి నాయకులు ఆందోళన




**శంషాబాద్, మే 10 (జనంసాక్షి) :** పాకిస్తాన్ నగరంలోని కరాచీ పేరుతో వ్యాపారాలను మూసివేయాలని బీజేవైఎం నాయకులు డిమాండ్ చేశారు. బీజేవైఎం మున్సిపల్ అధ్యక్షులు వంశీ యాదవ్ ఆధ్వర్యంలో శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని కరాచీ బేకరీ ముందు శనివారం ఆందోళనలు నిర్వహించారు. కరాచీ పేరును తొలగించి వ్యాపారాన్ని కొనసాగించాలన్నారు. కరాచీ పేరు వింటేనే భారతీయులు అగ్ర ఆవేశాలకు గురవుతున్నారు. భారతీయ పౌరులుగా భారతదేశానికి సంబంధించిన పేరును వినియోగించాలి తప్ప శత్రుదేశం అయిన పాకిస్తాన్ పేరు ఉచ్చరించరాదంటు బేకరీ ముందు నిరసన వ్యక్తం చేశారు. యుద్ధంలో స్థానిక పౌరులతో పాటు స్కూలు ప్రార్థన మందిరాలను టార్గెట్ చేసి డ్రోన్లలను క్షిపణులను వదులుతున్నా పాకిస్తాన్. భారతదేశంలో పాకిస్తాన్ పేరు పెట్టి వ్యాపారులు చేయడం విడ్డూరమన్నారు. దేశభక్తిని చాటుకొని శత్రు దేశమైన కరాచీ పేరును తొలగించాలని డిమాండ్ చేశారు. బిజెపి నాయకులను ఎస్సై శ్రీధర్ తన సిబ్బందితో కలిసి సముదాయించి పంపించి వేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రోటోకాల్ కన్వీనర్ ప్రశాంత్, పొల్యూషన్ బోర్డు మాజీ సభ్యులు బిజెపి నాయకులు కోలాన్ ప్రదీప్ రెడ్డి, బీజేవైఎం నాయకులు భాస్కర్ రెడ్డి, బాత్కు శ్రీను, రాజు రెడ్డి, డిఎల్ స్వామి, బిజెపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మహిళలు నిర్భయంగా ఫిర్యాదు చేయాలి

- జిల్లా షీ-టీం బృందాలతో సమీక్షా
- జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్




**సంగారెడ్డి ప్రతినిధి, మే 10 (జనం సాక్షి) :** మహిళలు మౌనం వీడి నిర్భయంగా పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయాలని జిల్లా ఎస్పీ వారితో పంకజ్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలో షీ–టీం బృందాలతో ఎస్పీ సమీక్షా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా సబ్–డివిజన్ల వారీగా షీ టీమ్స్ బృందాలు ఉన్నాయన్నారు. నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ. స్కూల్స్, కళాశాలు, బస్ స్టాండ్ ల వంటి తదితర రద్దీ ప్రాంతాలలో గస్తీ కాస్తూ ఆకతాయిలకు చెక్ పెట్టడం జరుగుతుందన్నారు. షీ–టీమ్ కంప్లైంట్స్ క్యూఆర్ కోడ్ స్కానర్ గురించి అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. ఈ క్యూ ఆర్ కోడ్ ను వినియోగించి ఆన్లైన్ ద్వారా ఎక్కడి నుండైన పిర్యాదు చేసేందుకు అనుకూలంగా ఉంటుందని తెలిపారు. ఈ షీ–టీమ్ కంప్లైంట్ క్యూఆర్ కోడ్ స్కానర్ పోస్టర్లను జిల్లాలోని బస్సులలో, బస్ స్టాండ్ లలో, సినిమా హల్లు, స్కూల్స్, కళాశాలలు, ఇతర రద్దీ ప్రాంతాలలో అతికించబడి ఉంటాయన్నారు. ఎవరైనా మహిళలు వేధింపులకు గురైనట్లైతే ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయడం లేదా https://qr.tspolice.gov.in లింక్ లో గాని ఫిర్యాది పేరు, లోకేషన్ తదితర వివరాలను పూరించి సబ్మిట్ చేయగానే షీ–టీమ్ విభాగానికి చేరుతుందని, తద్వారా త్వరిత గతిన స్పందించడం జరుగుతుందని అన్నారు. జిల్లాలో మహిళలు ఎలాంటి వేధింపులకు గురైన జిల్లా షీ–టీం నెంబర్ 8712656772 కు కాల్ చేసి గాని, వాట్స్ ఆప్ ద్వారా గాని, క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి గాని ఫిర్యాదు చేయవచ్చు అన్నారు. ఫిర్యాది వివరాలు గోప్యంగా ఉంచబడతాయని మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలసిందిగా జిల్లా ఎస్పీ సూచించారు.

## జూనియర్ సివిల్ జడ్జి స్వర్ణ మల్లికకు ఘన సన్మానం



**గద్వాల్ రూరల్, మే 10 (జనంసాక్షి) :** గట్టు మండలానికి చెందిన స్వర్ణ మల్లిక ఇటీవల వెలుబడిన జడ్జి నియామక ఫలితాలలో జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికైన సందర్భంగా ఘన సన్మానం చేసిన సిపిఐ పార్టీ జిల్లా కార్యదర్శి ఆంజనేయులు,బిసి సంఘం జిల్లా నాయకులు,బిఆర్ఎస్ పార్టీ రాజోలి మండల అధ్యక్షులు పచ్చర్ల శ్రీనివాసులు.ఈ సందర్భంగా గద్వాల పట్టణంలోని వారి నివాసానికి వెళ్లి నూతన జడ్జిగా ఎంపికైన స్వర్ణ మల్లికను, తండ్రి అడ్వాకేట్ గట్టు సురేష్‌ను ఘనంగా సన్మానం చేసి స్వీట్లు పంచి సంతోషాన్ని వ్యకం చేస్తూ అభినందనలు తెలియపరిచారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జోగులాంబ గద్వాల జిల్లా లోనే మొట్ట మొదటి జడ్జిగా స్వర్ణ మల్లిక ఎంపిక కావడం జోగులాంబ గద్వాల జిల్లాకు ఎంతో గర్వ కారణం అని అలాగే ఆమె భవిష్యత్తులో ఇంకా ఉన్నత శిఖరాలకు ఎదగాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ మాజీ నాయకులు గంట పరమేష్ బాబు, ఏఐవైఎఫ్ మాజీ నాయకులు పాషా,గట్టు మండల మైనారిటీ నాయకులు గూడు సాబ్,పద్మ శాలి సంఘం నాయకులు సత్య నారాయణ,వాల్మీకి సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## 760 గ్రాముల గంజాయి పట్టివేత

- ఎక్సైజ్ ఎస్సై నాగరాజు



**జడ్చర్ల, మే 10 (జనం సాక్షి) :** 760 గ్రాముల గంజాయి పట్టివేత ఘటన శనివారం బాలనగర్ మండలం మోతీ ఘనపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. జడ్చర్ల ఎక్సైజ్ కార్యాలయంలో శనివారం జరిగిన మీడియా సమావేశంలో ఎస్సై నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం బాలనగర్ మండలం మోతి ఘనపూర్ గ్రామానికి చెందిన ధనరాజ్ అనే వ్యక్తి గంజాయి విక్రయిస్తున్నాడని విశ్వసనీయ సమాచారం మేరకు ఎక్సైజ్ ఎస్సై నాగరాజు తన సిబ్బంది మురళీ మోహన్, సిద్ధార్థ్, జ్యోతి, చంద్రమౌళి లతో కలిసి ధనరాజ్ ఇంటిపై దాడి చేసి ఇంట్లో నిల్వ ఉంచిన 720 గ్రాములు, ధనరాజ్ ద్విచక్ర వాహనం హోండా యాక్టివాలో ఉంచిన 40 గ్రాముల గంజాయి మొత్తం 760 గ్రాముల గంజాయిని, ద్విచక్ర వాహనం, 3 మొబైల్ ఫోన్ లు, 385 ఖాళి ప్యాకెట్లు, ఎలక్ట్రానిక్ వేయింగ్ మిషన్ ను స్వాధీనపరుచుకున్నట్లు తెలిపారు. వీటి మొత్తం విలువ రూ. 1.20 లక్షలు ఉంటుందని, ధనరాజ్ అనే వ్యక్తి మోతీ ఘనపూర్ లో నివాసముండే బిర్జుసింగ్ అనే వ్యక్తి నుండి 20వేలకు కిలో చొప్పున గంజాయిని ఖరీదు చేసి 4 గ్రాముల ప్యాకెట్లుగా తయారు చేసి ఒక్కో ప్యాకెట్ ను 3 వందలకు మోతి ఘనపూర్ గ్రామ సమీపంలోని పరిశ్రమలలో పనిచేసే కార్మికులకు అమ్ముతూ సొమ్ము చేసుకుంటున్నాడని, వారిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి తదుపరి చర్యల నిమిత్తం కోర్టులో హాజరు పరిచినట్లు తెలిపారు.

## జవాన్ మురళి నాయక్‌కు ఎస్ఎఫ్ఐ నివాళి




**అబ్దుల్లాపూర్‌మెట్, మే 10 (జనం సాక్షి) :** పాకిస్థాన్ ఉగ్రవాదుల దాడిలో వీరమరణం పొందిన భారత జవాన్ మురళి నాయక్‌కు స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్ఎఫ్ఐ) నివాళు లర్పించింది. అబ్దుల్లాపూర్ మెట్‌లోని ప్రజా సంఘాల కార్యాలయంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మురళి నాయక్‌కు మౌనం పాటించి, కొవ్వొత్తులతో నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు గుండె శివకుమార్ మాట్లాడుతూ, దేశం కోసం ప్రాణత్యాగం చేసిన మురళి నాయక్ త్యాగం చిరస్థాయిగా నిలిచిపోతుందని అన్నారు. “వారి బలిదానం దేశ ప్రజలు ఎన్నటికీ మరచిపోలేరు. జవాన్ల త్యాగం భారత యువతకు స్ఫూర్తిగా నిలవాలి. వారిని ఆదర్శంగా తీసుకుని సమాజ శ్రేయస్సు కోసం ముందుకు సాగాలి” అని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు హరిష్, సూర్య, శివలింగం, చందు తదితరులు పాల్గొన్నారు. మురళి నాయక్ స్మృతిలో దేశభక్తి, సామాజిక బాధ్యతను మరింత బలోపేతం చేయాలని పాల్గొన్న నాయకులు సంకల్పించారు.

## అకాల వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండాలి



**కొండాపూర్, మే 10 (జనం సాక్షి) :** అకాల వర్షాల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని కొండాపూర్ తాహసిల్దార్ అశోక్ తెలిపారు. శనివారం మండల పరిధిలోని అలియాబాద్ గ్రామంలోని పిఎసిఎస్ ద్వారా నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మండల తహసిల్దార్ బి. అశోక్ సందర్శించారు. కొనుగోలు కేంద్రాలను రైతులు తరలించిన ధాన్యం నిలువలను పరిశీలించారు. రైతులకు సంబంధించి ధాన్యం అమ్మకం విషయంలో ఏదైనా సమస్యలు తలెత్తుతున్నాయా అని ఆరా తీశారు. కేంద్రాలకు ఎప్పుడు దాన్యం తీసుకోవచ్చారు, ఎన్ని రోజులకు తూకం జరుగుతుందని కేంద్రాల నిర్వహకులు సహకరిస్తున్నారా, సదుపాయాలు అందుబాటులో ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. అకాల వర్షాలు కురుస్తున్నందున రైస్ మిల్లర్ల వద్ద ధాన్యం నిలువలతో కూడిన వాహనాలు ఎక్కువ సమయం ఉండకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. హమాలీలు లారీలు కొరత ఉండకుండా ప్రణాళిక బద్ధంగా వ్యవహరించాలని తాసిల్దార్ అశోక్ పిఎసిఎస్ సిబ్బందికి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మల్లం రాజ్ ,రామచంద్రయ్య ,సిరజ్ లు ఉన్నారు.

## శాంతి భద్రతల పరిరక్షణలో ప్రతి ఒకరు బాధ్యతగా వ్యవహరించాలి



- బాలనగర్ జోన్ డిసిపి కె. సురేష్ కుమార్

**కుత్బుల్లాపూర్ మే 10 (జనం సాక్షి) :** శాంతి భద్రతల పరిరక్షణలో ప్రతి ఒక్కరు బాధ్యతగా వ్యవహరించాలని అప్పుడే నేరాలు నియంత్రించవచ్చునని బాలానగర్ జోన్ డిసిపి. కే.సురేష్ కుమార్ అన్నారు.శనివారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం రంగారెడ్డినగర్ డివిజన్ పరిధి గాంధీనగర్ లో గల శ్రీ రామలింగేశ్వర ఆంజనేయ స్వామి దేవాలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు డిసిపి సురేష్ కుమార్, ఏసీపి హనుమంతరావు, జీడిమెట్ల సీఐ గడ్డం మల్లేష్ హాజరయ్యారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ అపరిచిత వ్యక్తులు ఎవరైనా కాలనీల్లోకి, బస్తీ ల్లోకి వస్తే స్థానిక పోలీస్ స్టేషన్లో సమాచారం అందించాలని తెలిపారు.ఆలయ పరిసర ప్రాంతాల్లో సీసీ కెమెరాలు (నిఘానేత్రాలు) ఏర్పాటు చేసుకోవాలన్నారు. ప్రస్తుతం సాంకేతికత పెరుగుతున్న తరుణంలో నేరస్తులను పట్టుకోవడం కోసం సీసీ కెమెరాలు ఎంతగానో దోహదపడుతున్నాయి అన్నారు.స్థానిక బస్తీ సంక్షేమ సంఘం మాజీ అధ్యక్షులు జల్దా రాఘవులు మాట్లాడుతూ తమ ప్రాంతంలో కులమతాలకతీతంగా సోదరుభావంతో ఉంటామని తెలిపారు.రాత్రి సమయాల్లో పెట్రోలింగ్ వాహనాలు రెండు మూడు పర్యాయాలు సంచరించేలా చూడాలని పోలీసు అధికారులకు విన్నవించారు. తమ వంతు సహాయ సహకారాలు పూర్తిస్థాయిలో అందజేస్తామని చెప్పారు.అనంతరం రామలింగేశ్వర, ఆంజనేయ స్వాములకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బిజెపి రాష్ట్ర నాయకులు రంగా శ్రీనివాస్ గౌడ్,కాపు సత్యనారాయణ రావు, స్థానిక బస్తివాసులు,మహిళలు పాల్గొన్నారు.

## మంత్రి సహకారంతో అందిన వైద్యం

- పరామర్శించిన కాంగ్రెస్ నాయకులు



**నంగునూరు, మే 10 (జనం సాక్షి) :** సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం అక్కెనపల్లి గ్రామానికి చెందిన బద్దిపడగ బాల్ రెడ్డి 10 రోజుల కిందట అనారోగ్యానికి గురవడంతో కుటుంబ సభ్యులు నిమ్స్ ఆస్పత్రిలో చేర్పించారు. ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం అందేవిదంగా చూడాలని కుటుంబ సభ్యులు కాంగ్రెస్ పార్టీ మండల మాజీ అధ్యక్షుడు ఎం.డి.ఇమ్రాన్ ద్వారా రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సి.దామోదర రాజనర్సింహా దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన దామోదర రాజనర్సింహా మెరుగైన వైద్యం అందించాలని నిమ్స్ ఆస్పత్రి వైద్యులను ఆదేశించారు. దీంతో మెరుగైన వైద్యం అందడంతో బాల్ రెడ్డి కోరుకున్నారు. ఆసుపత్రి నుంచి డిశ్చార్జి అయి ఇంటికి వచ్చారు. మంత్రి దామోదర్ రాజనరసింహా ఆదేశాల మేరకు శనివారం కాంగ్రెస్ పార్టీ మండల శాఖ మాజీ అధ్యక్షుడు ఇమ్రాన్ బాల్ రెడ్డిని పరామర్శించారు. సందర్భంగా బాల్ రెడ్డి వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహాకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గడ్డం కరుణాకర్ రెడ్డి, సాగర్ రెడ్డి, రమేశ్ రెడ్డి, బోడ రాములు, బడుగు సదానందం తదితరులు పాల్గొన్నారు.

# ఎన్‌డిపియస్ కేసులలో నిందితులకు తప్పనిసరిగా శిక్ష పడేలా చూడాలి

- కోర్టు డ్యూటీ అధికారులతో ఎస్పీ సమీక్ష




**సంగారెడ్డి ప్రతినిధి, మే 10 (జనం సాక్షి) :** ఎన్.డి.పి.యస్ కేసులలో నిందితులకు తప్పనిసరిగా శిక్ష పడేలా చూడలని జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ పేర్కొన్నారు. శనివారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో కోర్టు డ్యూటీ అధికారులతో ఎస్పీ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ మాట్లాడుతూ.. ఎన్.డి.పి.యస్ కేసులలో నిందితులకు తప్పనిసరిగా శిక్ష పడేలా చూడాలన్నారు. ప్రతి కేసులో నిందితులకు శిక్ష పడే విధంగా చూడాలని, తప్పు చేసిన వారు చట్టం నుండి తప్పించుకోవడానికి వీలులేదన్నారు. న్యాయస్థానం ముందు నిందితులకు శిక్ష పడినప్పుడే, ప్రజలలో పోలీసులపై నమ్మకం పెరుగుతుందని అన్నారు. చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న నాన్ బెయిలబుల్ వారెంట్స్ ఎగ్జిక్యూట్ చేయాలని అన్నారు. ముఖ్యంగా ఎన్.డి.పి.యస్ కేసులలో నిందితులకు తప్పనిసరిగా శిక్ష పడేలా చూడాలని అన్నారు. సైబర్ నేరాలకు సంభందించి హోల్డ్ చేయబడిన డబ్బులు బాధితులకు అందేవిధంగా సంభందిత బ్యాంక్ లకు ఆదేశాలు జారీ చేసేవిధంగా చూడాలని తెలిపారు. ఈ నెల 14వ తేది వరకు జరగనున్న స్పెషల్ లోక్ అదాలత్ లో రాజి కుదుర్చుకోవడానికి అవకాశం ఉన్న అన్నీ కేసులలో కక్షిదారులు రాజీ కుదుర్చుకునేల చూడాలని అన్నారు. కోర్ట్ డ్యూటీ అధికారులు ఇటు పోలీసు శాఖకు, అటు న్యాయ శాఖకు వారధిగా ఉంటూ కోర్ట్ మానిటరింగ్ సిస్టమ్ నందు జిల్లాను మొదటి వరుసలో ఉంచాలని అన్నారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ కే. శ్రీనివాస్ రావ్, డీసీఆర్బీ ఇన్స్పెక్టర్ రమేష్, కోర్ట్ లైజనింగ్ అధికారి సత్యనారాయణ, డీసీఆర్బీ సిబ్బంది, కోర్ట్ డ్యూటీ అధికారులు తదితరులు ఉన్నారు.

# వరి ధాన్యం ప్రక్రియ సమర్ధవంతంగా నిర్వహించాలి

**జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్**

**లక్షెట్టిపేట మే 10 (జనం సాక్షి)**



ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతుల వద్ద నుండి నిబంధనల ప్రకారం నాణ్యమైన వరి ధాన్యాన్ని కొనుగోలు చేసి కేటాయించిన ప్రకారం రైస్ మిల్లులకు తరలించడం జరుగుతుందని జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్ అన్నారు. శనివారం జిల్లాలోని లక్షెట్టిపేట మండలం మిట్టపల్లి గ్రామంలోని శ్రీ శివరామకృష్ణ ట్రేడర్స్ రైస్ మిల్లును సందర్శించి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. కొనుగోలు కేంద్రాల నుండి వచ్చిన ధాన్యం లోడును తక్షణమే దిగుమతి చేసుకొని వాహనాలను తిరిగి పంపించాలని తెలిపారు. రైస్ మిల్లులకు కేటాయించిన లక్ష్యాలను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని, సి.ఎం.ఆర్. లక్ష్యాల సాధన ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. అవసరమైతే హమాలీల సంఖ్య పెంచుకోవాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాల నుండి వస్తున్న ధాన్యం లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని తెలిపారు. అనంతరం మండలంలోని లక్ష్మీపూర్- 1, లక్ష్మీపూర్- 2, పాతపల్లి, సూరారం, ఇటిక్యాల లలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. సన్నరకం వడ్లకు మద్దతు ధరతో పాటు 500 రూపాయల అదనపు బోనస్ అందించడం జరుగుతుందని తెలిపారు. వరి ధాన్యం విక్రయించేందుకు కొనుగోలు కేంద్రాలకు వచ్చే రైతులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా త్రాగునీరు, నీడ, ఓ.ఆర్.ఎస్. సౌకర్యాలు కల్పించడం జరుగుతుందని తెలిపారు. ఈ క్రమంలో రైతుల వద్ద నుండి కొనుగోలు చేసిన ధాన్యాన్ని కేటాయించిన ప్రకారంగా రైస్ మిల్లులకు తరలించడం జరుగుతుందని తెలిపారు. కొనుగోలు కేంద్రాలలో ధాన్యం విక్రయించిన రైతులకు రశీదు జారీ చేయాలని, రైతులు, ధాన్యం వివరాలను ట్యాబ్లో నమోదు చేసి సంబంధిత రైతుల ఖాతాలలో నగదు జమ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. రైతు ఆటోమెటిక్ యంత్రంతో శుభ్రం చేసి కొనుగోలు కేంద్రాల వద్దకు నిబంధనల ప్రకారం ధాన్యం తీసుకురావాలని, అకాల వర్షాల సమయంలో కేంద్రాలలో అందుబాటులో ఉన్న టార్పాలిన్లను వినియోగించుకోవాలని తెలిపారు.

# ప్రపంచ గతిని శాసించే స్థాయిలో కృత్రిమ మేధస్సు

**ప్రాంగణ నియామకాల్లో 16 మంది యస్.బిఐటి విద్యార్థుల ఎంపిక**

**ఖమ్మం (జనంసాక్షి)**



ప్రముఖ ఐ.టి. రంగ సంస్థ జెన్టీ ల్యాబ్స్, స్మార్ట్ బ్రైన్స్ కు తమ కళాశాలకు చెందిన 16 మంది విద్యార్థులు ఎంపికైనట్లు కళాశాల ఛైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. గత వారం నిర్వహించిన ప్రాంగణ నియామకాలకుగాను శనివారం ఆఫర్ లెటర్స్ అందుకున్న సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తూ.. కృత్రిమ మేధస్సు ప్రపంచ గతిని శాసించే స్థాయిలో ఉందని, ఐ.టి. రంగ నిపుణులకు మంచి ఆదరణ ఉందని అభిప్రాయపడ్డారు. ఎంపికైన విద్యార్థులు నిరంతరం నైపుణ్యాభివృద్ధి చెందాలని సూచించారు. అమెరికా కేంద్రంగా నిర్వహించబడుతున్న జెన్ ల్యాబ్స్ లో తమ విద్యార్థులు ఎంపిక అవ్వడం, హెచ్. సిఎల్, కోఫోర్జ్ వంటి క్లైంట్స్ కలిగిన స్మార్ట్ బ్రైన్స్ లో ఉద్యోగాలు సాధించడం తమకు గర్వ కారణమని కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డా. జి.ధాత్రి తెలిపారు. ఇంటర్న్ ఇంజనీర్, డిసి ఆపరేషన్స్, సర్వీస్ డెస్క్ ఇంజనీర్ ఉద్యోగాలకు గాను నిర్వహించిన వివిధ దశల ఎంపికలలో జెన్ ల్యాబ్కు గాను 4గురు, స్మార్ట్ బ్రైన్స్ కు 12 మంది ఎంపికైనట్లు తెలియజేశారు. ఉద్యోగాలు సాధించిన విద్యార్థులకు శిక్షణ అనంతరం 22 నుండి 3.6 లక్షలు వార్షిక ఆధాయంగా లభిస్తుందని తెలిపారు. క్వాల్కామ్ వంటి అంతర్జాతీయ సంస్థలకు క్లైంట్గా ఉన్న జెన్రా ల్యాబ్స్ కు తమ కళాశాల విద్యార్థులను ఎంపిక చేయడం అటానమస్ గా తమకు తగిన గుర్తింపును తెచ్చినట్లు కళాశాల ప్రిన్సిపల్ డా.జి.రాజ్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపికలు నిర్వహించిన జెన్ ల్యాబ్స్ హెచ్.ఆర్. పి. నరేంద్ర తో పాటు కళాశాల అకడమిక్ డైరెక్టర్స్ గుండాల ప్రవీణ్ కుమార్, గంధం శ్రీనివాసరావు, డా.ఎ.వి.వి. శివ ప్రసాద్, డా.జె రవీంద్రబాబు, డా.యన్. శ్రీనివాసరావు, టి.పి.ఒ. యన్. సవిత, కోఆర్డినేటర్ జి. ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# సీఎం వ్యాఖ్యలను ఖండించిన ఉద్యోగులు

**హైదరాబాద్, మే 10 (జనంసాక్షి)**



సుదీర్ఘ కాలం తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో క్రియాశీలక పాత్ర పోషించిన, ఉద్యోగుల ఉపాధ్యాయుల సమస్యలపై పోరాడి అనేక పోరాటాలు నడిపి వివిధ ప్రభుత్వాలలో హక్కులు సాధించడంలో ముందువరసలో నిలబడి ప్రయోజనాలను చేకూర్చిన రాష్ట్ర స్థాయి పూర్వ నాయకులందరూ సమావేశమై ఇటీవల సీఎం ఉద్యోగుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే విధంగా వ్యాఖ్యానించడాన్ని తీవ్రంగా ఖండించారు. దశాబ్దాల కాలంగా తెలంగాణ సమస్యలపై కలిసి ఉద్యమించిన ప్రజలను ఉద్యోగులను విడదీసే విధంగా కుట్ర పూరిత వ్యాఖ్యలు చేయడం దుర్మార్గం. సీఎం వ్యాఖ్యల పట్ల తెలంగాణ సమాజం ఆవేదన చెందుతున్న సందర్భంలో తమ సామజిక బాధ్యతగా గుర్తించిన అన్ని ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్ సంఘాల పూర్వ నాయకులు ఈ రోజు సమావేశమై తమ సమస్యల పరిష్కార నిమిత్తం చేపట్టబోయే ఐక్య కార్యాచరణ కోసమై అన్ని సంఘాలను సమన్వయం చేయడానికి తాము ఒక సమన్వయ కమిటీ గా ఏర్పడాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో మాజీ మంత్రి వి.శ్రీనివాస్ గౌడ్, పాతూరి సుధాకర్ రెడ్డి మాజీ ఎమ్మెల్సీ, జి. దేవీప్రసాద్ రావు మాజీ ఎంప్లాయిస్ చైర్మన్, కారం రవీందర్ రెడ్డి మాజీ టీఎన్జీవో అధ్యక్షులు, సి.విఠల్ ఉద్యోగుల సంఘం పూర్వ రాష్ట్ర అధ్యక్షులు, మామిళ్ళ రాజేందర్ టీఎన్జీవో పూర్వ రాష్ట్ర అధ్యక్షులు, బి.భుజంగరావు ఎస్టీయూ టీఎస్ పూర్వ అధ్యక్షులు, ఎంఏ హమీద్ టీఎన్జీవో పూర్వ రాష్ట్ర ప్రధానకార్యదర్శి, ఏ.పద్మాచారి పూర్వ అధ్యక్షులు తెలంగాణ ఉద్యోగుల సంఘం, ఇంజమూరి రఘునందన్ టీటీఎఫ్ పూర్వ రాష్ట్ర అధ్యక్షులు, మఠం శివశంకర్ రెవిన్యూ సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షులు, సుమిత్రానంద్ తానోబా పూర్వ టీఎస్పీఎస్సీ సభ్యులు, ఏ లక్ష్మణ్ ఎస్టీయూ టీఎస్ పూర్వ అధ్యక్షులు, ఎల్ శ్రీనివాస్ రెడ్డి, కూరపాటి రంగరాజు, ఎం.శ్యామ్ రావు, వై.నర్సయ్యగౌడ్ పాలిటెక్నిక్ అసోసియేషన్ పూర్వ అధ్యక్షులు, గోవిందం వేణుగోపాలస్వామి పూర్వ అధ్యక్షులు టీపీటీయూ, గుండం మోహన్ రెడ్డి పూర్వ అధ్యక్షులు టీజీహెచ్ఎంఏ, మోహన్ రావు ఎంపీడీవోల రాష్ట్ర అధ్యక్షులు, ఆదినారాయణ రెడ్డి ఫారెస్ట్ ఉద్యోగుల ఫోరమ్, విష్ణువర్ధన్ రిజిస్ట్రేషన్ శాఖ, హాసన్ రాష్ట్ర టీఎన్జీవో ఉపాధ్యక్షులు పాల్గొన్నారు.

# స్థానికుల వాహనాలకు రవాణా సౌకర్యం ఎలా?

**కాళేశ్వరం, మే 10 (జనంసాక్షి) :** భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వరంలో మే 15 నుండి 26 వరకు జరగనున్న సరస్వతీ పుష్కరాల నేపథ్యంలో పోలీసులు భద్రత కట్టుదిట్టం చేసి, భక్తుల వాహనాల రాకపోకలకు రూట్ మ్యాప్ సిద్ధం చేశారు. భక్తుల రద్దీ ఎక్కువగా ఉండే అవకాశం ఉండడంతో పోలీసులు భక్తుల వాహనాలను లోపలికి అనుమతించకుండా పార్కింగ్ స్థలాలను సిద్ధం చేస్తున్నారు. పోలీసులు వాహనాలను లోపలికి అనుమతించకుంటే స్థానికులు తమ వాహనాలను తీసుకొని బయట ఊర్లకు వెళ్లి రావాలంటే కష్టతరంగా మారే అవకాశం ఉంది. దీనితో ప్రజలు ఈ విషయాలను ఎవరిని అడిగి తెలుసుకోవాలని తెలియక తికమకపడుతున్నారు. ఇప్పటికైనా పోలీసు అధికారులు గ్రామ ప్రజల వాహనాలకు పాసులు ఇస్తారా లేక స్థానికుల ఆధార్ కార్డులతో వాహనాలను అనుమతిస్తారా అనేది ప్రజలకు తెలియ చెప్పాలని కోరుతున్నారు.

# భూములు కోల్పోయిన రైతులకు పరిహారం అందించాలి

**వరంగల్ కలెక్టర్ సత్య శారదా దేవి**

**వరంగల్ ప్రతినిధి, మే 10 (జనంసాక్షి) :**



ఇన్నర్ రింగ్ రోడ్డు నిర్మాణానికి భూములు అందజేసిన రైతులకు వెంటనే పరిహారం చెల్లించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా కలెక్టరేట్లో కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి, వైస్ చైర్మన్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడేలతో కలసి ఇన్నర్ రింగ్ రోడ్ ఏర్పాటలో భూముల అందజేసిన రైతులకు నష్టపరిహారం చెల్లింపు పురోగతి, దామెర చెరువు సుందరీకరణ, పైడిపల్లిలో స్పోర్ట్ సిటీ ఏర్పాటు, నర్సంపేట ప్రభుత్వ ఆసుపత్రిలో డయాలసిస్ సెంటర్ అభివృద్ధి తదితర అంశాలపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ వరంగల్లోని నాయుడు పెట్రోల్ పంప్ నుండి ఏనుమాముల మార్కెట్ వరకు వయా తిమ్మాపూర్ 13 కిలోమీటర్ల మేర నిర్మించనున్న ఇన్నర్ రింగ్ రోడ్డుకు సంబంధించి రైతులు అందించిన భూములకు ఇంకను పెండింగ్ లో ఉన్న పరిహారాన్ని ఖిలా వరంగల్, ఉర్స్, ఏనుమాముల ప్రాంత రైతులకు వెంటనే చెల్లించాలని అధికారులను ఆదేశించారు. కుడా ఆధ్వర్యంలో దామెర చెరువును సుందరీకరణ, అభివృద్ధి చేయనున్న దృష్ట్యా చెరువు ను ఇరిగేషన్ శాఖ నుండి కుడాకు బదలాయింపుకు చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. పైడిపల్లిలో వాటర్ స్పోర్ట్స్ ఏర్పాటు చేయుటకు ప్రభుత్వ స్థలాన్ని కేటాయించుటకు చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. నర్సంపేట ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్వహిస్తున్న డయాలసిస్ సెంటర్ ను మరింత అభివృద్ధి చేయుటకుగాను ప్రతిపాదనలు సమర్పించాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ ను కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి కూడా పిఓ అజిత్ రెడ్డి, ఈఈ భీంరావు, ఆర్డీవో సత్యపాల్ రెడ్డి, జిల్లా ఇరిగేషన్ అధికారి శంకర్, ఆసుపత్రి పర్యవేక్షకులు మోహన్ దాస్, తహశీల్దార్లు, సంబందిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నెరవేరనున్న రైతుల దశాబ్దాల కళ..!

**పాకాల వాగుపై చెక్ డ్యామ్, వంతెన, రోడ్డు నిర్మాణ పనులు**

**రూ. 15 కోట్లు మంజూరు.. త్వరలో ప్రారంభం కానున్న పనులు**

**చెన్నారావుపేట, మే 10 (జనం సాక్షి):**



రైతుల దశాబ్దాల కళ ఎట్టకేలకు నెరవేర నుంది. చెన్నారావుపేట గ్రామ శివారులోని పాకాల వాగు పై చెక్ డ్యామ్, వంతెన, రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. తెలంగాణ ప్రభుత్వం ఈ పనులు చేపట్టడానికి సుమారు రూ.15 కోట్లను మంజూరు చేసింది. ఈ పనులను మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం మదనాపురం గ్రామానికి చెందిన ఏ వన్ కాంట్రాక్టర్ సుధీర్ రెడ్డి టెండర్ లో దక్కించుకున్నారు. శనివారం పాకాల వాగు పరిసరాలను ఇటాచి సహాయంతో శుభ్రం చేయించారు. కొద్ది రోజుల్లోనే ఈ పనులను అధికారికంగా శంకుస్థాపన చేసి ప్రారంభించనున్నారు. పాకాల వాగు దాటి తమ వ్యవసాయ భూముల వద్దకు వెళ్లాలంటే చెన్నారావుపేట, పాత ముగ్ధుంపురం, ఈర్య తండా, అక్కల్ చెడ, జోజిపేట నారాయణ తండా, ఖాదర్ పేట, ఖానాపురం మండలం రంగాపురం, కొత్తూరు తదితర గ్రామాలకు చెందిన రైతులు వాగు దాటి వెళ్లాలంటే అనేక ఇబ్బందులను ఎదుర్కొనేవారు. వర్షాకాలంలో ఈ వాగు దాటుకుంటూ వెళ్లిన రైతులు, గీతా కార్మికులు, కూలీలు కొట్టుకుపోయి చనిపోయిన సంఘటనలు సైతం ఉన్నాయి. పాకాల వాగు పై వంతెన నిర్మించాలని రైతులు, గ్రామస్తులు అనేక పోరాటాలను సైతం చేపట్టారు.పాకాల వాగు వద్ద చెక్ డ్యామ్, వంతెన, రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయన్న విషయం తెలియ దంతో చుట్టుపక్కల గ్రామాల రైతులు, గ్రామస్తులు, పలువురు ఆనందం వ్యక్తం చేశారు.

# ఉపాధి హామీ పనులు చేస్తూనే దేశభక్తి

**సారంగాపూర్ మే 10 (జనంసాక్షి)**



: మండల కేంద్రంలోని రామ్ సింగ్ తండావాసులు ఒకటై పని కన్నా దేశ రక్షణ ముందు అని ఉపాధి హామీ కూలీలు చాటారు. అందరూ ఒక్కటై ఉపాధి హామీ పనుల అనంతరం ఇండియా పాకిస్తాన్ ల మధ్య జరుగుతున్న యుద్ధంలో అమరుడైన బంజారా ముద్దు బిడ్డ మురళి నాయక్ కి శ్రదంజలి ఘటిస్తూ ఇదే మా సలాం అంటూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. యుద్ధంలో అమరులైన సైనికుల కుటుంబానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అండగా ఉండాలని కోరారు. జోహార్ జోహార్.. మురళి నాయక్ జోహార్.. దేశాన్ని నీ ప్రాణంతో రక్షించే సైనికుడా, అలుపెరగని పోరాటం చేసిన ధీరుడా, శత్రువుల ధాటికి పెన్నుచూపని వీరుడా.. మా కోసం ప్రాణాలొదిలిన భరత మాత పుత్రుడా.. ఏమిచ్చి తీర్చగలం నీ రుణం.. మీ నుదిటిన వీరతిలకం దిద్దిన నిన్ను కన్న తల్లికి యావత్ భారతావని చేస్తుంది సలాం.. నీకు ఇదే మా సలాం భారత్ మాతాకీ జై.. మా బంజారా ముద్దు బిడ్డ అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో రాజశేఖర్ ఉపాధి హామీ మెట్ , సచిన్ జాదవ్ ,యువరాజ్, కుమార్ అభిలాష్, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

# నాంచారమ్మ జాతరకు సర్వం సిద్ధం

**కాకతీయుల కాలంలో నిర్మించబడిన పంచకూటాలయం**

**పునర్నిర్మాణం పేర ఆలయాన్ని విప్పి కుప్పపెట్టిన పురావస్తు శాఖ**

**నాలుగు రాష్ట్రాల నుంచి తరలిరానున్న ఎరుకల కులస్తులు**

**ములుగు/వెంకటాపూర్, మే10 (జనంసాక్షి) :**



ప్రతి సంవత్సరం వైశాఖ శుద్ధ పౌర్ణమికి వైభవంగా నిర్వహించబడే ఎరుకల నాంచారమ్మ జాతర కు సర్వం సిద్ధమైంది. మే 12 నుంచి వారం రోజుల పాటు జాతరను నిర్వహించేందుకు ఎరుకల కులస్తులు ఏర్పాట్లు చేశారు.తెలుగుజాతిని ఏకం చేసి పరిపాలించిన కాకతీయుల కాలంలో రామప్ప దేవాలయం తో పాటు ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం రామానుజాపూర్ గ్రామ సమీపంలోని పంట పొలాల్లో 800 సంవత్సరాల క్రితం ఎరుకల నాంచారమ్మ (పంచకూటాలయం) దేవాలయం నిర్మించబడింది. అరుదైన నల్లసేనపురాయితో చెక్కబడిన ఐదు శివలింగాలను ఇతర అద్భుతమైన శిల్పాలను పునర్నిర్మాణం పేరుతో పురావస్తు శాఖ అధికారులు రామానుజపూర్ గ్రామ సమీపానికి తరలించారు. తర్వాత కాలంలో పట్టించుకోకపోవడంతో భవిష్యత్ తరాలకు అందించాల్సిన అరుదైన శిల్ప సంపద కాలగర్భంలో కలిసిపోతుందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**2018 నుంచి జాతర నిర్వహణ**

ఎరుకల నాంచారమ్మ దేవాలయంగా పిలుచుకునే పంచకూటాలయాన్ని పంట పొలాల మధ్య ఉండడంతో ఎవరూ పట్టించుకోలేదు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఎరుకల కులస్తులను ఏకం చేసిన తెలంగాణ ఆదివాసి ఎరుకల సంఘం అధ్యక్షుడు లోకిని రాజు 2018 ఏప్రిల్ 29న మొదటిసారి నాంచారమ్మ జాతరను నిర్వహించారు. అన్ని శాఖల అధికారులను సమన్వయం చేస్తూ వారి సహకారంతో జాతరకు ప్రతి ఏడాది కావలసిన సౌకర్యాలను మెరుగుపరుస్తూ భక్తులకు ఇబ్బందులు కలగకుండా జాతర నిర్వహిస్తున్నారు. తక్కువ జనాభా కలిగిన ఎరుకల కులస్తులు తమ ఆరాధ్య దైవం దర్శనం కోసం ప్రతి సంవత్సరం రామానుజాపూర్ తరలివస్తున్నారు.

**నాలుగు రాష్ట్రాల నుంచి..**

వైవిధ్యమైన జీవన విధానం కలిగిన ఎరుకల కులస్తులు జాతరలో సందడి చేస్తారు. తెలంగాణ రాష్ట్రంతో పాటు ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, చత్తీస్గడ్ రాష్ట్రాల నుంచి సైతం నాంచారమ్మకు మొక్కులు చెల్లించుకునేం దుకు ప్రతి ఏడాది ఎరుకల కులస్తులు తరలివస్తున్నారు. మొదటి రోజు జాతరలో వెంకటాపూర్ మండలంలోని లక్ష్మీదేవి పేట గ్రామం నుంచి డప్పు చప్పుల్లు, నాంచారమ్మ, ఏకలవ్యుని వేషధారణలతో రామానుజాపూర్ వరకు తరలివస్తారు. అక్కడ నుంచి శివసత్తుల పూనకాలు, భక్తుల సందడి మధ్య నాంచారమ్మ జాతర వరకు తరలి వెళ్తారు. ఎరుకల కులస్తులు ఆచారాల ప్రకారం నాంచారమ్మకు బోనంతో మొక్కులు చెల్లించుకుంటారు. తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలు ఉట్టిపడేలా జాతరను నిర్వహిస్తుండగా కుర్రో కుర్రు.. అంటూ సోది(భవిష్యత్) చెప్పేందుకు ఎరుకల యువతులు, మహిళలు, వృద్ధులు నాంచారమ్మ వేషధారణలతో సందడి చేస్తారు. లిపిలేని వీరి భాష ప్రత్యేకంగా ఉంటుంది. రామానుజాపూర్ గ్రామము నుంచి రెండు కిలోమీటర్ల దూరం వరకు భక్తులతో కలిసి సందడిగా తరలి వెళ్తారు. వారం రోజుల పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు నాంచారమ్మకు మొక్కులు చెల్లిస్తారు తిరుగువారం ఎరుకల కులస్తులు ప్రత్యేకమైన మొక్కులు చెల్లించడంతో జాతర ముగుస్తుంది.



**నాంచారమ్మ విగ్రహ ప్రతిష్టకు ఏర్పాట్లు**

పునర్నిర్మాణం పేరుతో విగ్రహాలన్నీ తరలిపోవడంతో ఇప్పటివరకు ప్రతి ఏడాది అక్కడే ఉన్న ప్రత్యేకమైన శిలను నాంచారమ్మగా భావించి భక్తులు తమ మొక్కులు చెల్లించుకున్నారు. తెలంగాణ ఆదివాసి ఎరుకల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, నాంచారమ్మ ఉత్సవ కమిటీ చైర్మన్ లోకిని రాజు ఆధ్వర్యంలో నాంచారమ్మ విగ్రహాన్ని ప్రత్యేకంగా తయారు చేయించి విగ్రహ ప్రతిష్టాపన చేసేందుకు కావలసిన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ నెల 12న వేద పండితుల సమక్షంలో జాతరతో పాటు నాంచారమ్మ విగ్రహ ప్రతిష్టను వైభవంగా నిర్వహించేందుకు కావలసిన ఏర్పాట్లు పూర్తి చేశామని ప్రతి ఒక్కరు సహకరించి జాతరను విజయవంతం చేయాలని లోకిని రాజు కోరారు.

# భార్యను హతమార్చిన భర్త

**ఆర్మూర్, మే 10 ( జనం సాక్షి):**



ఆర్మూర్ పట్టణంలోని తిరుమల కాలనీలో భార్యను భర్త హతమార్చిన ఘటన శనివారం తెల్లవారు జామున చోటు చేసుకుంది.సీఐ సత్యనారాయణ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. భార్య ఆకుల లలిత (28)పై అనుమానంతో భర్త ఆకుల ప్రవీణ్ (33) మధ్య గొడవ జరిగి బెడ్ షీట్ తో ముఖంపై ఊపిరాడకుండా చేసి భార్యను హతమార్చాడు.పోలీసులు కేసును నమోదు చేసి దర్యాప్తును ముమ్మరం చేశారు.ఈ ఘటనకు ఆర్థిక ఇబ్బందులు కారణమా.. వివాహేతర సంబంధం ఉందా అనే అనుమానాలు జనాలు వ్యక్తం చేస్తున్నారు.

# మిస్‌వరల్డ్ పోటీలు వాయిదా వేయలేం

- ప్రతిష్టను దెబ్బ తీయాలని కవిత చూస్తోంది
- ఎంపీ చామల



**హైదరాబాద్, మే 10 (జనం సాక్షి) :** మిస్ వరల్డ్ కాంపిటీషన్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత చేసిన కామెంట్స్ పై భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి స్పందించారు. ఈ మేరకు శనివారం ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రతిష్టను ఎమ్మెల్సీ కవిత దెబ్బ తీయాలని చూస్తున్నారని ఆరోపించారు. ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రతి అంశాన్ని రాజకీయం చేయాలని చూస్తున్నారని అన్నారు. రాజకీయంలో ఉన్నాం కదా అని ఏదో ఒకటి మాట్లాడాలి అన్నా ఆలోచన ఆమెదన్నారు. మిస్‌వరల్డ్ కాంపిటీషన్‌లను పోస్ట్ ఫోన్ చేయడం లేదా రద్దు చేయడం లాంటి కార్యక్రమాలు తెలంగాణ ప్రభుత్వానికి చేసే అధికారం లేదని స్పష్టం చేశారు. తెలంగాణ ప్రభుత్వం కేవలం ఒక ఫెలిసేటేటర్ మాత్రమేనని అన్నారు. తెలంగాణ రాష్ట్రం నేడు చాలా సేఫెస్ట్ ప్లేస్ అని.. తెలంగాణలో పెట్టుబడులు పెట్టొచ్చని.. తెలంగాణలో ఇంత పెద్ద ఈవెంట్లు ప్రపంచవ్యాప్తంగా చూసే ఈవెంట్లను చేయవచ్చని.. ఒక 4, 5 నెలల క్రితం ఈ ప్లేస్ తెలంగాణను సెలెక్ట్ చేశారని తెలిపారు. తెలంగాణ మీద నమ్మకంతో ఇక్కడ ఈవెంట్ పెట్టుకున్నారని అన్నారు. ఈ రోజు మిస్ వరల్డ్ లిమిటెడ్ అనే కంపెనీ ఇక్కడ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని పేర్కొన్నారు. ఆ కంపెనీ ఏదైనా నిర్ణయం తీసుకొని పోస్ట్ ఫోన్ చేయాలనుకుంటే డెఫినెట్‌గా తెలంగాణ ప్రభుత్వం వారికి సహకరిస్తదని, వాళు పోటీలు నిర్వహించాలి అని అనుకున్నప్పుడు మనం వాటిని పోస్ట్ పోన్ చేయలేమని స్పష్టం చేశారు. 105 దేశాల నుంచి మిస్ వరల్డ్, మిస్ కంట్రీస్ వచ్చి ఇక్కడ మిస్ వరల్డ్ కాంపిటీషన్‌లో పాల్గొంటున్నారని పేర్కొన్నారు. అలాగే వాళ్లతో పాటు వాళ్ళ కుటుంబ సభ్యులు మొత్తం కలిపి ఒక మూడు నుంచి నాలుగు వందల మంది డెలిగేట్స్ తెలంగాణలో ఉన్నారని చెప్పారు. వీళ్లతో పాటు ఈ ఇవెంట్ నడిపించే స్పాన్సర్షిప్ చాలామంది ఇక్కడే ఉన్నారని, వాళ్ళు తీసుకోవాల్సిన నిర్ణయం అది అని చెప్పుకొచ్చారు. కవిత ఒక తెలంగాణ నాయకురాలుగా ఉండి ఆమె ఒక రాజకీయ నాయకురాలిగానే కాకుండా ఇంతో అంతో ఇంకితజ్ఞానం ఉండి అమెరికాలో కూడా చదువుకొని వచ్చింది.. కాబట్టి ఇటువంటి పరిస్థితుల్లో ప్రభుత్వం పరిధి ఏంటి అనేది ఆమెకి అర్థం అయి ఉండాలన్నారు. కానీ రాజకీయం చేయాలనే దురుద్దేశం నుంచి దూరంగా ఉండి వాస్తవాలు మాట్లాడాలని ఎంపీ చామల కోరారు.

# పాలిసెట్ నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు

- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, మే 10 (జనంసాక్షి) :** ఈ నెల 13 నుండి పాలిసెట్ పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. పాలిసెట్ నిర్వహణపై ఆయా శాఖల అధికారులతో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ పాలిటెక్నిక్ డిప్లమా కోర్సుల్లో ప్రవేశానికి విద్యార్థులకు జిల్లాలో ఈ నెల 13 న ఉదయం 11 నుంచి 1.30 వరకు టీజీ పాలిసెట్ సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు.

### ఏడు కేంద్రాలు..2136 మంది విద్యార్థులు...

జిల్లాలో మొత్తం 2136 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారని, వీరి కోసం 7 పరీక్ష కేంద్రాలను సిద్ధం చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ప్రతి కేంద్రంలో సీసీ కెమెరా తప్పనిసరిగా ఉండాలని, విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా అవసరమైన బస్సులను నడపాలని ఆర్టీసీ అధికారులకు సూచించారు. ప్రశ్నా పత్రాల తరలింపు అవసరమైన బందోబస్తు కల్పించాలని, కేంద్రాల వద్ద 144 సెక్షన్ ఏర్పాటు చేయాలని పోలీసులను కలెక్టర్ ఆదేశించారు.పరీక్షా సమయంలో పరీక్ష కేంద్రాల వద్ద కరెంట్ కోతలు ఉండవద్దని,ఫస్ట్ ఎయిడ్ కిట్, ఓఆర్ఎస్ ప్యాకెట్లతో మెడికల్ క్యాంపు ఏర్పాటు చేయాలని సెస్, వైద్య అధికారులకు సూచించారు.ఈ సమావేశంలో అదనపు ఎస్పీ చంద్రయ్య,సిరిసిల్ల రెవెన్యూ డివిజన్ అధికారి వెంకటేశ్వర్లు, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రభాకరాచారి,జిల్లా వైద్యాధికారి డా.రజిత, సిరిసిల్ల తహసీల్దార్ మహేష్, సెస్,ఆర్టిసి, మున్సిపల్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## అర్హులైన సర్వేయర్లకు శిక్షణ

**కలెక్టర్ ఇలా త్రిపాఠి**



**నల్గొండ బ్యూరో, మే 10 (జనం సాక్షి) :** భూ భారతి చట్టం-2025 అమలులో భాగంగా అర్హులైన సర్వేయర్ల కు శిక్షణ ఇచ్చేందుకుగాను దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన అభ్యర్థులు సర్వేయర్ల శిక్షణ కోసం ఈ నెల 17 లోగా సమీపంలోని మీ సేవా కేంద్రాలలో దరఖాస్తు చేసుకోవాలని ఒక ప్రకటనలో కోరారు.ఎంపికైన సర్వేయర్లకు ఈనెల 26 నుండి జూలై 26 వరకు (50 పని దినాలు) శిక్షణ ఇవ్వనున్నట్లు కలెక్టర్ వెల్లడించారు.రెవెన్యూ పరిపాలన కు తోడుగా,సర్వే మరియు ల్యాండ్ రికార్డ్స్ శాఖ ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 5,000 మంది సర్వేయర్లకు శిక్షణ ఇవ్వాలని ప్రభుత్వం ఆలోచిస్తున్నట్లు తెలిపారు.జిల్లా స్థాయిలో శిక్షణ ఇచ్చి సర్వేయర్లను నియమించనున్నట్లు వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన భూ భారతి (భూమి హక్కుల రికార్డు చట్టం- 2025) ద్వారా భూమి సంబంధిత సేవలను ప్రజలకు కల్పించి వారి భూ సమస్యలను పరిష్కరించే ఉద్దేశంతో లైసెన్సుడ్ సర్వేయర్లను నియమించనున్నట్లు కలెక్టర్ వెల్లడించారు.అందువల్ల జిల్లాలోని సర్వేయర్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ,ఈనెల 17 లోగా దరఖాస్తు చేసుకోవాలని ఆమె కోరారు.

# సామాజిక సేవకు గుర్తింపు..

- డాక్టరేట్ రావడం బాధ్యత పెరిగింది
- హెచ్‌ఆర్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లలితశ్రీ



**గోదావరిఖని, మే 10 (జనంసాక్షి) :** హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ స్టేట్ జనరల్ సెక్రటరీ చిప్ప లలిత శ్రీ చేస్తున్న సామాజిక సేవలు గుర్తించి మనం ఫౌండేషన్ సహకారంతో గుడ్ సమ్మెటరేటన్ గ్లోబల్ పీస్ అకాడమీ తీయాలికల్ చికాగో,సౌత్ ఆఫ్రికాలోపనిచేస్తున్న సంస్థ గుర్తించి గౌరవ డాక్టరేట్ తో లలిత శ్రీ కి ప్రధానం చేయనున్నారు.అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం విజయవాడలో జరిగే సభలో లలిత శ్రీ కి అవార్డు ప్రధానం చేయనున్నారు. హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా గత నాలుగు సంవత్సరాలుగా కొనసాగుతూ లలిత శ్రీ మహిళలకు,విద్యార్థి విద్యార్థినీలకు,ఉపాధి హామీ కూలీలకు చట్టాలపై అవగాహన కల్పిస్తూ న్యాయవాదుల సహకారంతో గ్రామస్థాయి నుండి పట్టణస్థాయి వరకు గురుకుల, ఆశ్రమ పాఠశాలలో మహిళా కార్మిక విద్యార్థి చట్టాలపై అవగాహన కల్పించి వారిలో చైతన్యాన్ని తీసుకువచ్చారు. కరోనా సమయంలో పేదలకు, నిరాశ్రయులకు నిత్యవసర సరుకులు, అన్నదాన కార్యక్రమాలు చేస్తూ సామాజిక సేవకురాలుగా గుర్తింపు పొందారు. నేషనల్ హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ ఉమెన్ వింగ్ ప్రెసిడెంట్ గా తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో చట్టాలపై అవగాహన కు సహకారం అందిస్తున్నందుకు మనం ఫౌండేషన్ గుర్తించి గుడ్ సమీరిటన్ చికాగో,సౌత్ ఆఫ్రికా సంస్థ గుర్తించి ఇచ్చిన ఈ గౌరవ డాక్టరేట్ తన బాధ్యతను మరింత పెంచిందని లలిత శ్రీ అభిప్రాయం వ్యక్తం చేశారు.తనకు సహకారం అందించి ప్రోత్సహించిన హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ నేషనల్ ప్రెసిడెంట్ డాక్టర్ బోయపాటి దాసు కు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.లలిత శ్రీ కి గౌరవ డాక్టరేట్ లభించడం పట్ల పలువురు వైద్యులు, ప్రముఖులు కృతజ్ఞతలు తెలుపుతూ హర్షం వ్యక్తం చేశారు.

## విద్యుత్ షాక్‌తో తల్లికుమార్తె దుర్మరణం



**కామారెడ్డి, మే 10 (జనంసాక్షి) :** కామారెడ్డి జిల్లా జుక్కల్ మండలంలోని గుల్లతాండలో విషాదం నెలకొంది.శనివారం తెల్లవారుజామున విద్యుత్ షాక్‌తో తల్లికూతురు మృతి చెందారు. స్థానికుల కథనం ప్రకారం గుల్లతాండకు చెందిన చవాన్ శంకబాయి(36) కూతురు చవాన్ శివాణి ఇంట్లో నిద్రపోతున్న క్రమంలో ఎండ వేడిమి నివారణ కోసం కూలర్ పెట్టుకోగా ప్రమాదవశాత్తు చవాన్ శివాణి ఎడమ కాలు కూలర్ కోసం ఏర్పాటుచేసిన నీటిలో పడగా ప్రమాదవశాత్తు ఆ నీటిలో విద్యుత్ ప్రవహించి కాలు పాక్షికంగా కాలిపోవటమే కాకుండా ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. కూతురు పక్క నిద్రపోతున్న తల్లి కి కూడా కూతురు ద్వారా విద్యుత్ ప్రవహించి ఆమె కూడా మృతి చెందింది. కొడుకు ప్రతీక్ బయట పండుకోవడంతో తెల్లవారుజామున ఇంట్లోకి వెళ్లి చూడగా తల్లి చెల్లెలు మృత్యువాత పడటంతో ఇట్టి విషయాన్ని తాండవాసులకు తెలపడంతో వారు విద్యుత్తును నిలుపుదల చేయించారు.కుటుంబ యజమాని అయిన ప్రహ్లాద్ చవాన్ డ్రైవర్ గా ఉండటంతో ఆయన ఇతర ప్రాంతాలకి వెళ్లినట్టు వారు తెలిపారు. ప్రహ్లాద్ చవాన్ కు భార్య ఇద్దరు కూతురు,ఒక కొడుకు ఉండగా భార్య చిన్న కూతురు మృత్యువాత పడటం మరో కూతురు బంధువుల వద్దకు పోవడంతో ప్రాణం దక్కిందని,తాండవాసులు తెలిపారు.పోలీసులకు సమాచారం అందించడంతో జుక్కల్ పోలీసులతోపాటు బిచ్కుంద సీఐ నరేష్ సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు.

## పెరిగిన సిమెంట్ ధరలు



**హైదరాబాద్, మే 10 (జనం సాక్షి) :** సిమెంట్ ధరల పెరుగుదల ప్రభావం ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులపై పడనుంది. ఇప్పటికే స్థలం ఉండి ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు పనులు ప్రారంభించగా పెరిగిన సిమెంట్ ధరలపై ఆందోళన చెందుతున్నారు. సిమెంట్ బస్తా ధర దాదాపు రూ.30 నుంచి రూ.50 వరకు పెరిగినట్లు రిటైల్ వ్యాపారులు చెబుతున్నారు. ఒక్కో ఇంటికి ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద రూ.5 లక్షలు ప్రభుత్వం ఇవ్వనుండగా 600 చదరపు అడుగులలోపు ఈ ఇళ్లు నిర్మించుకోవాలి. ఈ క్రమంలోనే ఒక ఇందిరమ్మ ఇంటి నిర్మాణం పూర్తయ్యే వరకు దాదాపు 200లు బస్తాల సిమెంట్ అవసరం ఉంటుంది. లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసిన సమయంలో సిమెంట్ బస్తా ధర రూ.280 నుంచి రూ.330 వరకు ఉంది. తరువాత రూ.30 నుంచి రూ.50 వరకు ధర పెరగడంతో రూ.10వేల వరకు అదనపు భారం పడే అవకాశముంది. ప్రభుత్వం తక్కువ ధరకు సిమెంట్ సరఫరా చేస్తే ఈ ఇబ్బంది ఉండదని లేకుంటే అదనపు భారం తప్పదని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏటా వేసవి ముందు ఇళ్ల నిర్మాణం ప్రారంభించి వర్షాకాలంలోగా పూర్తి చేయడానికి చాలామంది ఏర్పాట్లు చేసుకుంటారు. అలాగే ఈ సంవత్సరం కూడా భారీగా ఇళ్ల నిర్మాణం చేపట్టారు. సిమెంట్ ధరలు పెరగడంతో వారందరిపై భారం పడే అవకాశముంది.

# 22 తులాల బంగారం నగలు స్వాధీనం

- చోరీలకు పాల్పడుతున్న దొంగ అరెస్ట్
- వివరాలు వెల్లడించిన ఎస్పీ శరత్ చంద్ర పవార్




**నల్గొండ బ్యూరో, మే 10 (జనంసాక్షి) :** నల్లగొండ పట్టణంలో గత మూడు నెలలుగా పలు కాలనీలలో తాళాలు వేసిన ఇండ్లను లక్ష్యంగా చేసుకుని వరుస చోరీలకు పాల్పడుతున్న పాలడుగు సురేష్ అనే దొంగను శనివారం అరెస్టు చేసి అతని నుండి 22 లక్షల విలువచేసే 22 తులాల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ శరత్ చంద్ర పవార్ చెప్పారు.శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుడి వివరాలను వెల్లడించారు.నల్లగొండ మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన పాలడుగు సురేష్ చిన్నతనం నుండి దొంగతనాలకు అలవాటు పడి చెడు వ్యసనాలకు బానిసై 4 కేసులలో గతంలో జైలుకు వెళ్లి వచ్చాడని చెప్పారు.జైలు నుంచి వచ్చిన అనంతరం కూడా తన బుద్ధిని మార్చుకోకుండా వరుస చోరీలకు పాల్పడుతున్నాడని ఆయన తెలిపారు. ఈ సంవత్సరం జనవరి నుండి ఏప్రిల్ వరకు నల్లగొండ పట్టణంలో 10 ఇండ్లలో దొంగతనాలకు పాల్పడ్డాడని ఆయన చెప్పారు.నిందితుడు శనివారం నల్లగొండ పట్టణం పాతబస్తీలోని ఒక బంగారు ఆభరణాల దుకాణం దగ్గర అనుమానాస్పదంగా సంచరిస్తుండగా అతన్ని అదుపులోకి విచారించగా నేరాలను అంగీకరించాడని ఆయన తెలిపారు.నిందితుడు నుండి తాళాలను కట్ చేసేందుకు ఉపయోగించే రెండు కటింగ్ మిషన్లు, జత గ్లోవ్స్, సెల్ ఫోనును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ శరత్ చంద్ర పవార్ చెప్పారు.డి.ఎస్.పి శివరాం రెడ్డి పర్యవేక్షణలో వన్ టౌన్ సిఐ రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో నిందితుడిని పట్టుకున్న ఎస్సైలు సైదులు, సందీప్, గోపాల్ రావు,సిబ్బంది వెంకన్న, వెంకట్ నారాయణ,రబ్బాని, లింగారెడ్డి, షకీల్, శ్రీకాంత్, సైదులు ,కృష్ణ,అంజాద్ లను ఎస్పీ పవార్ అభినందించారు.

## మోడీజీ పాకిసాన్‌ని లేపేయండి

**హైదరాబాద్, మే 10 (జనం సాక్షి) :** పాకిస్తాన్ పై మాజీ మంత్రి, గులాబీ పార్టీ ఎమ్మెల్యే మల్లారెడ్డి హాట్ కామెంట్స్ చేశారు. ఇండియాతో పెట్టుకున్న పాకిస్తాన్ ను ప్రపంచ మ్యాప్ నుంచి లేపాయాలని ఈ సందర్భంగా మాజీ మంత్రి మల్లారెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. కుత్బుల్లాపూర్ సూరారంలోని మల్లారెడ్డి విశ్వ విద్యాపీట్ (మల్లారెడ్డి హెల్త్ సిటీ)లో ఆపరేషన్ సిందూర్ లో దేశ సైనికులకు సంఘీభావంగా కార్యక్రమం జరిగింది. ఇందులో మాజీ మంత్రి హరీష్ రావు, వివేకానంద, మల్లారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి, ఎమ్మెల్యే మల్లారెడ్డి మాట్లాడారు. పాకిస్తాన్‌తో ఇప్పటికీ బాధలు పడుతూనే ఉన్నాం... ఉగ్రవాదులను వాళ్లు పోషిస్తున్నారన్నారు. మోడీజీ పాకిస్తాన్‌ని లేపేయండి.. ముక్కలు, ముక్కలు చేసి పాకిస్తాన్‌ని మ్యాప్‌లో లేకుండా చేయండి అంటూ కోరారు. పాకిస్థాన్ ఉగ్రవాదాన్ని పూర్తిగా నాశనం చేయండని డిమాండ్ చేశారు. ఇలాంటి ఉద్రిక్తతల టైంలో.. దేశం కోసం ఎలాంటి త్యాగానికి అయినా సిద్ధంగా ఉండాలని పేర్కొన్నారు. సరిహద్దులో పోరాటం చేయకపోవచ్చు.. కానీ సైనికుల కోసం రక్తదానానికి సిద్ధపడాలని పిలుపునిచ్చారు.

## దేశ పౌరులు అందరూ దేశానికి మద్దతుగా నిలవాలి

- శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి



**నల్లగొండ బ్యూరో, మే 10 (జనం సాక్షి) :** యుద్ధనీతికి విరుద్ధంగా పాకిస్తాన్ వ్యవహరిస్తోందని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు.శనివారం ఆయన నల్లగొండ పట్టణంలోని తన నివాస గృహంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు.పిఓకే ను స్వాధీనం చేసుకుంటే ఇలాంటి ఘటనలు జరగకుండా ఉంటాయని ఆయన చెప్పారు.భారత్ పాక్ లోని ఉగ్ర స్థావరాలపై మాత్రమే దాడులు చేస్తుండగా పాకిస్తాన్ మాత్రం భారతదేశ పౌరులపై బాంబు దాడులు చేస్తోందని ఆయన ఆరోపించారు.పాకిస్తాన్ తో భారత్ వీరోచిత పోరాటం చేస్తుందని భారత్ యుద్ధ నీతిని పాటిస్తూ యుద్ధం చేస్తోందని ఆయన చెప్పారు.వీర జవాన్ మురళి నాయక్ మృతి చాలా బాధాకరమని సుఖేందర్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు.మురళి నాయక్ మృతి కి ఆయన నివాళులర్పించారు.పాకిస్తాన్ భారత్ మధ్య యుద్ధం జరుగుతుంటే ఇలాంటి పరిస్థితుల్లో దేశంలో అందాల పోటీలు నిర్వహించడం అవసరమంటారా అని విలేకరులు అడిగిన ప్రశ్నకు ఆయన తనదైన రీతిలో స్పందించారు.తెలంగాణలో వారి పర్యటన ఎప్పుడో ఖరారు అయిందని వారి పర్యటనతో తెలంగాణ ప్రతిష్ట మరింత పెరగనుందని వ్యాఖ్యానించారు.

### నెలవేతనాన్ని విరాళంగా ప్రకటన

తన నెల రోజుల వేతనాన్ని నేషనల్ డిఫెన్స్ ఫండ్ కు విరాళంగా ఇస్తున్నట్లు శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ప్రకటించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన పిలుపుమేరకు తాను ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన చెప్పారు. సీఎం రేవంత్ రెడ్డి పిలుపు మేరకు శాసనమండలి సభ్యులందరూ నేషనల్ డిఫెన్స్ ఫండ్ కు విరాళంగా ప్రకటించాలని వస్తున్న సుఖేందర్ రెడ్డి పిలుపునిచ్చారు.

# నెల్లికల్ లిఫ్ట్ ఇరిగేషన్ పనులను వేగవంతం చేయాలి

- జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి




**మిర్యాలగూడ. మే 10 (జనం సాక్షి) :** నెల్లికల లిఫ్ట్ ఇరిగేషన్ సంబంధించిన భూ సేకరణ పూర్తయినందున తదుపరి ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. శనివారం నాడు అమె సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఇరిగేషన్ ప్రాజెక్టు పనులపై ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జయవీర్ రెడ్డిలతో కలిసి సమీక్ష నిర్వహించారు.నెల్లికల్ లిఫ్టు ఇరిగేషన్ కు సంబంధించి పిఎన్ పూర్తయినందున బిల్లుల చెల్లింపును తదుపరి ప్రక్రియను వేగవంతం చేయాలని చెప్పారు. నెల్లికల్ లిఫ్ట్ ఇరిగేషన్ కు సంబంధించి భూసేకరణ పేపర్ నోటిఫికేషన్ ఇదివరకే జారీ చేయడం జరిగిందని, ఇందుకు సంబంధించిన చెల్లింపులు చేయాల్సి ఉన్నందున వీటిపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని అన్నారు. అదేవిధంగా విద్యుత్ ఛార్జీలపై సైతం ఈ సమీక్ష సందర్భంగా సమీక్షించి సమస్యను పరిష్కరించేలా చూడాలని ఆదేశాలు జారీ చేశారు. నిడమనూరు చెరువుకు నాగార్జునసాగర్ మెయిన్ కెనాల్ నుండి నీరు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని, ముఖ్యంగా నిడమనూరు ట్యాంకుకు ఓటి ద్వారా నీళ్లు నింపేందుకు ప్రణాళిక రూపొందించాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. మిర్యాలగూడ నియోజకవర్గానికి సంబంధించి దున్నపోతుల గండి,బొత్తలపాలెం,వీర్లపాలెం భూసేకరణతో పాటు, రెండు లిఫ్టులకు ఇది వరకే ఎంజాయ్మెంట్ సర్వే పూర్తయినందున తదుపరి ప్రక్రియపై దృష్టి కేంద్రీకరించాలని ఆమె ఆదేశించారు. అదేవిధంగా మిగిలిన లెఫ్ట్ ఇరిగేషన్ భూసేకరణ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు మాట్లాడుతూ, తమతమ నియోజకవర్గాలలో పెండింగ్లో ఉన్న ఎత్తిపోతల పథకాల పనులను, భూసేకరణ పనులను త్వరితగతిన పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్,ఇరిగేషన్ ఎస్.ఈ మల్లికార్జున్,ఈఈ కరుణాకర్,డిఈ కేశవ్, ఇతర ఇంజనీరింగ్ అధికారులు,రెవిన్యూ అధికారులు,తదితరులు హాజరయ్యారు.

## భూ నిర్వాసితులకు అర్హతల ఆధారంగా సరైన పరిహారం అందించాలి

- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



**మంథని, మే 10 (జనంసాక్షి) :** జాతీయ రహదారి నిర్మాణంలో భూములు కోల్పోతున్న నిర్వాసితులకు అర్హతల ఆధారంగా సరైన పరిహారం అందించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. శనివారం మంథని మండలంలో పుట్టపాక గ్రామంలో భూ నిర్వాసితుల సమావేశంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ.. వరంగల్ మంచిర్యాల గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణానికి భూములు ఇచ్చిన రైతులకు సరైన పరిహారం అర్హతల ఆధారంగా అందాలని అన్నారు. రైతులు అందించిన భూములలో ఉన్న బావులు, మోటార్, పైప్ లైన్, పండ్ల , అటవీ చెట్లు మొదలగు నిర్మాణాలకు పరిహారం సరిగ్గా అందలేదని నిర్వాసితులు దరఖాస్తులు అందించారని కలెక్టర్ తెలిపారు. నిర్వాసితులు అందించిన ప్రతి దరఖాస్తును అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, అర్హతల ఆధారంగా భూ సేకరణ జరిగే భూములలో ఉన్న నిర్మాణాలకు సరైన విలువ చూపిస్తూ ప్రతిపాదనలు తయారు చేసి అందజేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. భూములు కోల్పోతున్న నిర్వాసితులకు భూమిలో ఉన్న ప్రతి నిర్మాణానికి ప్రభుత్వ నిబంధనల ప్రకారం పరిహారం అందజేసేలా చర్యలు తీసుకుంటామని, అధికారులు అందించే నివేదిక ప్రకారం జాతీయ రహదారుల సంస్థకు ప్రతిపాదనలు పంపి నిర్వాసితులకు పరిహారం అందజేస్తామని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ వెంట ఆర్డీవో సురేష్ , జిల్లా అటవీశాఖ అధికారి శివయ్య, ఆర్ అండ్ బి ఈ ఈ భావ్ సింగ్, హార్టికల్చర్ జిల్లా అధికారి జగన్మోహన్ రెడ్డి, తహ సిల్దార్ కుమారస్వామి, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.




## యెస్ బ్యాంక్‌లో జపాన్ సంస్థకు..
# 20% వాటా

**రూ.13,483 కోట్లకు అమ్ముతున్న ఎస్‌బీఐ సహా 8 బ్యాంకులు12 నెలల్లో లావాదేవీ పూర్తయ్యే అవకాశం**

**ఢిల్లీ:** యెస్ బ్యాంక్‌లో తమకున్న వాటాలో 20 శాతాన్ని జపాన్ సంస్థ మిత్సుయి బ్యాంకింగ్ కార్పొరేషన్ (ఎస్‌ఎంబీసీ)కు విక్రయిస్తున్నామని స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ)తో పాటు మరో 7 బ్యాంకులు శుక్రవారం వెల్లడించాయి. ఈ విక్రయ లావాదేవీ విలువ రూ.13,483 కోట్లు. దేశీయ బ్యాంకింగ్ రంగంలో ఇప్పటివరకు ఇదే అతిపెద్ద విదేశీ పెట్టుబడి లావాదేవీ. ఈ విక్రయ లావాదేవీ అనంతరం యెస్ బ్యాంక్‌లో అతిపెద్ద వాటాదారుగా ఎస్‌ఎంబీసీ నిలుస్తుంది. ఈ 20 శాతంలో 13.19% వాటాను రూ.8,889 కోట్లకు ఎస్‌బీఐ విక్రయిస్తోంది. మిగిలిన 6.81% వాటాను 7 బ్యాంకులు– యాక్సిస్ బ్యాంక్, బంధన్ బ్యాంక్, ఫెడరల్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్,




ఐసీఐసీఐ బ్యాంక్, ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్, కోటక్ మహీంద్రా బ్యాంక్‌లు రూ.4,594 కోట్లకు విక్రయించనున్నాయి. సంక్షోభంలో కూరుకున్న యెస్ బ్యాంక్ పునర్వ్యవస్థీకరణ పథకం కింద 2020 మార్చిలో ఎస్‌బీఐ సహా ఈ 8 బ్యాంకులు పెట్టుబడులు పెట్టాయి. 'యెస్ బ్యాంక్‌లో 13.19% వాటాకు సమానమైన 413.44 కోట్ల షేర్లను రూ.8,888.97 కోట్లకు విక్రయించేందుకు ఎగ్జిక్యూటివ్ కమిటీ ఆఫ్ ద సెంట్రల్ బోర్డు ఆమోదం తెలిపింద'ని ఎస్‌బీఐ వెల్లడించింది. ఒక్కో షేరు రూ.21.50 ధర వద్ద ఈ విక్రయ లావాదేవీ జరగనుందని తెలిపింది. బీఎస్‌ఈ వద్ద ఉన్న గణాంకాల ప్రకారం.. 2025 మార్చి చివరకు యెస్ బ్యాంక్‌లో ఎస్‌బీఐకి 24% వాటా ఉంది. ఈ లావాదేవీ అనంతరం ఎస్‌బీఐ వాటా 10.81 శాతానికి తగ్గుతుంది. 2025 మార్చి 31 నాటికి యెస్ బ్యాంక్‌లో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 2.75%, ఐసీఐసీఐ బ్యాంక్ 2.39%, కోటక్ మహీంద్రా బ్యాంక్ 1.21%, యాక్సిస్ బ్యాంక్ 1.1 శాతం, ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ 0.92%, ఫెడరల్ బ్యాంక్ 0.76%, బంధన్ బ్యాంక్ 0.7% చొప్పున వాటాలను కలిగి ఉన్నాయి. ప్రతిపాదిత వాటా విక్రయానికి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా లాంటి నియంత్రణ సంస్థల నుంచి అనుమతులు తీసుకోవాల్సి ఉంది. ఈ అనుమతులు లభిస్తే 12 నెలల్లోగా ఈ విక్రయ లావాదేవీ పూర్తయ్యే అవకాశం ఉందని ఎస్‌బీఐ పేర్కొంది. ఎస్‌ఎంబీఎస్ పెట్టుబడుల వల్ల యెస్ బ్యాంక్ మలివిడత వృద్ధి దిశగా అడుగులు వేస్తుందనే ఆశాభావాన్ని యెస్ బ్యాంక్ ఎండీ, సీఈఓ ప్రశాంత్ కుమార్ వ్యక్తం చేశారు.

## సెలవుల సంతోషానికి సురక్షిత రక్షణ.. ట్రావెల్ ఇన్సూరెన్స్

సాధారణంగా అనేక మంది కూడా వీకెండ్ వస్తే చాలు టూర్లకు ప్లాన్ చేస్తుంటారు. మరికొంత మంది ప్రతి నెలలో కూడా లాంగ్ టూర్లకు వెళ్తుంటారు. అలాంటి సమయాల్లో అప్పుడప్పుడు ప్రమాదాలు కూడా జరుగుతుంటాయి. రోడ్డు లేదా అగ్ని ప్రమాదం వంటివి జరుగుతుంటాయి. కానీ ఇలాంటి సమయంలో ముందుగానే ట్రావెల్ ఇన్సూరెన్స్ తీసుకుంటే ఎలాంటి భయాందోళన లేకుండా ఉండవచ్చని నిపుణులు చెబుతున్నారు. వీటిని తీసుకోవడం ద్వారా అనేక సౌకర్యాలను పొందవచ్చని అంటున్నారు. ఈ క్రమంలో ఫ్లైట్ ఆలస్యం, లగేజ్ మిస్సింగ్, వైద్య అత్యవసర పరిస్థితి వంటి సమస్యలు ఎప్పుడైనా తలెత్తవచ్చు. ఇటువంటి సందర్భాల్లో ట్రావెల్ ఇన్సూరెన్స్ మీకు రక్షణ కల్పిస్తుందని చెబుతున్నారు. చాలా మంది పర్యాటకులు దీనిని పట్టించుకోకపోయినా ఏదైనా సమస్య వచ్చినప్పుడు ఇది చక్కగా ఉపయోగపడుతుంది. ట్రావెల్ ఇన్సూరెన్స్ మీ ప్రయాణంలో మనశ్శాంతిని అందిస్తుంది. ఇది కేవలం మీ ట్రావెల్ ఇన్వెస్ట్‌మెంట్‌ను రక్షించడమే కాకుండా, అనుకోని పరిస్థితుల్లో మీకు ఆర్థిక




భద్రతను కూడా అందిస్తుంది. ట్రావెల్ ఇన్సూరెన్స్ ద్వారా మీ జీవితంలో అనుకోనివి జరిగినప్పుడు మీకు రక్షణ కవచం పనిచేస్తుంది. కాబట్టి, మీ బ్యాగ్‌లు సిద్ధం చేసుకునే ముందు ట్రావెల్ ఇన్సూరెన్స్‌ను మీ ప్రయాణ ప్రణాళికలో భాగం చేసుకోండి. కొంచెం ప్లాన్ చేయడం ద్వారా మీరు భవిష్యత్తులో పెద్ద ఒత్తిడుల నుంచి తప్పించుకోవచ్చు. అప్పుడప్పుడు మీరు నెలల తరబడి మీ సెలవులను ప్లాన్ చేస్తారు. కానీ చివరి నిమిషంలో మీ కుటుంబ పరిస్థితి కారణంగా రద్దు చేసుకోవాల్సి ఉంటుంది. ఆ క్రమంలో రీఫండ్, ఎయిర్‌లైన్ టికెట్లు, హోటల్ రిజర్వేషన్ వంటి వేల లేదా లక్షల రూపాయల మొత్తాన్ని మీరు ట్రావెల్ ఇన్సూరెన్స్ చేసుకుంటే కవరేజ్ చేసుకోవచ్చు.

దీంతోపాటు వైద్య అత్యవసర పరిస్థితుల నుంచి కూడా రక్షించుకోవచ్చు. సాధారణ హెల్త్ ఇన్సూరెన్స్ కవర్ చేయని దేశంలో మీరు అనారోగ్యానికి గురైతే లేదా గాయపడితే, ఆసుపత్రి బిల్లులు భారీగా ఉండవచ్చు. ట్రావెల్ ఇన్సూరెన్స్ ఇలాంటి వాటిని కవర్ చేస్తుంది. అత్యవసరంగా ఆసుపత్రిలో చేరికలు, డాక్టర్ సందర్శనలను కవర్ చేయడం ద్వారా మీకు రక్షణ కల్పిస్తుంది. ఇది మీ ఆందోళనలను తొలగించి, అనుకోని పరిస్థితులతో వ్యవహరించడానికి బదులుగా జ్ఞాపకాలను సృష్టించడంపై దృష్టి పెట్టేలా చేస్తుంది. ట్రావెల్ ఇన్సూరెన్స్ ఎంచుకునేటప్పుడు, మీ ప్రయాణ రకం, గమ్యస్థానం, వ్యక్తిగత అవసరాలను పరిగణనలోకి తీసుకోవాలి. కొన్ని ఇన్సూరెన్స్ పాలసీలు వైద్య అత్యవసర పరిస్థితులపై ఎక్కువ దృష్టి పెడితే, మరి కొన్ని ట్రిప్ రద్దు లేదా సామాను కోల్పోవడంపై ఎక్కువ కవరేజ్ అందిస్తాయి. మీరు సాహస ప్రయాణాలకు వెళుతున్నట్లయితే, హైకింగ్ లేదా స్కీయింగ్ వంటి కార్యకలాపాలను కవర్ చేసే పాలసీని ఎంచుకోండి. అంతేకాకుండా పాలసీని కొనుగోలు చేసే ముందు దాని నిబంధనలను జాగ్రత్తగా చదవండి.

## 3% వరకు పెరగనున్న మెర్సిడెస్ బెంజ్ కార్ల ధరలు

ఢిల్లీ: ఈ ఏడాదిలో రెండు దఫాల్లో కార్ల ధరలను పెంచనున్నట్లు మెర్సిడెస్ బెంజ్ ఇండియా ప్రకటించింది. వచ్చే జూన్, సెప్టెంబరుల్లో చేపట్టబోయే ధరల మార్పుల్లో మెర్సిడెస్ సి–క్లాస్ ధర రూ.90000, మెర్సిడెస్ మేబాచ్ ఎస్ 680 ధర రూ.12.2 లక్షల మేర పెరగనుంది. జూన్ 1 నుంచి కార్ల ధరలను 1–2%, సెప్టెంబరు 1 నుంచి 1.5% పెంచడానికి మెర్సిడెస్ బెంజ్ సన్నాహాలు చేస్తోంది. విదేశీ మారకపు ద్రవ్య హెచ్చుతగ్గుల ప్రభావాన్ని తగ్గించేందుకు కంపెనీ ఈ నిర్ణయం తీసుకుంది. రెండు దశల్లో కార్ల ధరలను దాదాపు 3% పెంచనున్నామని మెర్సిడెస్ బెంజ్ ఇండియా ఎండీ, సీఈఓ సంతోశ్ అయ్యర్ తెలిపారు. గత నాలుగు నెలల్లో డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకపు విలువ భారీగా క్షీణించిందని, యూరోతో పోలిస్తే రూపాయి విలువ 10% తగ్గిందని, దీంతో కార్యకలాపాలపై వ్యయ ఒత్తిళ్లు పడుతున్నాయని వెల్లడించారు. కొనుగోలుదార్లకు సాధ్యమైనంత తక్కువ భారాన్నే బదిలీ చేయనున్నట్లు వివరించారు.




## డాక్టర్ రెడ్డీస్‌కు
# రూ.1,593 కోట్ల లాభం

**తుది డివిడెండ్ రూ.8**

హైదరాబాద్: డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్, గత ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికానికి రూ.8,506 కోట్ల ఆదాయంపై రూ.1,593 కోట్ల నికరలాభాన్ని ఆర్జించింది. 2023–24 ఇదేకాలంతో పోల్చితే ఆదాయం 20%, నికరలాభం 22% పెరిగాయి. త్రైమాసిక ఈపీఎస్ రూ.19.11గా ఉంది. 2024–25లో ఈ సంస్థ రూ.32,553 కోట్ల ఆదాయాన్ని, రూ.5,654 కోట్ల నికరలాభాన్ని ఆర్జించింది. 2023–24తో పోలిస్తే వార్షికాదాయం 17%, నికరలాభం 2% పెరిగాయి. ప్రాంతాల వారీగా: గత ఆర్థిక సంవత్సరంలో ఉత్తర అమెరికా ఆదాయాలు 12% పెరిగినట్లు డాక్టర్ రెడ్డీస్ వెల్లడించింది. ఐరోపా ఆదాయాలు ఎంతో అధికంగా 75% పెరగడం



ప్రత్యేకత. కొత్త ఔషధాలు విడుదల చేయటం వల్ల రష్యా ఆదాయాలు కూడా ఆకర్షణీయంగా పెరిగాయి. అన్ని విభాగాల్లో రెండంకెల వృద్ధి:దాదాపు అన్ని వ్యాపార విభాగాల్లో రెండంకెల వృద్ధి నమోదు చేసినట్లు డాక్టర్ రెడ్డీస్ కో–ఛైర్మన్, ఎండీ జీవీ ప్రసాద్ వివరించారు. కొత్త ఔషధాలు విడుదల చేయడం, అమెరికా అమ్మకాలు పెరగడం వల్ల ఆకర్షణీయ వృద్ధి సాధ్యమైనట్లు తెలిపారు. సమీప భవిష్యత్తులో ఇదేవిధంగా మెరుగైన వృద్ధి సాధిస్తామనే విశ్వాసాన్ని ఆయన వ్యక్తం చేశారు. డివిడెండుకు రికార్డు తేదీ జులై 10: డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్ యాజ మాన్యం వాటాదార్లకు ఒక్కో షేరుకు రూ.8 చొప్పున తుది డివిడెండ్ ప్రకటించింది. డివిడెండ్ చెల్లింపునకు ఈ ఏడాది జులై 10ని రికార్డు తేదీగా నిర్ణయించారు. కంపెనీ ప్రస్తుత కో–ఛైర్మన్, ఎండీ జీవీ ప్రసాద్ మరో అయిదేళ్ల కాలానికి అదే హోదాలో తిరిగి నియమితులయ్యారు. కంపెనీ వార్షిక సర్వసభ్య సమావేశాన్ని (ఏజీఎం) ఈ ఏడాది జులై 24న నిర్వహించాలని నిర్ణయించారు.

## వాట్సప్ బాట్‌లో ప్రీమియం చెల్లింపు
**ఎల్ఐసీ**

హైదరాబాద్: పాలసీదారులు సులభంగా ప్రీమియం చెల్లించేందుకు వీలుగా సరికొత్త సదుపాయాన్ని తీసుకొచ్చినట్లు లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎల్ఐసీ) తెలిపింది. ఇందుకోసం ప్రత్యేకంగా వాట్సప్ నంబరు 8976862090 కేటాయించినట్లు పేర్కొంది. ఎల్ఐసీ పోర్టల్‌లో నమోదు చేసుకున్న పాలసీదారులు, ఈ నంబరుకు సందేశం పంపించడం ద్వారా తమ పాలసీలకు చెల్లించాల్సిన ప్రీమియం వివరాలు తెలుసుకునేందుకు వీలవుతుంది. నేరుగా యూపీఐ, నెట్ బ్యాంకింగ్, కార్డుల ద్వారా వాట్సప్ బాట్‌లోనే చెల్లింపులు పూర్తి చేయొచ్చు. పాలసీలకు చెల్లించాల్సిన ప్రీమియం నుంచి, చెల్లించిన తర్వాత రశీదు కూడా ఈ వాట్సప్ బాట్‌లోనే లభిస్తుందని ఎల్ఐసీ సీఈఓ, ఎండీ సిద్ధార్థ మొహంతి తెలిపారు. పాలసీదారులు ఎక్కడినుంచైనా, ఎప్పుడైనా ప్రీమియం చెల్లించేందుకు ఇది సౌకర్యంగా ఉంటుదన్నారు. దాదాపు 2.2 కోట్ల మంది ఎల్ఐసీ పోర్టల్‌లో నమోదు చేసుకున్నారని పేర్కొన్నారు. ఆన్‌లైన్ సేవల కోసం రోజుకు 3 లక్షల మందికి పైగా పాలసీదారులు పోర్టల్‌ను సందర్శిస్తుంటారని తెలిపారు. ఎల్ఐసీ కేటాయించిన వాట్సప్ నంబరుకు 'హాయ్' అని సందేశం పంపించాలి. ఆ తర్వాత తెరపై పలు రకాల ఆప్షన్లు కనిపిస్తాయి. ఇందులో మీకు కావాల్సింది ఎంపిక చేసుకుని, తదుపరి సూచనల ప్రకారం కొనసాగొచ్చు.

## గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 4.95 | ₹ 4.97 |

**బంగారం ధరలు (10 గ్రాములు)**
హైదరాబాద్

| ₹ 90,450 (22 క్యారెట్లు) | ₹ 98,680 (24 క్యారెట్లు) |
|---|---|

**వెండి ధరలు (కేజీ)**
హైదరాబాద్
₹ 1,11,000

# పాక్ పక్కలో బల్లెంలా బలోచ్

పాకిస్థాన్ నెత్తిన మరో పిడుగు పడింది. దశాబ్దాలుగా ఆ దేశానికి కొరకరాని కొయ్యగా మారిన బలోచిస్థాన్ వేర్పాటువాద ఉద్యమం.. తాజా ఉద్రిక్తతల వేళ మరింత తీవ్రమైంది. తాజాగా అక్కడ ఓ పట్టణాన్ని బలోచ్ లిబరేషన్ ఆర్మీ స్వాధీనం చేసుకోవడంతో దాయాదికి స్వదేశంలోనే సవాల్ ఎదురైంది. బలోచిస్థాన్ ప్రావిన్స్‌లో గల కాలత్ జిల్లా మంగోచర్ పట్టణాన్ని తాము స్వాధీనం చేసుకున్నట్లు బలోచ్ లిబరేషన్ ఆర్మీ (బీఎల్ఏ) శనివారం ప్రకటించింది. అంతేగాక, బలోచిస్థాన్ వ్యాప్తంగా 39 ప్రాంతాల్లో మెరుపు దాడులు చేశామని వెల్లడించింది. ఈ ఆపరేషన్ ఇంకా కొనసాగుతోందని, మిలిటరీ కాన్వాయ్‌లపై దాడులు చేస్తామని హెచ్చరించింది. ఇప్పటికే కొంతమంది స్థానిక పోలీసులను బందీలుగా తీసుకున్నట్లు తెలుస్తోంది. పోలీసు స్టేషన్‌ను తమ నియంత్రణలోకి తీసుకున్న బీఎల్ఏ.. రహదారులను దిగ్బంధించింది. అయితే, బలోచ్ రెబల్స్ ప్రకటనపై పాక్ ప్రభుత్వం నుంచి ఇంకా అధికారిక ప్రకటన రాలేదు. ఇదిలా



ఉండగా.. శుక్రవారం కూడా పాక్ ఆర్మీ సిబ్బందిపై తిరుగుబాటుదారులు దాడి చేయగా.. 22 మంది సైనికులు మరణించినట్లు వార్తలు వచ్చాయి. దీనిపైనా ఎలాంటి అధికారిక సమాచారం లేదు. భారత్‌తో ఉద్రిక్తతలు కొనసాగుతున్న సమయంలో.. బలోచ్‌లో ఈ ఘటనలు చోటుచేసుకోవడం పాక్‌ను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. పాకిస్థాన్‌లోని బలోచిస్థాన్ ప్రావిన్సులో చమురు, బొగ్గు, బంగారం, రాగి, సహజ వాయువు తదితర వనరులు పుష్కలంగా ఉన్నాయి. వీటి ఆదాయం పాక్ ఖజానా నింపుతోంది. అయితే, దేశ వ్యవసాయ యోగ్య భూమిలో ఆ రాష్ట్ర వాటా కేవలం 5 శాతం మాత్రమే. అక్కడ కఠినమైన ఎడారి వాతావరణం ఉంటుంది. పేదరికం కూడా ఎక్కువే. జనాభా తక్కువగా ఉండటంతో అభివృద్ధికి దూరమైంది. ఫలితంగా రాజకీయ అనిశ్చితి నెలకొని.. వేర్పాటువాదులు శక్తిమంతమయ్యారు. ప్రత్యేక దేశంగా ఏర్పడాలని ఇక్కడి ప్రజలు కొన్ని దశాబ్దాలుగా పోరాడుతున్నారు.

## పాక్ దాడుల్లో మృతి చెందిన వారి కుటుంబాలకు
# రూ.10లక్షల పరిహారం



**బాధిత కుటుంబాలకు మా ప్రభుత్వం ఎప్పటికీ మద్దతుగా నిలుస్తుంది**

**బాధితులను కలిసి పరామర్శించిన జమ్ముకాశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా**

గత రెండు రోజుల నుంచి జమ్మూకశ్మీర్ సరిహద్దు ప్రాంతాలపై పాక్ జరుపుతున్న దాడుల్లో దాదాపు 20మంది పౌరులు మృతి చెందిన విషయం తెలిసిందే. మృతుల కుటుంబాలకు జమ్మూ కశ్మీర్ ప్రభుత్వం తరఫున ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా నష్టపరిహారం ప్రకటించారు. మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున పరిహారం అందిస్తామని తెలిపారు. బాధిత కుటుంబాలకు తమ ప్రభుత్వం ఎప్పటికీ మద్దతుగా నిలుస్తుందని హామీ ఇచ్చారు. పహల్గాం దాడికి ప్రతీకారంగా ఉగ్రస్థావరాలను భారత్ ధ్వంసం చేయడంతో.. పాక్ కూడా సరిహద్దు ప్రాంతాల్లో ప్రతీకార దాడులకు పాల్పడుతోంది. నియంత్రణ రేఖ వెంట పాక్ కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించి దాడులకు తెగబడుతోంది. కశ్మీర్‌లోని శ్రీనగర్, రాజౌరి, పూంఛ్, పఠాన్ కోట్ ప్రాంతాల్లో పాక్ డ్రోన్‌లతో దాడులు చేస్తోంది. ఈ దాడుల్లో జమ్మూకశ్మీర్ ప్రభుత్వ అధికారి రాజ్‌కుమార్ థప్పా సహా దాదాపు 20మంది పౌరులు ప్రాణాలు కోల్పోగా..పదుల సంఖ్యలో గాయపడ్డారు.

పౌరులు, ప్రభుత్వ ఉన్నతాధికారి మృతి పట్ల జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా ఆవేదన వ్యక్తం చేశారు. ఒక్కరోజు ముందే తాను అధ్యక్షత వహించిన ఆన్‌లైన్ సమావేశంలో రాజ్‌కుమార్ పాల్గొన్నారని.. ఇంతలోనే రాజౌరిలోని ఆయన ఇంటిపై జరిగిన దాడిలో ప్రాణాలు కోల్పోవడం బాధాకరమని అన్నారు. శనివారం వేకువజామున కూడా భారత్‌పై పాకిస్థాన్ సైన్యం దాడులకు పాల్పడింది. రాత్రి నుంచే సరిహద్దు రాష్ట్రాల్లో కొన్నిచోట్ల బాంబుపేలుళ్లు వినిపించడంతో అధికారులు అప్పటికప్పుడు విద్యుత్తు సరఫరా నిలిపివేసి 'బ్లాకౌట్' పాటించారు. శ్రీనగర్, పఠాన్ కోట్ ప్రాంతాల్లో ఉదయం కూడా పేలుళ్ల శబ్దాలు వచ్చినట్లు స్థానికులు పేర్కొన్నారు. కాగా పాక్ దాడులను భారత్ సమర్థంగా తిప్పికొట్టింది. సరిహద్దు ప్రాంతాల్లో అధికారులు సైరన్లు మోగిస్తూ ప్రజలను అప్రమత్తం చేశారు. మధ్యాహ్నం 11 గంటల ప్రాంతంలో మరోసారి శ్రీనగర్ ఎయిర్‌పోర్ట్ సమీపంలో భారీగా పేలుళ్లు సంభవించినట్లు శబ్దాలు వచ్చినట్లు అధికారులు పేర్కొన్నారు.

### ఉగ్రవాద శిబిరాలను భారత ఆర్మీ ధ్వంసం చేసిందిలా..

గత రెండు రోజులుగా జమ్మూకశ్మీర్, పంజాబ్‌లోని ప్రాంతాల్లో పాకిస్థాన్ చేసిన డ్రోన్ల దాడులను భారత ఆర్మీ సమర్థంగా ఎదుర్కొంది. ఆ దాడులకు ప్రతిస్పందనగా భారత ఆర్మీ ఉగ్రవాద లాంచ్ ప్యాడ్‌లపై ఎటాక్ చేసి ధ్వంసం చేసింది. దానికి సంబంధించిన వీడియోను ఇండియన్ ఆర్మీ తన సోషల్ మీడియా ఖాతాలో పోస్టు చేసింది. "భారత సరిహద్దుకు దగ్గరగా ఉన్న ఉగ్రవాద లాంచ్‌ప్యాడ్‌ల నుంచి గతంలో భారత పౌరులు, భద్రతా దళాలపై దాడులకు ప్రణాళికలు రూపొందించారు. ఇక్కడి నుంచి దాడులు కూడా చేశారు. భారత సైన్యం



సత్వరమే స్పందించి ఉగ్రవాద స్థావరాలపై దాడి చేసింది. ఇప్పుడు లాంచ్‌ప్యాడ్‌ను ధ్వంసం చేయడంతో వారి మౌలిక సదుపాయాలు, సామర్థ్యాలకు భారీ దెబ్బ తగిలింది" అని పోస్టులో భారత ఆర్మీ తెలిపింది.

### ప్రార్థనా మందిరాలపై, నివాసాలపై పాక్ నిరంతర దాడులు..

సాధారణ ప్రజలపై తాము దాడులు చేయడం లేదని పాకిస్థాన్ బుకాయింపులను భారత ఆర్మీ తిప్పికొట్టింది. జమ్ములోని నివాస ప్రాంతాలు, ఆలయాలపై పాక్ నిరంతరం దాడులకు తెగబడుతోందని కేంద్రం పేర్కొంది. అందుకు సాక్ష్యంగా వీడియోను సోషల్ మీడియాలో పోస్టు చేసింది. జమ్మూకశ్మీర్‌లోని శంభూ దేవాలయం ధ్వంసమైనట్లు రక్షణ శాఖ ఫొటోలు, వీడియోను విడుదల చేసింది. రాత్రంతా డ్రోన్లతో దాడులు చేస్తూనే ఉందని.. భారత ఆర్మీ వాటిని సమర్థవంతంగా ఎదుర్కొన్నట్లు పేర్కొంది.



## ఆంధ్రా,తెలంగాణ విద్యార్థులు
# శ్రీనగర్ నుంచి స్వస్థలాలకు ..

శ్రీనగర్: భారత్–పాక్ మధ్య ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో శ్రీనగర్‌లోని షేర్–ఇ–కశ్మీరీ వ్యవసాయ విజ్ఞాన, సాంకేతిక విశ్వవిద్యాలయంలో విద్యార్థులు ఆందోళనకు గురవుతున్నారు. ఇందులో 300 మందికిపైగా విద్యార్థులు ఉండగా.. వీరిలో పలువురు ఆంధ్రా,తెలంగాణ రాష్ట్రాల విద్యార్థులు ఉన్నారు. సరిహద్దుల్లో బాంబుల మోతతో ఆందోళన చెందుతున్నట్లు విద్యార్థులు చెబుతున్నారు. తమను వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని కోరుతున్నారు. కేంద్ర మంత్రి బండి సంజయ్‌కు ఏపీ, తెలంగాణ విద్యార్థులు లేఖ రాశారు. దీంతో కేంద్ర మంత్రి తక్షణమే స్పందించారు. జిల్లా కలెక్టర్, వర్సిటీ డీన్‌తో మాట్లాడారు. సురక్షిత ప్రాంతానికి తరలించాలని కోరారు. దీంతో ఏపీ, తెలంగాణ, తమిళనాడుకు చెందిన మొత్తం 23 మంది విద్యార్థులను బస్సుల్లో శ్రీనగర్ నుంచి ఢిల్లీకి పంపించారు. అక్కడి నుంచి స్వస్థలాలకు చేరుకోనున్నారు.



# టీవీ ప్రసారాల్లో సైరన్‌లు వాడొద్దు

## మీడియా ఛానెళ్లకు కేంద్రం అడ్వైజరీ

భారత్–పాక్‌ల మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న వేళ 'ఆపరేషన్ సిందూర్'కి సంబంధించి ప్రాంతీయ, జాతీయ మీడియా విస్తృత కవరేజీ ఇస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో పౌరులను అప్రమత్తం చేసేందుకు వినియోగించే సైరన్‌లను (%ూఱతీ ఞఱతీవఅం%) వార్తా కార్యక్రమాల్లో ఉపయోగించవద్దని మీడియా ఛానెళ్లకు కేంద్రం సూచించింది. కేవలం మాక్ డ్రిల్‌ల సమయంలో పౌరులకు అవగాహన కోసం మాత్రమే వినియోగించాలని పేర్కొంటూ అడ్వైజరీ జారీ చేసింది. "ఇలా తరచుగా ఈ శబ్దాలు వినియోగించడం ప్రజల్లో గందరగోళానికి దారితీస్తాయి. దీంతో వాస్తవంగా అత్యవసర సమయాల్లో వీటిని మోగించినప్పుడు పౌరులు వీటిని తేలికగా తీసుకునే ప్రమాదం ఉంది" అని ప్రభుత్వం పేర్కొంది. ఇందుకు సంబంధించి కేంద్ర హోంశాఖ ఆధ్వర్యంలోని డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ఫైర్ సర్వీస్, సివిల్ డిఫెన్స్ అండ్ హోమ్ గార్డ్స్ విభాగాలు అడ్వైజరీ జారీ చేశాయి. ప్రస్తుతం భారత్, పాకిస్థాన్ దేశాల మధ్య ఉద్రిక్తత కొనసాగుతోంది. పహల్గాంలో పర్యాటకులపై విచక్షణారహితంగా కాల్పులు జరిపిన ఉగ్రవాదులు 26 మందిని పొట్టనపెట్టుకున్న సంగతి తెలిసిందే. దీంతో పాక్‌లోని, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్రస్థావరాలను లక్ష్యంగా చేసుకొని భారత్ దాడులు చేసింది. పాకిస్థాన్ మాత్రం సాధారణ పౌరులు, ఇండియన్ ఆర్మీని లక్ష్యంగా దాడులు మొదలుపెట్టింది. దీంతో సరిహద్దు ప్రాంతాల్లో ప్రజలను హెచ్చరిస్తూ అధికారులు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. ఇంతవరకు వీధుల్లో తిరుగుతూ ప్రకటనలు చేయడం చూశాం కదా.. అయితే, ఇప్పుడు నేరుగా ఫోన్లకే ఇలాంటి సందేశాలూ వచ్చేలా చేశారు. నెట్‌వర్క్ సమస్యలు ఉన్నప్పుడూ మెసేజ్‌లు వచ్చే వెసులుబాటు ఉంది. వాటిని ఫాలో అయి సురక్షితమైన ప్రాంతాలకు చేరితే సరిపోతుంది. సునామీలు, భూకంపాలు వంటి ప్రకృతి విపత్తులు వచ్చినప్పుడు.. యుద్ధాలు, ఉగ్రవాద దాడులు జరిగినప్పుడు ప్రజలను అప్రమత్తం చేసేందుకు భారత ప్రభుత్వం వైర్‌లెస్ ఎమర్జెన్సీ అలర్ట్ వ్యవస్థను రూపొందించింది. ఆకస్మిక పరిస్థితుల్లో ప్రజలకు అలర్ట్ మెసేజ్ ద్వారా సమాచారం చేరవేయడమే లక్ష్యంగా దీన్ని రూపొందించింది. ఇప్పుడు పాకిస్థాన్‌తో ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో అప్‌డేట్స్ మిస్ కాకుండా ఉండేందుకు ఫోన్లలో ఈ ఆప్షన్‌ను ఎంపిక చేసుకోవాలని నిపుణులు సూచించారు. ఆండ్రాయిడ్, ఐఫోన్లలో ఈ వెసులుబాటు ఉంది. మీ ఫోన్లలో అలర్ట్స్ డిజేబుల్ చేసి ఉంటే ఇప్పుడైనా ఎనేబుల్ చేసుకోవాలి. మరి అదెలా చేయాలో తెలుసుకుందాం..

### కాల్పుల విరమణపై పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు నిర్వహించండి

నిర్వహించాలని డిమాండ్ చేసింది. పహల్గాం ఉగ్రదాడి ఘటన అనంతరం గడిచిన 18 రోజులుగా జరిగిన పరిణామాలు, కలికట్టుగా తీసుకున్న నిర్ణయాలను చర్చించేందుకు సమావేశం నిర్వహించాలని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ఎక్స్ వేదికగా పోస్ట్ చేశారు. భారత్– పాక్ మధ్య కాల్పుల విరమణను స్వాగతిస్తున్నట్లు జమ్మూకశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా పేర్కొన్నారు. ఇదే ఒప్పందం రెండ్రోజుల ముందు జరిగి ఉంటే కొంత రక్తపా తాన్ని, కొన్ని జీవితాలను కాపాడిటనట్లయ్యేదని పేర్కొన్నారు. ఎట్టకేలకు ఇరు దేశాల మిలటరీ ఆపరేషన్ డైరెక్టర్ జనరల్స్ సరిహద్దుల్లో కాల్పుల విరమణకు అంగీకరించడం స్వాగతించదగ్గ పరిణామమని పేర్కొన్నారు. దాడుల కారణంగా జరిగిన నష్టాన్ని అంచనా వేసి ఉపశమనం చర్యలు చేపట్టాల్సిన బాధ్యత జమ్మూకశ్మీర్ అధికార యంత్రాంగం ఉందని ఒమర్ అబ్దుల్లా అన్నారు.

## జిల్లాలో బాంబు స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు



**బోయిన్ పల్లి మే 10 (జనం సాక్షి) :**

దేశవ్యాప్తంగా నెలకొన్న యుద్ధ వాతావరణాన్ని దృష్టిలో ఉంచుకుని, జిల్లావ్యాప్తంగా భద్రత చర్యలు ముమ్మరం చేశారు. జిల్లా ఎస్పీ మహేష్ బి గితే ఐపీఎస్ ఆధ్వర్యంలో శనివారం విస్తృత తనిఖీలు నిర్వహించారు. వేములవాడ దేవస్థానం, నాంపెల్లి గుడి, మిడ్ మ్యానేర్ డ్యామ్, సిరిసిల్ల, వేములవాడ బస్టాండ్‌లలో బాంబు స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ బలగాల సహాయంతో తనిఖీలు చేపట్టారు. జిల్లాలో బస్టాండ్లు, దేవస్థానాలు, పర్యాటక ప్రాంతాల్లో ప్రజలు ఎక్కువగా గుమికూడే ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు ఎస్పీ తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద వ్యక్తులు కనిపించిన వెంటనే 100 నంబర్‌కు లేదా స్థానిక పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఫేక్ న్యూస్‌పై హెచ్చరిక చేసారు సోషల్ మీడియాలో వ్యాపించే అనాధారిత సమాచారం, ఫేక్ న్యూస్‌లను నమ్మొద్దని, వాటిని గ్రూపుల్లో షేర్ చేయకుండా, ప్రభుత్వ లేదా పోలీసు విభాగాల అధికారిక సమాచారాన్నే నమ్మాలని సూచించారు. ప్రజల సహకారంతోనే సమాజాన్ని మరింత భద్రమైనదిగా చేయవచ్చని ఎస్పీ తెలిపారు.

## ఉదండాపూర్ నిర్వాసితుల పరిహారం పెంపునకు సీఎం సానుకూలం

**జడ్చర్ల, మే 10 (జనం సాక్షి):**



ఉదండాపూర్ ప్రాజెక్ట్ నిర్వాసితులకు ఆర్‌అండ్ ఆర్ ప్యాకేజీ పరిహారం పెంపునకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సానుకూలంగా ఉన్నారని, ఉదండాపూర్ నిర్వాసితులు దీనికి సంబంధించిన శుభవార్తను త్వరలోనే వింటారని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. హైదరాబాద్ లోని జల సౌదాలో శనివారం జరిగిన ఉదండాపూర్ ప్రాజెక్ట్ నిర్వాసితుల పరిహారం పెంపు సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి నిర్వాసితుల సమస్యలను మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి వివరించారు. ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీని పెంచడానికి సీఎం రేవంత్ రెడ్డి సానుకూలంగానే ఉన్నారని, దీనికి సంబంధించిన ప్రతిపాదనలు ప్రస్తుతం ఆర్థిక శాఖ పరిశీలనలో ఉన్నాయని త్వరలోనే వాటిని ఆమోదించడం జరుగుతుందని ఈ సందర్భంగా ఉత్తమ్ కుమార్ రెడ్డి హామీ ఇచ్చినట్లు అనిరుధ్ రెడ్డి తెలిపారు. అలాగే ప్రస్తుతం నిర్వాసితులకు సంబంధించి 40 కోట్లు రూపాయలు చెల్లింపులు పెండింగ్ ఉన్నాయని, వాటిని వీలైనంత త్వరగా విడుదల చేయాలని కోరినట్లు తెలిపారు. రిజర్వాయర్ నిర్మాణ పనులతో పాటుగా నీటి కాలువల నిర్మాణ పనులన కూడా వెంటనే చేపట్టాలని దీనికి సంబంధించిన టెండర్ ప్రక్రియ పూర్తి చేసి పనులను వీలైనంత త్వరగా ప్రారంభించాలని కోరినట్లు చెప్పారు. అలాగే కోడ్గల్, బైరంపల్లి, వాడియాలలో చెక్ డ్యాంల నిర్మాణాలను కూడా చేపట్టాలని కోరారు. ఈ సమావేశంలో మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి తో పాటుగా నీటి పారుదల శాఖ కార్యదర్శి ప్రశాంత్ పాటిల్, ఈ.ఎన్.సి అరుణ్ కుమార్, వినయ్ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఫొటోలు మార్ఫింగ్ చేస్తానని బెదిరింపు

### మాజీ డైరెక్టర్‌పై కేసు నమోదు

**హైదరాబాద్, మే 10 (జనంసాక్షి)**

మాజీ డైరెక్టర్ మోసాలకు సంబంధించి దాఖలైన కేసులను వెనక్కి తీసుకోకపోతే మార్ఫింగ్ ఫొటోలను సోషల్‌మీడియాలో విడుదల చేస్తానని బెదిరింపులకు పాల్పడిన వ్యక్తిపై బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. బంజారాహిల్స్ రోడ్ నెం.12లోని ఎమ్మెల్యే కాలనీలో ఉన్న మేరీ సువర్ణ భూమి రిసార్ట్స్ సంస్థలో గతంలో డైరెక్టర్‌గా పనిచేసిన మంచాల సాయి సుధాకర్ సంస్థ నిధులను దుర్వినియోగం చేశారనే ఆరోపణలపై సంస్థ నిర్వాహకులు అతనిపై గతంలో కేసులు దాఖలు చేశారు. ఫలితంగా అతను అరెస్టై, కొంతకాలం జైల్లో గడిపాడు. దీంతో అతడు సంస్థపై కక్షను పెంచుకున్నాడు. జైలు నుంచి బయటకు వచ్చిన అనంతరం, సంస్థపై ప్రతీకార దాడిగా మార్ఫింగ్ ఫొటోలు సృష్టించి బ్లాక్‌మెయిల్ చేయడం ప్రారంభించాడు. తనపై ఉన్న కేసులను వెనక్కి తీసుకోకపోతే ఆ ఫొటోలను సోషల్‌మీడియాలో పోస్ట్ చేస్తానంటూ బెదిరింపులకు పాల్పడ్డాడు. ఈ నేపథ్యంలో, సంస్థ ప్రస్తుత డైరెక్టర్ శుక్రవారం బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో సాయి సుధాకర్‌పై బీఎన్‌ఎస్ సెక్షన్లు 336(4), 79, 351(2), 49 కింద కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

## ఆర్మీ జవాన్‌కు మంత్రి శ్రీధర్ బాబు నివాళి

**మంథని, (జనంసాక్షి)**



పాకిస్తాన్ తో జరుగుతున్న ధర్మ యుద్ధంలో వీరోచితంగా పోరాడుతూ.. వీర మరణం పొందిన గోరంట్ల మండలం, గడ్డం తాండ గ్రామపంచాయతీలోని కల్లి తాండ గ్రామానికి చెందిన ఇండియన్ ఆర్మీ జవాన్ ఎం.మురళీనాయక్ కి రాష్ట్ర ఐటి పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు ఎక్స్ వేదికగా అశ్రు నయనాలతో శ్రద్ధాంజలి ఘటించారు. మన దేశాన్ని కాపాడుతూ ప్రాణాలర్పించిన ఆంధ్రప్రదేశ్‌కు చెందిన అగ్నివీర్ ముధవత్ మురళీ నాయక్ అత్యున్నత త్యాగానికి వందనం. ఆయన ధైర్యం మనందరికీ స్ఫూర్తిదాయకంగా నిలుస్తుంది. దుఃఖిస్తున్న ఆయన కుటుంబానికి ప్రార్థనలు, బలం. భారతదేశం ఆయన వీరత్వాన్ని ఎప్పటికీ మరచిపోదు..అని చెప్పుకొచ్చారు.

## పార్టీలు.. కులాలుగా విడిపోయినా మేమంతా ఒక్కటే

### సంఘీబావ ర్యాలీలో మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్

**మంథని, (జనంసాక్షి) :**




బారత దేశ ఔన్నత్యం చాటుతూ, పౌరుషాన్ని చూపుతూ పాకిస్తాన్ తీవ్రవాదులపై మట్టుపెడుతున్న వీర సైనికులకు మేమున్నామని, దేశం కోసం పోరాటం చేయాలని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ అన్నారు. మంథని నియోజకవర్గ భీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం భారత జవాన్లకు సంఘీభావంగా మంథని పట్టణంలోని మహాత్మా జ్యోతిరావు పూలే చౌక్ నుంచి చాకలి ఐలమ్మ చౌక్ మీదిగా అంబేద్కర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ దేశంలో విభిన్నమైన మతాలు కులాలు బాషలు ఉన్నాఈ దేశం మట్టి గొప్పతనాన్ని చాటుతూ ప్రతి పౌరుడు హింసలేకుండా అహింసామార్గంలో జీవిస్తుంటే పాకిస్తాన్‌లోని తీవ్రవాదులు హింసామార్గాన్ని ఎంచుకుంటున్నారని అన్నారు. పాకిస్తాన్ తీవ్రవాదులకు ఆశ్రయంగా మారిందని, అక్కడ స్థావరాలకు అడ్డగా ఏర్పాటు చేసుకుని దేశాన్ని ప్రపంచాన్ని ఇబ్బందులకు గురి చేస్తోందన్నారు. అయితే ఏప్రిల్ 22న జరిగిన సంఘటనకు ధీటుగా దేశ సైనికులు తీవ్రవాదులను మట్టుబెట్టారని, ఈ దాడిలో సామాన్యులకు, దేశ సంపదకు ఎలాంటి నష్టం జరుగకుండా చూశారన్నారు. దేశంలో పార్టీలు కులాలుగా విడిపోయినా దేశ సంఘటితం, పటిష్టత కోసం ఏకతాటిపైకి వస్తామని ఈనాడు మూలమూలల నుంచి ప్రజలు సందేశం ఇస్తున్నారని అన్నారు. దేశంలోని ప్రజలంతా ఏకతాటిపై ఉన్నారంటూ ఈనాడు మంథనిలో సైతం అన్ని వర్గాలప్రజలు వ్యాపారులు తమ వ్యాపార సముదాయాలను మూసివేసి సైనికులకు సంఘీబావం తెలుపారని ఆయన అన్నారు. ప్రజల సంఘీబావాన్నిసైనికులు స్వీకరిస్తూ బార్డర్‌లోతీవ్రవాదుల కుట్రలను తిప్పి కొడుతున్నారని, వారి పోరాట స్ఫూర్తితో మనం కూడా సైన్యంలో ఎందుకు చేరకూడదనే బావన ప్రతి ఒక్కరిలో కల్గుతోందన్నారు. దేశ సరిహద్దుల్లో సైనికులు తమ బార్యాపిల్లలను, సమాజాన్ని వదిలి కాపలాగా ఉండటంతోనే ఈనాడు మనం సంతోషంగా ఉంటున్నామనే విషయాన్ని ప్రతి ఒక్కరు గుర్తించాలన్నారు.

మనకు రక్షణగా ఉండే సైనికులకు ఎన్ని విధాలుగా సంఘీబావం తెలిపినా తక్కువేనని ఆయన అభిప్రాయపడ్డారు. పాకిస్తాన్‌లోని తీవ్రవాద స్థావరాలను అంతం చేసే వరకు దేశ సైనికులు పోరాటం కొనసాగించాలని ఆయన అన్నారు. అనంతరం పాకిస్తాన్ తీవ్రవాదుల దాడిలో మృతి చెందిన తెలుగు బిడ్డ మురళీధర్ నాయక్‌తో పాటు పహల్గాంలో తీవ్రవాదులు హతమార్చిన టూరిస్టులకు ఆయన ఈ సందర్భంగా ఘన నివాళులు అర్పించి సంతాపం తెలిపారు.

## లేడీ డాక్టర్ అరెస్ట్

### 53 గ్రాముల కొకైన్ స్వాధీనం

**హైదరాబాద్ :(జనంసాక్షి)**

హైదరాబాద్ నగరంలోని ఒక ప్రముఖ ఆస్పత్రికి చెందిన వైద్యురాలు చిగురుపాటి నమ్రతను రాయదుర్గం పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. మాదక ద్రవ్యాలను కలిగి ఉండడం, వినియోగంతో పోలీసులు అరెస్ట్ చేశారు. ఆమె వద్ద నుంచి పోలీసులు 53 గ్రాముల కొకైన్, రూ.10 వేల నగదు అదేవిధంగా రెండు మొబైల్ ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. రాయదుర్గం ఇన్‌స్పెక్టర్ సీహెచ్ వెంకన్న తెలిపిన వివరాల ప్రకారం.. వైద్యురాలు ఇటీవల ముంబైకి చెందిన వాంష్ ధక్కర్ అనే వ్యక్తికి కొకైన్ కోసం ఆర్డర్ ఇచ్చినట్లుగా తెలిపారు. శుక్రవారం, వాంష్ ఒక ఏజెంట్ బాలకృష్ణ ద్వారా 53 గ్రాముల కొకైన్ ఉన్న పార్శిల్‌ను నమ్రతకు డెలివరీ చేయడానికి పంపాడు. సమాచారం మేరకు రాయదురంలో బాలకృష్ణ నుండి పార్శిల్ తీసుకుంటున్నప్పుడు నమ్రతను తాము పట్టుకున్నట్లు వెల్లడించారు. నమ్రత, బాలకృష్ణ, వంశ్‌లపై ఎన్‌డీపీఎస్ చట్టం కింద కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

## జొమాటో డెలివరీ బాయ్‌పై దాడి

**హైదరాబాద్, మే 10 (జనం సాక్షి) :**

అకారణంగా జొమాటో డెలివరీ బాయ్‌పై దాడికి పాల్పడిన హోటల్ సిబ్బందిపై బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో కేసు నమోదయింది. వివరాల్లోకి వెళ్తే.. బంజారాహిల్స్ రోడ్ నెం 2లో నివాసం ఉంటున్న ప్రభాత్‌కుమార్(33) అనే వ్యక్తి జొమాటో డెలివరీ బాయ్‌గా పనిచేస్తుంటాడు. విధి నిర్వహణలో భాగంగా బంజారాహిల్స్ రోడ్ నెం 2లోని పంచకట్టు దోశ హోటల్‌లోని సెల్లార్‌కు వెళ్లిన ప్రభాత్‌కుమార్ తన ఆర్డర్‌ను డెలివరీ తీసుకున్నాడు. బిల్లు మొత్తాన్ని ఆన్‌లైన్‌లో చెల్లించేందుకు ప్రయత్నిస్తుండగా నెట్‌వర్క్ ప్రాబ్లమ్ వల్ల కనెక్ట్ కాలేదు. దీంతో తాను సెల్లార్ నుంచి బయటకు వచ్చి అమౌంట్ పంపిస్తానంటూ ప్రభాత్‌కుమార్ చెప్పాడు. దీంతో హోటల్ సిబ్బంది ఆగ్రహంతో దుర్భాషలాడడంతో గొడవ ప్రారంభమయింది. మాటామాటా పెరగడంతో హోటల్ సిబ్బంది ప్రభాత్‌కుమార్‌ను చితకబాదారు. ఈ మేరకు బాధితుడు శనివారం బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

## ఔటర్ రింగ్‌రోడ్డుపై ఘోర ప్రమాదం

### కారు మంటల్లో చిక్కుకొని ఇద్దరు సజీవ దహనం

**హైదరాబాద్, మే 10 (జనం సాక్షి)**



ఔటర్ రింగ్ రోడ్డుపై పెద్ద అంబర్‌పేటలో ఘోర ప్రమాదం జరిగింది. బొలెరో వాహనాన్ని కారు ఢీకొట్టింది. దాంతో మంటలు చెలరేగి రెండు వాహనాలి కాలిపోయాయి. శనివారం తెల్లవారుజామున దాదాపు మూడు గంటల సమయంలో ఈ ఘటన జరిగింది. ఆగి ఉన్న బొలెరో వాహనాన్ని టాటా క్వారీ వాహనం ఢీకొట్టడంతో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి రెండు వాహనాలు కాలిపోయాయి. ప్రమాదం సమయంలో కారులో ముగ్గురు వ్యక్తులు ఉన్నారు. ఇందులో ఇద్దరు సజీవ దహనం కాగా.. మరొకరిని మంటల నుంచి కాపాడి దవాఖానకు తరలిస్తున్న సమయంలో ప్రాణాలు కోల్పోయారు. శంషాబాద్ వైపు నుంచి ఘట్కేసర్ వైపు వెళ్తుండగా అబ్దుల్లాపూర్ మెట్ మండలం గండిచెరువు సమీపంలోని ఓఆర్‌ఆర్‌పై ఈ ప్రమాదం చోటుచేసుకుంది. అయితే, ఓఆర్‌ఆర్ అవతలి వైపు ఓ వాహనం ప్రమాదాన్ని గురై డివైడర్‌ను ఢీకొట్టింది. వారికి సహాయం చేసేందుకు బొలెరో వాహనాన్ని పక్కనే ఆపినట్లు సమాచారం. ఈ సమయంలో ఆగి ఉన్న వాహనాన్ని కారు వెనుక నుంచి వచ్చి ఢీకొట్టినట్లు సమాచారం. ప్రమాదంలో రెండు వాహనాలు దాదాపు కాలిపోయాయి. పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. ఆ తర్వాత సమాచారం అందు కున్న అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకొని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు.

అబ్దుల్లాపూర్ మెట్ పోలీసులు ఘటనాస్థలికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. మృతులను హైదరాబాద్‌లోని బహదూర్‌పుర హెచ్‌బీ కాలనీకి చెందిన దీపేశ్ అగర్వాల్ (23), విజయ్‌నగర్ కాలనీకి చెందిన సంచయ్ మల్పాని (22), మూసాపేటకు చెందిన ప్రియాన్షు మిట్టల్ (23)గా పోలీసులు గుర్తించారు.

## హైదరాబాద్‌లో బాణాసంచా కాల్చడం నిషేధం

**హైదరాబాద్, మే 10 (జనం సాక్షి)**



భారత్, పాకిస్తాన్ మధ్య ఉద్రిక్తత పరిస్థితుల దృష్ట్యా హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్ కీలక నిర్ణయం తీసుకున్నారు. హైదరాబాద్, సికింద్రాబాద్ జంట నగరాల్లో బాణాసంచా కాల్చడాన్ని నిషేధిస్తూ సీపీ సీవీ ఆనంద్ ఆదేశాలు జారీ చేశారు. కంటోన్మెంట్ ఏరియాలోనూ బాణాసంచా కాల్చడం పూర్తిగా నిషేధమన్నారు. హైదరాబాద్ సిటీ పోలీస్ చట్టం, 1348 ఫస్లీ (నం. IX) సెక్షన్ 67 (సి) కింద ఆయనకు అప్పగించిన అధికారాలను వినియోగించుకుంటూ ఈ ఆదేశాలు జారీ చేశారు. ఈ ఆదేశాలను ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఈ నిషేధాజ్ఞలు తదుపరి ఆదేశాల వరకు కొనసాగుతాయని తెలిపారు. పెళ్లిళ్లు, పండుగలు, షాపుల ప్రారంభోత్సవాలు వంటి ఏ సందర్భంలోనైనా సరే బాణాసంచా కాల్చడంపై నిషేధం ఉంటుందని తెలిపారు. బాణాసంచా అమ్మేవారికి కూడా హెచ్చరికలు జారీ చేశారు. బాణాసంచా కాల్చితే జైలుకు పంపుతామని పోలీసులు స్పష్టం చేశారు. హైదరాబాద్ నగరంలో బాణాసంచా నిషేధానికి ప్రధాన కారణం దేశంలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులే. దేశ సరిహద్దుల్లో యుద్ధ వాతావరణం నెలకొనడం, నగరంలో భద్రతా చర్యలు కొనసాగుతుండటంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. బాణాసంచా శబ్దాలను పేలుళ్లుగా అన్వయించుకునే ప్రమాదం ఉండటంతో ప్రజల్లో భయాందోళనలు నెలకొనే అవకాశం ఉందన్నారు. ఇది శాంతి భద్రతలకు విఘాతం కలిగించవచ్చు. అంతేకాకుండా, బాణాసంచా శబ్దాలు భద్రతా దళాలపై అనవసరమైన ఒత్తిడిని కలిగిస్తాయి. దేశవ్యాప్తంగా కొనసాగుతున్న ఉగ్రవాద కార్యకలాపాల నేపథ్యంలో, బాణాసంచా కాల్చడం వల్ల ఏదైనా అత్యవసర పరిస్థితి ఏర్పడితే స్పందించడం కష్టమవుతుంది.

## అమ్మ ఇచ్చిన రెండో జీవితం

### ఏఐఎన్‌యూలో విభిన్నంగా మాతృదినోత్సవ వేడుకలు

**హైదరాబాద్, మే 10 (జనం సాక్షి)**



ఈ సృష్టిలో అమ్మ అంటేనే త్యాగానికి, అంతులేని ప్రేమకు మారుపేరు. అలా త్యాగం చేసి తమ కిడ్నీలను తమ పిల్లలకు దానం చేసిన కొంతమంది తల్లులను ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నెఫ్రాలజీ అండ్ యూరాలజీ (ఏఐఎన్‌యూ)లో మాతృదినోత్సవం సందర్భంగా ఘనంగా సత్కరించారు. 'అమ్మ ఇచ్చిన రెండో జీవితం' పేరుతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో రెండోసారి పిల్లలకు జీవితాన్ని ప్రసాదించిన తల్లులను గౌరవించారు. మాతృదినోత్సవాన్ని ఏఐఎన్‌యూ ఈ ఏడాది సరికొత్తగా చేసింది. తమ పిల్లల జీవితాలు కాపాడేందుకు కిడ్నీలు దానం చేసిన తల్లుల గాథలను ఆసుపత్రి ద్వారా అందరికీ తెలియజేసింది. ఈ కార్యక్రమంలో వైద్యులు, రోగులు, వారి కుటుంబసభ్యులు పాల్గొన్నారు. కిడ్నీ(మూత్రపిండం) మార్పిడి తర్వాత పూర్తిగా కోలుకున్న అవయవ గ్రహీతలు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. వాళ్లంతా తమ జీవితాలను మాతృమూర్తులు ఏవిధంగా సమూలంగా మార్చేశారో, అంతకుముందు తాము అనారోగ్యంతో ఎంత ఇబ్బంది పడ్డారో అనే విషయాలను వివరించారు. ఈ సందర్భంగా ఏఐఎన్‌యూ మేనేజింగ్ డైరెక్టర్, చీఫ్ కన్సల్టెంట్ యూరాలజిస్ట్ డాక్టర్ సి.మల్లికార్జున మాట్లాడుతూ అవయవదానమనేది ఒక వ్యక్తి వేరేవారికి చేయగలిగిన అతి గొప్పదానమని చెప్పారు. అది నిస్వార్థ గుణానికి తార్కాణమన్నారు. ఈ తల్లులు కేవలం పిల్లలను కని, పెంచడమే కాకుండా వాళ్లకు రెండోసారి జీవితాన్ని ఇచ్చారని డా. మల్లికార్జున కొనియాడారు. అలాంటి గొప్ప త్యాగమూర్తులను మనం సన్మానించుకుంటున్నామని ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ఇలాంటి అవయవదానాల్లో, ముఖ్యంగా తల్లి నుంచి వచ్చినప్పుడు కిడ్నీలు ఎక్కువకాలం పనిచేస్తాయని ఆయన తెలిపారు. అవి రక్తసంబంధీకులది కావడం వల్ల శరీరం వాటిని తిరస్కరించే అవకాశాలు తక్కువని వివరించారు.

వారంతా త్వరగా కోలుకుని, తమ పనులు చేసుకోగల రన్నారు.సీనియర్ కన్సల్టెంట్ నెఫ్రాలజిస్ట్ డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ 'మాతృదినోత్సవం రోజున ప్రపంచవ్యాప్తం గా తల్లులను గౌరవించుకుంటారు. ఈరోజు మనం దీన్ని విభిన్నంగా చేసుకుం టున్నాం. ఈ సన్మానం అనేది మనకు ఎప్పటికీ స్ఫూర్తినిచ్చే ఈ తల్లుల అపూర్వ త్యాగానికి చిన్న నూలుపోగు లాంటిదే' అని అన్నారు.

## జింక మాంసం అమ్ముతున్న ముగ్గురు అరెస్టు

**హైదరాబాద్ :మే 10 (జనం సాక్షి)**



జింక మాంసం అమ్ముతున్న ముగ్గురు వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ ఘటన హైదారాబాద్‌లో శనివారం చోటుచేసుకుంది. మహారాష్ట్రకు చెందిన రిజ్వాన్ అనే వ్యక్తి నుండి హసన్ బక్రాన్ (50) జింక మాంసం కొనుగోలు చేసి హమీద్ బిన్ హఖానీ (53), షేక్ అబ్దుల్ రెహమాన్ బహయ్యా అల్ అమూది (54) కి విక్రయించాడు.

కమిషనర్ టాస్క్ ఫోర్స్ (పశ్చిమ) బృందం శనివారం రైడ్ చేసి ఈ ముగ్గురి స్నేహితులను పట్టుకుంది. ముగ్గురి ఇళ్లపై రైడ్ చేసి జింక మాంసాన్ని స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. తదుపరి చర్య కోసం వారిని అటవీ శాఖకు అప్పగించినట్లు వెల్లడించారు.

## దుబాయ్ రోడ్డు ప్రమాదంలో అల్లీపూర్ వాసి మృతి

**రాయికల్, మే10 (జనంసాక్షి)**



: రాయికల్ మండలంలోని అల్లీపూర్ గ్రామానికి చెందిన రమేశ్ (42)ప్రమాదవశాత్తు శుక్రవారం దుబాయ్ లో జరిగిన రోడ్డుప్రమాదంలో మృతి చెందినట్లు గ్రామస్థులు తెలిపారు. రమేశ్ కొన్ని సంవత్సరాలుగా దుబాయిలోని ఓ బేకరీలోపనిచేస్తున్నాడని, ఈ క్రమంలో రమేశ్ ప్రయాణిస్తున్న ట్రక్కు మరో ట్రక్కును ఢీ కొట్టడంతో అక్కడిక్కడేమృతి చెందినట్లు సమాచారం. ప్రభుత్వం, ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, ఎంపీ అరవింద్ రమేశ్ మృతదేహాన్ని సకాలంలో గ్రామానికి తెప్పించే ప్రయత్నం చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
JANAMSAKSHI DAILY



## డ్రగ్ రాకెట్‌లో చిక్కుకున్న మెక్ గిల్



ఆస్ట్రేలియా దిగ్గజ స్పిన్నర్ స్టువర్ట్ మెక్ గిల్ డ్రగ్ కేసులో ఇరుక్కున్నాడు. డ్రగ్ స్మగ్లింగ్ ఆరోపణలతో అతనికి తాజాగా కోర్టు శిక్ష విధించింది. అయితే అతనికి జైలుకు బదులుగా 22 నెలల ఇంటెన్సివ్ కరెక్షన్స్‌తో పాటు 495 గంటల సామాజిక సేవ చేయాలని ఆదేశించింది. గత రెండునెలల కిందటే ఈ 54 ఏళ్ల స్పిన్నర్ నేరం చేశాడని తేలింది. అయితే అప్పుడు తీర్పును వాయిదా వేసిన కోర్టు.. తాజాగా శిక్షను ఖరారు చేసింది. మెక్ గిల్‌పై డ్రగ్ సప్లై ఆరోపణలు ఉన్నాయి. గత కొంతకాలంగా అతనిపై ఈ కేసు నడుస్తోంది. తాజాగా తీర్పు రావడంతో మెక్ గిల్‌కు శిక్ష ఖరారైంది. నిజానికి 2021 ఏప్రిల్లోనే కేజీ కొకెయిన్‌ను సరఫరా చేయడానికి మెక్ గిల్ ఒప్పందం చేసుకున్నాడు. అయితే అప్పుడు జరిపిన దాడుల్లో తను ఒక పార్టీకి ఈ డ్రగ్‌ను సరఫరా చేయడానికి ఒప్పుకున్నానని తెలిపాడు. అలాగే తనకు ఎవరైతే డ్రగ్ సరఫరా చేస్తాడో తన బావమరిది మారినో సోటిరోపోలస్‌కు పరిచయం చేశాడు. ఈ తతంగానికి సిడ్నీ ఉత్తర తీరంలోని తన రెస్టారెంట్‌ను వేదికగా చేసుకున్నాడు. దాడుల్లో పట్టుబడిన మెక్ గిల్.. అన్యాయంగా తనను ఈ కేసులో ఇరికిస్తున్నారని వాఖ్యానించాడు. ఆ తర్వాత విచారణ అనంతరం తను చేసిన నేరాన్ని అంగీకరించాడు. తన రెస్టారెంట్లో జరిగిన ఈ డీల్.. మెక్ గిల్‌కు తెలియకుండా జరగదని, అధికారులు తగిన సాక్ష్యాలు చూపించడంతో మెక్ గిల్ దారికి వచ్చాడు. మరోవైపు గతేడాది మెక్ గిల్ కిడ్నాపుకు గురైనట్లు కూడా కథనాలు వచ్చాయి. అయితే డ్రగ్ డీల్‌లోనే ఇద్దరు అన్నదమ్ములు ఈ ఘాతుకానికి పాల్పడినట్లు తేలింది. ఒకప్పటి తన సహచరుడు మెక్ గిల్.. ఇలా డ్రగ్ కేసులో చిక్కుకోవడంతో అతనికి బాసటగా మాజీ కెప్టెన్ స్టీవ్ వా నిలిచాడు. అతనికి బాసటగా ఒక లెటర్‌ను కూడా రాశాడు. భవిష్యత్తులో తను ఎలాంటి నేరానికి పాల్పడటంటూ, కష్టపడి పని చేస్తాడని వివరించాడంతో కోర్ట్ కన్విన్స్ అయి శిక్ష తీవ్రతను తగ్గించింది. శుక్రవారం స్థానిక డౌనింగ్ సెంటర్ డిస్ట్రిక్ట్ కోర్టు ఈ శిక్షను ఖరారు చేసింది. ప్రధానంగా లెగ్ స్పిన్నర్ అయిన మెక్ గిల్.. దిగ్గజ స్పిన్నర్ షేన్ వార్న్ నీడన ఉండిపోయాడు. వీరిద్దరూ ఒకే సమయంలో కెరీర్ మొదలు పెట్టడంతో వార్న్.. లేని సమయాల్లో మాత్రమే గిల్‌కు అవకాశం దక్కింది. ఈ క్రమంలో 44 టెస్టులు, 3 వన్డేలు ఆడిన మెక్ గిల్ ఓవరాల్‌గా 214 వికెట్లు తీశాడు. అతని అత్యుత్తమ బౌలింగ్ ప్రదర్శన 8/108 కావడం విశేషం. 1998 నుంచి 2008 వరకు దాదాపు 11 సంవత్సరాలు ఆసీస్ తరపున మెక్ గిల్ ప్రాతినిథ్యం వహించాడు.

## చిక్కుల్లో అంబటి రాయుడు



భారత్-పాకిస్తాన్ ఉద్రిక్తతల నేపథ్యంలో గురువారం ఐపీఎల్ మ్యాచ్‌ను నిలిపివేశారు. ఇప్పుడు ఏకంగా ఐపీఎల్ 2025నే వాయిదా వేస్తున్నట్టు ప్రకటించారు. 'ఆపరేషన్ సింధూర్' తర్వాత రెండు దేశాల సైన్యాల మధ్య వార్ నడుస్తోంది. పాకిస్తాన్ ప్రతి దుష్ట ప్రయత్నానికి భారత సైన్యం తగిన విధంగా సమాధానం ఇస్తోంది. టీమ్ ఇండియా క్రికెటర్లు కూడా నిరంతరం దేశ సైన్యానికి ధైర్యం చెబుతున్నారు. ఇదే సమయంలో మాజీ భారత క్రికెటర్ అంబాటి రాయుడు చేసిన ఒక పోస్ట్ దుమారం రేపింది.అంబాటి రాయుడు 'X' లో మే 8న ఒక పోస్ట్ చేశాడు. పాకిస్తాన్ భారతదేశంపై డ్రోన్, క్షిపణుల దాడి చేసిన సమయంలో ఈ పోస్ట్ చేశాడు. భారత సైన్యాల వాయు రక్షణ వ్యవస్థ ఈ దాడులను తప్పికొట్టాయి. పాకిస్థాన్ దుష్ట పన్నాగాలపై భారత దేశం ఘాటుగా స్పందిస్తున్న వేళ రాయుడు, "కన్నుకు కన్ను అంటే ప్రపంచమంతా అంధకారమవుతుంది." అని ట్వీట్ చేశాడు. ఆయన పోస్టుపై నెటిజన్లు ఫైర్ అయ్యారు. ఒక నెటిజన్ వెంటనే ట్వీట్‌ను తొలగించమని కోరాడు. మరొకరు, మనం అలా అనుకుంటున్నంత వరకు మన రెండు కళ్ళు పోతాయని అన్నారు. వివాదం పెరుగుతున్న విషయాన్ని గమనించిన రాయుడు మరో పోస్ట్ చేసి నష్ట నివారణకు ప్రయత్నించాడు. ఆయన రాశారు-"జమ్మూ కాశ్మీర్, పంజాబ్, భారత సరిహద్దులోని ఇతర ప్రాంతాలలో అందరి భద్రత, శాంతి కోసం ప్రార్థన చేస్తున్నాను. దీనితో ప్రభావితమైన ప్రతి ఒక్కరికి బలాన్ని, భద్రతను, త్వరితగతిన కోలుకునే శక్తి ఇవ్వాలాని ఆశిస్తున్నాను. జై హింద్." అని పోస్టు చేశాడు.

### మణికొండలో నిబంధనలకు విరుద్ధంగా

## అక్రమ నిర్మాణాలు


**అధికారుల అండదండలతో ఇష్ట రాజ్యాంగ బిల్డర్ల నిర్మాణాలు**



**రాజేంద్రనగర్, మే 10 (జనం సాక్షి) :** మణికొండ మున్సిపాలిటీలో అక్రమ నిర్మాణాలకు హద్దు అదుపు లేకుండా పోయింది. మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని కులీ కుతుబ్ షా , పంచవటి, గో గ్రీన్ కాలనీ,మణికొండ జాగీర్, సెక్రటేరియట్, కుందన్ నగర్, అయా కాలనీలలో అనుమతులకు విరుద్ధంగా స్టీల్ ం5,6 నిర్మాణాలు చేపడుతున్నారు. కులీ కుతుబ్ షా కాలనీలో ఓ నిర్మాణదారుడు టౌన్ ప్లానింగ్ అధికారి అండదండలతో కేవలం 200 లో జి ం2 అనుమతులు ఉన్నా ,జిం5 నిర్మాణాలు కనీసం సెట్‌బాక్స్ కూడా లేకుండా చేపడుతున్నారు. మున్సిపాలిటీ నిబంధనల ఉల్లంఘనకు పాల్పడుతూ ఇష్టానుసారంగా నిర్మాణాలు చేపడుతున్న టౌన్ ప్లాన్ అధికారులు, సిబ్బంది చూసి చూడనట్టు వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇక మున్సిపాలిటీలో వందల కొద్ది అక్రమ నిర్మాణాలు వెలుస్తున్నా టౌన్ ప్లానింగ్ అధికారులు, సిబ్బంది మాత్రం చోద్యం చూస్తున్నారు. మున్సిపాలిటీ పరిధిలో ఈ కోకోల అక్రమ నిర్మాణాల అనుమతులు ఒకలా తీసుకొని బిల్డర్లు ఇష్టాను సారంగా జిం5,6 అంతస్తులు నిర్మాణాలు శరవేగంగా చేపడుతున్నారు. దీనికి సంబంధిత కాలనీవాసు ల ఫిర్యాదులు ఆయా డిపార్ట్మెంట్లో చెల్లకుండా టౌన్ ప్లానింగ్ అధికారులు, సిబ్బంది సలహాలతో నిర్మాణం పూర్తి కాకుండానే పెయింటింగ్ పనులు గంటల వ్యవధిలోనే పూర్తి చేసుకుంటూ భవన నిర్మాణం లోని పనులు చేపడుతున్నారు. ఈ సెట్ బాగ్స్ లేని, అత్యవసర పరిస్థితుల్లో ప్రమాదాల బారి నుండి తమను తాను కాపాడేందుకు అగ్ని మాపక సేఫ్టీ సిస్టం అనుమతులు లేకున్నా శరవేగంగా నిర్మాణాలు చేపట్టి అమ్ముకొని బయటపడుతున్నారు. పేద మధ్య తరగతి ప్రజలు బ్యాంకుల ద్వారా లోన్ల తో అప్పులు చేసి ఇలాంటి అపార్ట్మెంట్లలో ఇళ్ళు కొనుక్కొన్న ప్రజలు ఇబ్బందులు పడుతూ అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. ఇప్పటికైనా అనుమతులకు విరుద్ధంగా వెలుస్తున్న అక్రమ నిర్మాణాలను మున్సిపాలిటీ కమిషనర్, సిడిఎంఏ, హెచ్ఎండిఏ, టాస్క్ ఫోర్స్ అధికారులు దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని మున్సిపాలిటీ ప్రజలు కోరుతున్నారు.









## టెస్టు కెప్టెన్సీ పగ్గాలు

# దక్కేదెవరికి?

- బీసీసీఐ మీడియా సమావేశంతో కొత్త కెప్టెన్‌ను ప్రకటించే అవకాశం.
- కెప్టెన్సీ రేసులో శుభ్‌మన్ గిల్ ముందంజ
- జస్ప్రీత్ బుమ్రాకు అడ్డంకిగా గాయాలు
- గిల్, బుమ్రాతో పాటు రిషభ్ పంత్, కేఎల్ రాహుల్, శ్రేయస్ అయ్యర్ పేర్లు కూడా చర్చలో ఉన్నాయి.
- బుమ్రా గైర్హాజరైతే బౌలింగ్ బాధ్యత మహ్మద్ సిరాజ్, ఆకాశ్ దీప్‌లపై.
- బ్యాటింగ్‌లో గిల్, యశస్వి జైస్వాల్, పంత్ కీలకం.

### రోహిత్ శర్మ రిటైర్మెంట్‌తో టీమ్ ఇండియా కొత్త అధ్యాయం

*రోహిత్ శర్మ టెస్టు క్రికెట్ నుంచి రిటైర్ అయిన తర్వాత, టీమ్ ఇండియా కొత్త టెస్టు కెప్టెన్‌గా శుభ్‌మన్ గిల్ పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. బీసీసీఐ మే 23, 2025న కొత్త కెప్టెన్‌ను ప్రకటించనుందని, ఈ సందర్భంగా మీడియా సమావేశం ఏర్పాటు చేసినట్లు సమాచారం. గిల్, ఐపీఎల్‌లో గుజరాత్ టైటాన్స్‌కు సారథ్యం వహిస్తూ ఆకట్టుకున్నారు మరియు భారత టెస్టు జట్టులో 32 మ్యాచ్‌లలో 1893 పరుగులతో (సగటు 35.05) స్థిరత్వం చూపారు.జస్ప్రీత్ బుమ్రా కూడా కెప్టెన్సీ రేసులో ఉన్నప్పటికీ, అతని గాయాల సమస్యలు మరియు బహుళ ఫార్మాట్‌లలో వర్క్‌లోడ్ కారణంగా గిల్ ముందంజలో ఉన్నట్లు తెలుస్తోంది. బుమ్రా గతంలో మూడు టెస్టుల్లో సారథ్యం వహించినప్పటికీ, ఇటీవలి వెన్ను గాయం అతని అవకాశాలను దెబ్బతీసింది. ఇతర అభ్యర్థులలో రిషభ్ పంత్, కేఎల్ రాహుల్, శ్రేయస్ అయ్యర్ పేర్లు కూడా చర్చలో ఉన్నాయి, కానీ గిల్ ప్రస్తుతం ఫేవరెట్‌గా కనిపిస్తున్నారు. జూన్ 20, 2025 నుంచి ఇంగ్లండ్‌లో జరిగే ఐదు టెస్టుల సిరీస్‌తో కొత్త కెప్టెన్ తన సారథ్యాన్ని ప్రారంభించే అవకాశం ఉంది. అయితే, బీసీసీఐ అధికారిక ప్రకటన వెలువడే వరకు ఇది ఊహాగానాలుగానే ఉంది.*

టీమ్ ఇండియా స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లీ టెస్టు క్రికెట్ నుంచి రిటైర్మెంట్ ప్రకటించే ఆలోచనలో ఉన్నట్లు సమాచారం. ఈ విషయాన్ని ఆయన ఇటీవల బీసీసీఐకి తెలియజేసినట్లు తెలుస్తోంది. జూన్‌లో ఇంగ్లండ్ పర్యటనకు ముందే టెస్టు క్రికెట్‌కు వీడ్కోలు చెప్పాలని కోహ్లీ భావిస్తున్నారని, ఈ మేరకు బీసీసీఐని కోరినట్లు వార్తలు వస్తున్నాయి. అయితే, బీసీసీఐ ఈ నిర్ణయంపై మరోసారి ఆలోచించాలని కోహ్లీకి సూచించినట్లు సమాచారం. 36 ఏళ్ల విరాట్ కోహ్లీ ఇప్పటివరకు 123 టెస్టు మ్యాచ్‌లు ఆడి, 46.85 సగటుతో 9,230 పరుగులు సాధించారు. ఇందులో 30 సెంచరీలు, 31 అర్ధ సెంచరీలు, 7 డబుల్ సెంచరీలు ఉన్నాయి. 2014లో టెస్టు కెప్టెన్‌గా నియమితులైన ఆయన, 68 టెస్టుల్లో భారత్‌ను నడిపించి, 40 విజయాలతో 58.82% విజయ శాతాన్ని నమోదు చేశారు. గత ఏడాది టీ20 వరల్డ్ కప్ తర్వాత టీ20 ఫార్మాట్ నుంచి రిటైర్ అయిన కోహ్లీ, ప్రస్తుతం టెస్టులు, వన్డేల్లో కొనసాగుతున్నారు. ఇటీవల ఆస్ట్రేలియాతో జరిగిన బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో కోహ్లీ ఫామ్‌లో లేకపోవడం గమనార్హం. ఐదు టెస్టుల్లో కేవలం 190 పరుగులు మాత్రమే చేశారు. పెర్త్‌లో సెంచరీ సాధించినప్పటికీ, తర్వాతి మ్యాచ్‌లలో పెద్దగా రాణించలేకపోయారు. స్లిప్‌లో 8 సార్లు క్యాచ్ ఇవ్వడం ఆయన బలహీనతను బయటపెట్టింది. ఇంగ్లండ్ పర్యటనతో 2025-27 వరల్డ్ టెస్టు ఛాంపియన్‌షిప్ ప్రారంభం కానుంది. కోహ్లీ రిటైర్మెంట్ ప్రకటిస్తే, యువ ఆటగాళ్లతో కూడిన జట్టుతో ఇంగ్లండ్‌కు వెళ్లే అవకాశం ఉంది. ఇటీవల రోహిత్ శర్మ కూడా టెస్టు క్రికెట్ నుంచి రిటైర్ అయిన నేపథ్యంలో, సీనియర్ ఆటగాళ్లు లేని లోటు టీమ్ ఇండియాకు సవాల్‌గా మారనుంది. ఈ నేపథ్యంలో, కోహ్లీని ఒప్పించి జట్టులో ఉంచేందుకు బీసీసీఐ ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది.

### టీమ్ ఇండియా కొత్త టెస్టు కెప్టెన్ ప్రకటన మే 23న?

రోహిత్ శర్మ టెస్టు క్రికెట్ నుంచి రిటైర్ అయిన తర్వాత, టీమ్ ఇండియా కొత్త టెస్టు కెప్టెన్ ఎవరనేది ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. క్రిక్‌బజ్ నివేదిక ప్రకారం, బీసీసీఐ మే 23న కొత్త కెప్టెన్‌ను ప్రకటించనుంది. ఈ ప్రకటన కోసం మీడియా సమావేశం కూడా ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది. ఇంగ్లండ్‌లో జూన్ 20 నుంచి ఐదు టెస్టుల సిరీస్ కోసం భారత జట్టు పర్యటనకు వెళ్లనుంది. ఈ పర్యటనకు ముందు కొత్త కెప్టెన్‌ను ప్రకటించనున్నారు. కెప్టెన్సీ రేసులో యువ బ్యాటర్ శుభ్‌మన్ గిల్ ముందంజలో ఉన్నట్లు సమాచారం. బుమ్రా గాయాల సమస్యల కారణంగా కెప్టెన్సీ రేసులో వెనుకబడినట్లు తెలుస్తోంది. గిల్, టెస్టు, వన్డే ఫార్మాట్‌లలో నిరంతరం ఆడుతూ జట్టులో స్థిరత్వం చూపిస్తున్నారు.

ఇదిలా ఉంటే, విరాట్ కోహ్లీ టెస్టు క్రికెట్ నుంచి రిటైర్ కావాలని ఆలోచిస్తున్నారని, ఈ విషయంపై బీసీసీఐతో చర్చించినట్లు తెలుస్తోంది. అయితే, జట్టు యాజమాన్యం కోహ్లీని జాగ్రత్తగా ఆలోచించాలని కోరింది. ఇంగ్లండ్‌లో గతంలో అద్భుతంగా రాణించిన కోహ్లీని జట్టులో ఉంచాలని బీసీసీఐ భావిస్తోంది.

### టీమ్ ఇండియా టెస్టు కెప్టెన్‌గా బుమ్రా సరైన వ్యక్తి: మదన్ లాల్

మాజీ క్రికెటర్ మదన్ లాల్, టీమ్ ఇండియా టెస్టు కెప్టెన్‌గా స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రాను నియమించాలని సూచించారు. రోహిత్ శర్మ టెస్టు క్రికెట్ నుంచి రిటైర్ అయిన నేపథ్యంలో, బుమ్రాకు సుదీర్ఘ ఫార్మాట్‌లో జట్టును నడిపించే సామర్థ్యం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. వైస్-కెప్టెన్‌గా యువ ఆటగాళ్లకు అవకాశం ఇవ్వాలని కూడా సూచించారు."బుమ్రా ఫిట్‌గా ఉంటే, టెస్టు కెప్టెన్‌గా అతనే ఉత్తమ ఎంపిక. యువ ఆటగాళ్లను వైస్-కెప్టెన్‌గా నియమించవచ్చు," అని మదన్ లాల్ పేర్కొన్నారు. రోహిత్ రిటైర్మెంట్ నిర్ణయాన్ని సమర్థిస్తూ, ఆయన బాగా ఆలోచించి ఈ నిర్ణయం తీసుకున్నారని అన్నారు. బుమ్రా గతంలో మూడు టెస్టుల్లో భారత్‌కు కెప్టెన్‌గా వ్యవహరించారు, ఒక విజయం, రెండు ఓటములు సాధించారు. అయితే, గాయాల సమస్యలు బుమ్రాను వెంటాడుతున్నాయి. బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో అతని సారథ్యంలో భారత్ శుభారంభం చేసినప్పటికీ, వెన్ను గాయం కారణంగా ఆఖరి మ్యాచ్‌లో ఆడలేకపోయారు. ఈ గాయాల కారణంగా వర్క్‌లోడ్ మేనేజ్‌మెంట్‌లో భాగంగా ఇంగ్లండ్ టూర్‌లో ఐదు టెస్టులకు ఆడటం అనుమానంగా ఉంది.



## ఎంపీ వద్దిరాజు కరాటే పోటీల పోస్టర్ ఆవిష్కరణ

**ఖమ్మం (జనంసాక్షి) :** రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర 30వ జాతీయ స్థాయి కరాటే ఛాంపియన్ షిప్ పోటీల పోస్టర్లను ఆవిష్కరించారు. ఎంపీ రవిచంద్ర తల్లిదండ్రులు వద్దిరాజు నారాయణ-వెంకట నర్సమ్మ జ్ఞాపకార్థం సుమన్ షోటోఖాన్ స్పోర్ట్స్ కరాటే-దూ అకాడమీ ఇండియా ఈ పోటీలను నిర్వహిస్తున్నాయి. అకాడమీ జాతీయ అధ్యక్షులు, ఎంపీ రవిచంద్ర సౌజన్యంతో ఈ పోటీలు జరుగుతాయి. ఖమ్మం వర్తక సంఘం భవనం ప్రాంగణంలో వచ్చే నెల (జూన్) ఒకటవ తేదీన ఉదయం 9 గంటలకు ఎంపీ వద్దిరాజు, అకాడమీ ఛైర్మన్ ప్రముఖ సినీ హీరో సుమన్ తల్వార్ లు ముఖ్య అతిథులుగా హాజరై ఈ పోటీలను ప్రారంభిస్తారని జల్లెల శ్రీనివాసరావు తెలిపారు.

## వరుసగా మూడో పతకం..



ప్రతిష్ఠాత్మక ఆర్చరీ వరల్డ్ కప్‌లో భారత ఆర్చర్ మధుర ధమన్‌గాంకర్ చరిత్ర సృష్టించింది. వరల్డ్ కప్‌లో ఇప్పటికే రెండు పతకాలు గెలిచిన తను.. పసిడితో తన కలను సాకారం చేసుకుంది. మూడేళ్ల విరామం తర్వాత పోటీపడిన ఆమెకు విశ్వవేదికపై ఇదే తొలి స్వర్ణం కావడం విశేషం. శనివారం జరిగిన ఆర్చరీ వరల్డ్ స్టేజ్ 2 ఫైనల్లో మధుర గురి తప్పకుండా బాణాలు సంధించింది. అమెరికాకు చెందిన కార్సన్ క్రాహేను 139 -138 పాయింట్లతో ఓడించింది.

చైనాలోని షాంఘైలో జరుగుతున్న ఆర్చరీ వరల్డ్ కప్ స్టేజ్ 2లో ముంబైకి చెందిన మధుర అదరగొట్టింది. ప్రపంచ స్థాయి క్రీడాకారిణులతో పోటీపడుతూ ఫైనల్‌కు దూసుకెళ్లింది. ఆమెరికా ఆర్చర్ కార్సన్ క్రాహేకు సవాల్ విసిరిన మధుర.. గురి చూసి లక్ష్యాన్ని చేరుకుంది. మూడో రౌండ్‌లో81-85తో వెనకబడినప్పటికీ ఒత్తిడికి లోనవ్వలేదు. వరుసగా రెండుసార్లు 10 పాయింట్లు సాధించి ప్రత్యర్థికి షాకిచ్చింది. ఆఖరి రౌండ్‌లో 9 పాయింట్లతో కార్సన్‌ను వెనక్కి నెట్టి.. స్వర్ణ పతకం గెలుచుకుంది. తద్వారా విశ్వ వేదికపై తొలి బంగారు పతకంతో మురిసిపోయిందీ యువ ఆర్చర్. మూడేళ్లుగా అంతర్జాతీయ టోర్నీలో పాల్గొనకపోవడంతో 24 ఏళ్ల మధర అన్ సీడెడ్‌గా ఈ పోటీల్లో బరిలోకి దిగింది. ఈవెంట్‌లో మహిళల టీమ్ ఈవెంట్‌లో వెండి, కాంపౌండ్ మిక్స్‌డ్ విభాగంలో అభిషేక్ వర్మతో కలిసి దేశానికి కాంస్యం అందించింది మధుర.

### సురక్షితంగా బెంగళూరుకు

## ఆర్సీబీ క్రికెటర్లు

ఆపరేషన్ సిందూర్ తర్వాత సరిహద్దుల్లో ఉద్రిక్తతలు నెలకొనడం.. ఐపీఎల్ 18వ సీజన్ వాయిదాతో పలు దేశాలు తమ క్రికెటర్ల భద్రత గురించి ఒకింత ఆందోళన చెందాయి. కొన్ని బోర్డులు అయితే తమ ప్లేయర్లను స్వదేశానికి రావాల్సిందిగా కోరాయి. యుద్ధ వాతావరణం మధ్యలోనే ఢిల్లీ, పంజాబ్ క్రికెటర్లను ప్రత్యేక రైలులో ఢిల్లీకి తరలించింది బీసీసీఐ. తద్వారా ఆటగాళ్ల భద్రత మా బాధ్యత అని చాటుకుంది. తాజాగా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు సైతం తమ ఆటగాళ్లు, సిబ్బంది సురక్షితంగా ఉన్నారని తెలిపింది. వారంతా క్షేమంగా బెంగళూరకు చేరుకున్నారని శనివారం ఎక్స్ వేదికగా ఆర్సీబీ యాజమాన్యం వెల్లడించింది. 'మా జట్టు క్రికెటర్లు, సహాయక సిబ్బంది సురక్షితంగా బెంగళూరుకు చేరుకున్నారు. ఇక్కడి నుంచి వారు తమ తమ నగరాలకు వెళ్లనున్నారు. విదేశీ ఆటగాళ్లు, సిబ్బంది తమ దేశానికి బయల్దేరనున్నారు. ఉత్కంఠ నెలకొన్న ఈ పరిస్థితుల్లో మా అందర్నీ క్షేమంగా తరలించిన బీసీసీఐ, స్థానిక అధికారులు, పోలీసులకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం' అని ఆర్సీబీ యాజమాన్యం ఎక్స్ పోస్ట్‌లో రాసుకొచ్చింది.

## శంషాబాద్ పరిధిలో డ్రోన్‌ల ఎగరవేత నిషేధం : సైబరాబాద్ సిపి

**శేరిలింగంపల్లి, మే 10 (జనంసాక్షి) :** భారతదేశంలో ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా, భద్రతా కారణాలవల్ల శంషాబాద్ రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్పోర్ట్ పరిధిలో డ్రోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ సామాగ్రి వినియోగానికి, ఎగురవేతకు అనుమతి లేదని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాష్ మహంతి తెలిపారు. ఈ మేరకు శనివారం సాయంత్రం ఆయన ఒక పత్రిక ప్రకటనను విడుదల చేశారు. ప్రస్తుతం భారతదేశం యుద్ధ వాతావరణం లో ఉందని, రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్పోర్ట్ కు దాడులు జరిగే అవకాశం ఉన్నందున ఎయిర్పోర్టుకు చుట్టూ 10 కిలోమీటర్ల మేర డ్రోన్లు, పారా గ్లైడింగ్, రిమోట్ కంట్రోల్ మైక్రోలైట్ హెలికాప్టర్స్ తదితర ఎలక్ట్రానిక్ సంబంధ పరికరాల వినియోగం పూర్తిగా నిషేధమని సిపి పేర్కొన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా ఇలాంటి డ్రోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాల వినియోగాన్ని నిర్వహించినట్లయితే వారు చట్టరీత్యా శిక్షకు అర్హులవుతారని సిపి వెల్లడించారు. ఈ నిబంధన శనివారం నుండి జూన్ 9వ తేదీ వరకు అమలులో ఉంటుందన్నారు. శంషాబాద్ పరిసర ప్రాంతాల ప్రజలు, సైబరాబాద్ కమిషనరేట్ పరిధి ప్రజలు గమనంలో ఉంచుకోవాలని సిపి సూచించారు.

## వీర మరణం పొందిన జవాన్లకు ఘన నివాళులు

- ఎల్‌హెచ్‌పిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు,మాజీ జెడ్పిటిసి దశరథ్ నాయక్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ
- వీర మరణం పొందిన జవాన్లకు పార్టీలకతీతంగా ఘన నివాళులు



**కడ్తాల్ మే 10 (జనంసాక్షి):**
భారత్ పాకిస్థాన్ యుద్ధంలో వీర మరణం పొందిన సైనికులు మురళి నాయక్,సచిన్ యాదవ్ లకు కడ్తాల్ మండల కేంద్రంలో ఎల్ హెచ్ పి ఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జర్పుల దశరథ్ నాయక్ ఆధ్వర్యంలో ఘన నివాళులర్పించారు.జాతీయ జెండాలతో పార్టీలకు అతీతంగా భారీ ర్యాలీ నిర్వహించి సైనికులకు తాము ఉన్నామని భరోసా కల్పించారు.ఈ సందర్భంగా దశరథ్ నాయక్ మాట్లాడుతూ పాకిస్తా న్ టెర్రరిస్టులు ప్రపంచ శాంతికి విగాథం కలిగిస్తున్నారని అన్నారు.దేశంలో ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న పాకిస్తాన్‌కు భారత్ ఆపరేషన్ సింధూర్ పేరుతో సరైన బుద్ధి చెబుతుందని అన్నారు.పాకిస్తాన్లో టెర్రరిస్ట్ లు చనిపోతే పాకిస్తాన్ ప్రభుత్వం వాళ్ల సైన్యం ఉగ్రవాదులకు లాంచనప్రాయంగా అంత్య క్రియలు నిర్వహించడం సిగ్గుచేటని మండిపడ్డారు.యుద్ధంలో వీరమరణం పొందిన సైనికుల కంటే టెర్రరిస్టులకే ఎక్కువ ప్రధాన్యత ఇస్తుందని అన్నారు.ఇప్పటికైనా పాకిస్తాన్ క్షమాపణ చెప్పి వెనకడుగు వేయకపోతే భారత్ చేతిలో కుక్కచావు చావడం ఖాయం అని అన్నారు.పాకిస్తాన్ ని మట్టి లో కల్పించడానికి భారతదేశ సైనికులు అవసరం లేదని కేవలం భారతదేశంలో ఉన్న మహిళలే చాలని అన్నారు.భారత మహిళలు తలుచుకుంటే ప్రపంచ పటంలో పాకిస్తాన్ అనే పేరే ఉండదని తెలిపారు.భారతదేశం ఎవరి జోలికి వెళ్ళదని తన జోలికి ఎవ్వరు వచ్చిన వదిలిపెట్టే ప్రసక్తి లేదని తెలిపారు.యుద్ధంలో వీరమరణం పొందిన మురళి నాయక్,సచిన్ యాదవుల మరణం వృధా కానివ్వమనీ దానికి ప్రతి కారం కచ్చితంగా భారత సైన్యం తీసుకుంటుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్,మాజీ సర్పంచులు తులసి రామ్ నాయక్,లోకేష్ నాయక్,బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎర్రోళ్ల రాఘవేందర్, రాందాస్ నాయక్, పాండు నాయక్, మన్యా నాయక్, రవీందర్ రెడ్డి, రామచంద్రయ్య, భగీరథ జైపాల్ నాయక్, కళ్యాణ్ నాయక్, రమేష్ నాయక్, సరియా నాయక్, మధు, సురేష్, సతీష్, శ్యామ్, శంకర్, రవి నాయక్, మహేష్, వెంకటేష్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రేయసితో పబ్లిక్‌గా చక్కర్లు కొడుతున్న గబ్బర్



శిఖర్ ధావన్, అతని ప్రేయసి సోఫీ షైన్ మరోసారి అభిమానుల దృష్టిని ఆకర్షించారు. వీరిద్దరూ ఇటీవల ఎక్కడో కనిపించినట్లు, ఈ జంట తమ సంబంధం గురించి గోప్యంగా సంకేతాలు ఇచ్చినప్పటికీ, ఇప్పుడు వారు ఒకరికొకరు సహజంగా, ప్రేమలో ఉన్నట్లు కనిపించారు. ఈసారి, వారు తమ ప్రేమను దాచుకోవాలని కోరుకోకుండా, పూర్తిగా ఎంజాయ్ చేస్తూ కలిసి కనిపించారు. శిఖర్ ధావన్ తన ప్రేయసితో విమానాశ్రయం ప్రదేశంలో బయటకు నడుస్తూ కనిపించాడు. గబ్బర్ ఎర్రటి బాలెన్సియాగా టీ షర్ట్, నల్ల జాగర్లు, ఎర్రటి స్నీకర్లతో చాలా స్టైలిష్ గా కనిపించాడు. తన సిగ్నేచర్ సన్నీలను ధరించి, ధావన్ తన ప్రత్యేకమైన స్టైల్ చూపిస్తూ, ఏదైనా అతను ధరించిన దుస్తులలో ప్రశంసలు పొందేవాడిగా కనిపించాడు. అదే సమయంలో, సోఫీ షైన్ కూడా తన స్టైలిష్ లుక్‌లో కనిపించింది. పౌడర్-బ్లూ షర్ట్, రిలాక్స్-ఫిట్ జీన్స్, డార్క్ షేడ్స్‌తో ఆమె సున్నితమైన శైలిలో కూల్‌గా కనిపించింది. గత ఏడాది, శిఖర్ ధావన్ తన భార్య ఆయేషా ముఖర్జీతో విడిపోయిన తర్వాత, చాలా నిశ్శబ్దంగా ఉండే ప్రయత్నం చేశారు. అయితే, సోఫీ షైన్ ఈ జంట ప్రేమకథను బయటపెట్టాలని నిర్ణయించుకుంది. గత వారం, సోఫీ తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో "నా" అంటూ ఒక మధురమైన పోస్ట్ పంచుకుంది. ఈ పోస్ట్ అభిమానులందరినీ ఆశ్చర్యపరిచింది, ఎందుకంటే ఈ విధంగా ఆమె ఈ ప్రేమను అధికారికంగా ప్రకటించింది.ఇంతవరకు, శిఖర్-సోఫీ ఈ ప్రేమకథను జూన్ 2023లో ప్రారంభించారు. మొదట, ధావన్ సోఫీ షైన్ పోస్ట్‌లలో ఒకదాన్ని లైక్ చేయడంతో ఈ కథ మొదలైంది. మొదటి చూపులో అది ఒక సాధారణ స్నేహం వంటిదిగా కనిపించగా, తరువాత అది ఒక ప్రేమకథగా మారింది. ఈ జంట దుబాయ్‌లో కలిసినట్లు చెబుతున్నారు, అక్కడ వారు స్నేహితులుగా మొదలయ్యారు, అయితే తరువాత వారి మధ్య ఉన్న అనుబంధం మరింత బలపడింది.ఈ జంట ప్రస్తుతం ఒక సంవత్సరం పాటు కలిసి ఉంటున్నట్లు సమాచారం. అందువల్ల, వారు తరచూ కలిసి కనిపించడం, తమ ప్రేమను వ్యక్తం చేయడం కొనసాగిస్తుంటారు.

# కాల్పుల విరమణ ఉల్లంఘనలో పాక్‌ రికార్డు

- ఏనాడూ ఒప్పందాలను పట్టించుకోని దాయాది
- ఉగ్రమూకలను ఉసిగొల్పుతూ...దాడులకు పాల్పడే నైజం
- తాజా కాల్పుల విరమణకు కట్టుబడి ఉంటుందా అన్నదీ అనుమానమే



**న్యూఢిల్లీ, మే10 (జనంసాక్షి) :** పాక్‌ ఎప్పుడూ నమ్మదగిన శత్రువు కాదు. నిరంతరంగా పక్కలో బల్లెంలానే వ్యవహరించింది. అనేక యుద్ధాల్లో ఓడినా దానికి బుద్ది రాలేదు. ఎప్పుడూ కయ్యానికి కాలు దువ్వడం అలవాటు చేసుకుంది. ఉగ్రవాదులను పెంచి పోషించి, భారత్‌లో మారణహోమం సృష్టించడం ఆనవాయితీగా పెట్టుకుంది. అయితే పహల్గామ్‌ ఊచకోత తరవాత భారత్‌ గట్టిగా సమాధానం ఇవ్వడంతో దెబ్బకు దయ్యం వదిలింది. అయితే ఉగ్రమూకలను పోషించకుండా పాక్‌ ఉంటుందా..అక్కడి సైన్యం ఉండనిస్తుందా అన్నదే సమస్య. అయితే ఏ మాత్రం ఉగ్రచర్యలకు దిగినా భారత్‌ మరోమారు సైనిక చర్యకు దిగడం ఖాయం. ఇదిపాక్‌కు కూడా తెలుసు. కాల్పుల విరమణలో ఇది ప్రధాన అంశం కానుంది. నిజానికి దీనిని పూర్తిస్థాయి యుద్దానికి తీసుకుని వెళ్లి పాక్‌ భరతం పట్టాలని ప్రధాని మోడీ గట్టి పట్టుదలతో ఉన్నా అంతర్జాతీయంగా వచ్చి ఒత్తిళ్లకు తలొగ్గక తప్పలేదు. ఇకముందు కాశ్మీర్‌ లేదా భారత్‌లో ఎలాంటి ఉగ్ర చర్యలు జరిగినా అందుకు పాక్‌ భారీ మూల్యం చెల్లించుకోక తప్పదు. ఇకపోతే కాల్పుల విరమణ జరిగినా భారత్‌ తీసుకున్న అష్టదిగ్బంధన చర్యలు మాత్రం యధావిధిగా కొనసాగే అవకాశం ఉంది. అందులో సింధూజలాల ఒప్పందం రద్దు, సిమ్లా ఒప్పందం రద్దు వంటివి ఉన్నాయి. భారత్‌, పాక్‌ల మధ్య1980 నుంచి ఉద్రిక్తతలు మొదలయ్యాయి. కాగా.. 2010 నుంచి 2020 సెప్టెంబర్‌ వరకు దాదాపు 11,572 సార్లు పాకిస్థాన్‌ సరిహద్దుల్లో శాంతి ఒప్పందాన్ని ఉల్లంఘించింది. ఈ ఘటనల్లో దాదాపు 240 మంది భారతీయులు చనిపోయారు. 673 మంది పౌరులు, 594 మంది సైనికులు గాయపడ్డారు. 1972లో నియంత్రణ రేఖను నిర్ధరించిన అనంతరం సరిహద్దుల్లో దాదాపు 10ఏళ్ల పాటు ఎటువంటి ఉద్రిక్తతలు జరగలేదు. 1980 నుంచి యుద్ధ ట్యాంకులతో గస్తీ జోరందుకోగా.. 1990లో కశ్మీర్‌ లో తిరుగుబాటు తారాస్థాయికి చేరుకునే నాటికి ఇరుదేశాలు పూర్తి బలగాలను మోహరించాయి. 2001లో భారత్‌ తన సరిహద్దు ప్రాంతంలో కంచె నిర్మించడం ప్రారంభించిన తర్వాత నియంత్రణ రేఖ వద్ద కాల్పులు తీవ్రతరం అయ్యాయి. 2003 తర్వాత ఇరుదేశాలు యుద్ధ ట్యాంకులను దాదాపు 5 ఏళ్లపాటు నిషేధించాయి. ఈ దేశాల మధ్య ఆ సమయంలో జరిగిన చర్చలు మంచి ఫలితాలను ఇచ్చాయి. అయితే ముంబయిలో 2008 ఉగ్రదాడుల తర్వాత శాంతి చర్చలకు తావు లేకుండా పోయాయి. క్రమంగా సరిహద్దుల్లో యుద్ధట్యాంకుల అలజడి పెరిగింది. 2013లో అంతర్జాతీయ సరిహద్దు, నియంత్రణ రేఖ వద్ద ఉల్లంఘనలు ఎక్కువయ్యాయి. ప్రతి ఏడాది అవి గణనీయంగా పెరుగుతున్నాయి. 2017లో భారత్‌ 1,970 సార్లు ఉల్లంఘనలకు పాల్పడిందని పాకిస్థాన్‌ ఆరోపించింది. 2018లో పాకిస్థాన్‌ 936 సార్లు కాల్పుల విరమణ ఒప్పందానికి తూట్లు- పొడిచిందని భారత్‌ ఆరోపించింది. ఆనాటికి 15 ఏళ్లలోనే ఆల్‌ టైమ్‌ రికార్డది. 2018 మే నెలలో జమ్ముకశ్మీర్‌ లో.. భారత్‌ నాన్‌ ఇనీషియేషన్‌ ఆఫ్‌ కాంబాట్‌ ఆపరేషన్లను ప్రకటించింది. దీన్నే రంజాన్‌ కాల్పుల విరమణ అంటారు. ఇది 2003లో జరిగిన కాల్పుల విరమణ ఒప్పందానికి కొనసాగింపు. అయితే కాలక్రమేణ ఇరుదేశాల మధ్య సత్సంబంధాలు దెబ్బతిని.. 2019, 2020లో ఉద్రిక్తతలు తారాస్థాయికి చేరాయి. అఇప్పటి నుంచి కూడా 2025 వరకు పాకిస్థాన్‌ వరుసగా కాల్పుల విరమణను ఉల్లంఘిస్తూ వస్తోంది. తాజాగా సరిహద్దుల్లో కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించి పౌరులపై కాల్పులకు తెగించింది. దీంతో ఇద్దరు జవాన్లు, 22మంది సామన్య పౌరులు మృతి చెందారు. ఈ క్రమంలో అమెరికా మధ్యవర్తిత్వంలో ఈ ఒప్పందం ఎంతవరకు ఫలిస్తుందో చూడాలి.

## ఉద్రిక్తతలకు తోడు నీటికటకట

**ఎయూ హాస్టళ్లు తాత్కాలిక మూసివేత**

**విశాఖపట్టణం, మే10 (జనంసాక్షి) :** భారత్‌-పాకిస్తాన్‌ మధ్య ఉద్రికత్తలు కొనసాగుతూనే ఉన్నాయి.. ఓవైపు పాకిస్తాన్‌.. జనావాసాలను టార్గెట్‌ చేస్తూ కాల్పులు జరుపుతోంది.. మరోవైపు డ్రోన్లతో భారత్‌పై దాడి చేస్తుండగా.. డ్రోన్లను కూల్చివేస్తూనే.. పాక్‌ కాల్పులను తిప్పికొడుతోంది భారత్‌.. ఇంకోవైపు.. పాకిస్తాన్‌పై విరుచుకుపడుతోంది.. అయితే, ఈ పరిస్థితుల నేపథ్యంలో విశాఖపట్నంలోని ఆంధ్రా యూనివర్సిటీలో శనివారం నుంచి హాస్టళ్లను వర్సిటీ అధికారులు తాత్కాలికంగా మూసివేశారు. భారత్‌-పాక్‌ యుద్ధం కారణంగా విద్యార్థుల భద్రతను దృష్టిలో పెట్టుకుని పరీక్షలు ముగిసిన వారు వెంటనే ఇళ్లకు వెళ్లిపోవాలని స్పష్టం చేశారు. భద్రతా కారణాలతో పాటు నీటి ఎద్దడి, వార్షిక మరమ్మత్తుల కోసం కూడా హాస్టళ్లు మూసివేస్తున్నట్టు ఆంధ్రా యూనివర్సిటీ- రిజిస్ట్రార్‌ ప్రకటించారు.

## మేమెవరి జోలికి వెళ్లం

- మా జోలికి వస్తే మాత్రం వదిలి పెట్టం
- బాలీవుడ్‌ నటుడు రణ్‌వీర్‌ సింగ్‌ పోస్ట్‌



**ముంబై, మే10 (జనంసాక్షి) :** పహల్గాం ఘటనకు ప్రతీకారంగా భారత్‌ చేపట్టిన 'ఆపరేషన్‌ సిందూర్‌'పై బాలీవుడ్‌ నటుడు రణ్‌వీర్‌ సింగ్‌ పెట్టిన పోస్ట్‌ అందరినీ ఆకట్టుకుంటోంది. సైనికులకు సెల్యూట్‌ చేస్తూ దీనిపై స్పందించారు. ఆపరేషన్‌ సిందూర్‌కు సంబంధించిన ఇమేజ్‌ను పంచుకున్న రణ్‌వీర్‌.. ఎవరి పనులు వాళ్లు చేసుకునే వారిని మేం ఇబ్బందిపెట్టం. ఎవరైనా ఉద్దేశపూర్వకంగా ఇబ్బందిపెట్టాలని మా జోలికి వస్తే మాత్రం వదిలిపెట్టం. మన సాయుధ దళాల ధైర్యానికి సెల్యూట్‌ అని రాసుకొచ్చారు. ఈ ఆపరేషన్‌లో వ్యూహాత్మకంగా వ్యవహరిస్తోన్నందుకు ప్రధాని నరేంద్ర మోదీకి కృతజ్ఞతలు తెలిపారు. ఇప్పటికే ఆపరేషన్‌ సిందూర్‌పై టాలీవుడ్‌, బాలీవుడ్‌ సెలబ్రిటీలు ప్రశంసలు కురిపించిన విషయం తెలిసిందే. చిరంజీవి, అల్లు అర్జున్‌, ఎన్టీఆర్‌, అక్షయ్‌ కుమార్‌, రితీశ్‌ దేశ్‌ముఖ్‌, నిమ్రత్‌ కౌర్‌లు సైనికుల సేవలను కొనియాడారు. మీ వెంటే మేమున్నామని సోషల్‌ మీడియాలో పోస్ట్‌లు షేర్‌ చేశారు. ఇక మరోవైపు రెండు రోజులుగా జమ్మూకశ్మీర్‌, పంజాబ్‌లోని ప్రాంతాల్లో పాకిస్థాన్‌ డ్రోన్లతో దాడులు చేస్తోంది. భారత ఆర్మీ వాటిని సమర్థంగా ఎదుర్కొంటోంది. ఈ నేపథ్యంలో భారత్‌ - పాక్‌ మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

# పాక్‌ అరాచకాలకు గట్టి సమాధానం

- రక్షణ దళాలకు స్థైర్యం కలిగించాలని అమ్మవారికి మొక్కులు
- బషీర్‌ బాగ్‌ కనకదుర్గమ్మ ఆలయంలో కిషన్‌ రెడ్డి పూజలు




**హైదరాబాద్‌, మే10 (జనంసాక్షి) :** పాకిస్తాన్‌ చేసిన అరాచకాలకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ గట్టిగా సమాధానం చెబుతున్నారని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. నరేంద్రమోదీ నాయకత్వంలో పహల్గాంలో జరిగిన ఉగ్రదాడికి గట్టిగా భారత ఆర్మీ జవాబు చెప్పిందని అన్నారు. భారత సైనికులు ధైర్యంతో, సాహసంతో వీరోచితంగా పాకిస్తాన్‌లోని 9 ప్రాంతాల్లో ఉగ్రవాదుల శిక్షణా కేంద్రాలు, ఉగ్రవాదుల ఇండ్లను మట్టు-బెట్టారని చెప్పారు. పాకిస్తాన్‌ దుశ్చర్యలకు వ్యతిరేకంగా భారత సైన్యం వీరోచితంగా పోరాటం చేస్తోందని అన్నారు. భారతదేశం మీద జరిగిన ఉగ్రవాదుల దాడికి గానూ పాకిస్తాన్‌ క్షమాపణ చెప్పాల్సింది పోయి.. మన దేశంలోని చాలా ప్రాంతాల్లో, పౌర నివాసాలపై, సైనికులకు సంబంధించిన కేంద్రాలపై దాడులు చేస్తోందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉగ్రవాదుల నిర్మూలన లక్ష్యంగా పోరాటం చేస్తున్న భారత సైనికులకు ఆత్మస్థయిర్యం, శక్తి, విజయం కలగాలని శనివారం బషీర్‌బాగ్‌ కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయంలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో భారతదేశానికి మద్దతుగా భక్తులు నినాదలు చేశారు. జై శ్రీ రామ్‌.. జై రామ్‌ లక్ష్మణ్‌ జానకి.. జై బోలో హనుమాన్‌కి.. జై భవానీ.. జై శివాజీ నినాదాలతో ఆలయ పరిసరాలు మార్మోగాయి. దేశ భద్రత కోసం పోరాడుతున్న యోధుల రక్షణకు అమ్మవారి ఆశీర్వాదం కలగాలని కిషన్‌రెడ్డి మొక్కుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారి దర్శనం చేసుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. పహల్గామ్‌లో అమాయకులైన 26 మంది భారత పౌరులను పాకిస్తాన్‌ ఉగ్రవాదులు అత్యంత కిరాతకంగా కాల్చిచంపారని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. దేశ భద్రత కోసం పోరాటం చేస్తున్న భారత సైనికులకు మద్దతుగా కుల, మత, ప్రాంతాలకు అతీతంగా ప్రతి గ్రామం, మండలం, జిల్లాలోని దేవాలయాల్లో ప్రత్యేక పూజలు, సామూహిక ర్యాలీలు నిర్వహించాలని తెలుగు రాష్ట్రాల ప్రజలకు కేంద్రమంత్రి కిషన్‌ రెడ్డి పిలుపునిచ్చారు. భారత సైనికులకు మరింత ఆత్మ్ధసైర్యం కల్పించేలా ప్రజలు సంఘీభావాన్ని తెలియజేయాలని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.

## సరిహద్దు ఉద్రిక్తతలతో రైల్వే స్టేషన్ల భద్రత పెంపు




**హైదరాబాద్‌, మే10 (జనంసాక్షి) :** భారత్‌ - పాకిస్థాన్‌ సరిహద్దుల్లో ఉద్రిక్తతల నేపథ్యంలో రైల్వే ప్రయాణికుల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించినట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో శ్రీధర్‌ వెల్లడించారు. ప్రయాణికుల భద్రతతో పాటు ఆస్తులపైనా ప్రత్యేక దృష్టి పెట్టామని అన్నారు. అందుకు అనుగుణంగా చర్యలు చేపట్టామని అన్నారు. నగరంలోని ప్రధాన రైల్వేస్టేషన్‌లైన సికింద్రాబాద్‌, కాచిగూడలో భారీగా భద్రతను పెంచినట్లు తెలిపారు. సీసీ కెమెరాల సంఖ్యను సైతం పెంచి పర్యవేక్షణ చేస్తున్నట్లు శ్రీధర్‌ పేర్కొన్నారు. భారత్‌-పాక్‌ ఉద్రిక్తతల నేపథ్యంలో భద్రత కారణాల దృష్ట్యా దేశవ్యాప్తంగా పలు విమానాశ్రయాలను మూసి వేయడంతో రైల్వేస్టేషన్లకు ప్రయాణికుల తాకిడి పెరిగిందన్నారు. దీంతో భద్రత కోసం ప్రత్యేక బలగాలను మోహరించినట్లు- చెప్పారు. ప్రయాణికుల రద్దీకీ అనుగుణంగా ప్రత్యేక రైళ్లను నడిపిస్తున్నామని సీపీఆర్‌వో శ్రీధర్‌ వెల్లడించారు.

# తప్పుడు వార్తలతో పాక్‌ హల్‌చల్‌

- ఎప్పటికప్పుడు తిప్పికొడుతున్న భారత్‌
- తప్పుడు ప్రచారాలకు చైనా సైదోడు

**న్యూఢిల్లీ, మే 10 (జనంసాక్షి) :** ఆపరేషన్‌ సిందూర్‌ ఎఫెక్ట్‌తో పాకిస్తాన్‌ విలవిలలాడిపోతోంది. ఏం చేయాలో, ఎలా దెబ్బకొట్టాలో తెలీక.. చివరకు తప్పుడు ప్రచారానికి తెర తీస్తోంది. దీనికి తన మిత్ర దేశమైన చైనా సపోర్టు కూడా తీసుకుంది. సాధారణ ప్రజలపై తాము దాడులు చేయడం లేదని పాకిస్థాన్‌ బుకాయింపులను భారత ఆర్మీ తిప్పికొట్టింది. జమ్ములోని నివాస ప్రాంతాలు, ఆలయాలపై పాక్‌ నిరంతరం దాడులకు తెగబడుతోందని కేంద్రం పేర్కొంది. అందుకు సాక్ష్యంగా వీడియోను సోషల్‌ మీడియాలో పోస్టు చేసింది. జమ్మూకశ్మీర్‌లోని శంభూ దేవాలయం ధ్వంసమైనట్లు రక్షణ శాఖ ఫొటోలు, వీడియోను విడుదల చేసింది. రాత్రంతా డ్రోన్లతో దాడులు చేస్తూనే ఉందని.. భారత ఆర్మీ వాటిని సమర్థవంతంగా ఎదుర్కొన్నట్లు- పేర్కొంది. దేశ సార్వభౌమత్వాన్ని, సమగ్రతను కాపాడేందుకు సాయుధ బలగాలు కృతనిశ్చయంతో సిద్ధంగా ఉన్నాయని స్పష్టం చేసింది. పశ్చిమ సరిహద్దుల్లో యుద్ధ వాతావరణం కొనసాగుతున్నది. దాయాది పాకిస్థాన్‌ డ్రోన్‌ దాడులకు పాల్పడుతున్నది. సరిహద్దు వెంట కవ్వింపు చర్యలకు దిగుతూ.. దాడులు చేస్తున్నది. శనివారం ఉదయం కూడా డ్రోన్‌ అటాక్‌ జరిగింది. తెల్లవారుజామున 5 గంటలకు.. పాక్‌కు చెందిన డ్రోన్లు భారీ సంఖ్యలో అమృత్‌సర్‌లోని ఖాసా కంటోన్మెంట్‌లో కనిపించాయి. తక్షణమే భారతీయ సైన్యం స్పందించింది. ఎయిర్‌ డిఫెన్స్‌ యూనిట్లు ఆ డ్రోన్లను కూల్చివేసినట్లు ఇండియన్‌ ఆర్మీ ప్రకటించింది. దానికి సంబంధించిన వీడియోను ఆర్మీ విడుదల చేసింది. ఇకపోతే పాక్‌ తప్పుడు ప్రచారాలకు చైనా దోహదపడుతోంది. పాక్‌, చైనా రెండూ కలిసి భారత గగనతల రక్షణ వ్యవస్థ ఎస్‌-400 పై తప్పుడు ప్రచారానికి తెగబడ్డాయి.. సోషల్‌ మీడియా వేదికగా పాకిస్తాన్‌ పోస్టు చేస్తున్న తప్పుడు ప్రచారాలను చైనా ప్రచారంలోకి తెస్తోంది..భారత్‌ దాడులతో ఉక్కిరిబిక్కిరవుతున్న పాకిస్తాన్‌ ఎలాగైనా కసి తీర్చుకోవాలనే అక్కసుతో ఏవేవో కుటిల ప్రయత్నాలు చేస్తోంది. సరిహద్దుల వెంబడి కాల్పులకు తెగబడడం, డ్రోన్‌లో దాడులు చేయడం వంటి ప్రయత్నాలు చేస్తోంది. అయితే ఇండియన్‌ ఆర్మీ వాటిని దీటుగా ఎదుర్కొంటోంది. అయితే ఈ క్రమంలో పాకిస్తాన్‌ విష ప్రచారానికి సిద్ధమైంది. భారత్‌ మిలిటరీ స్థావరాలపై దాడి చేశామంటూ ఒకసారి, పాక్‌ సైబర్‌ సైన్యం దాడిలో భారత్‌ పవర్‌గ్రిడ్‌ 70శాతం నిర్వీర్యమైపోయిందని మరోసారి.. ఇలా తప్పుడు వార్తలు పోస్టు చేస్తోంది. అయితే అ వార్తలన్నీ ఫేక్‌ న్యూస్‌ అంటూ భారత వార్తాసంస్థ స్పష్టం చేస్తూ వచ్చింది. ఈ క్రమంలో తాజాగా, భారత గగనతల రక్షణ వ్యవస్థ ఎస్‌-400పై దాడి చేశామంటూ మరో వార్తను ప్రచారం చేసింది. భారత శక్తిమంతమైన క్షిపణి రక్షణ వ్యవస్థను పాక్‌కు చెందిన జేఎఫ్‌-17 యుద్ధ విమానంతో కూల్చేశామంటూ పాక్‌ ప్రభుత్వ రంగ మీడియా సంస్థ పేర్కొంది. అయితే ఈ వార్తలను చైనా ప్రభుత్వ రంగానికి చెందిన మీడియా ప్రచారంలోకి తెచ్చింది. అలాగే అజర్‌ బైజన్‌కు చెందిన మరో సంస్థ కూడా ఈ వార్తను వైరల్‌ చేసింది. ఈ వార్తలపై భారత ఆర్మీ అధికారులు స్పందించారు. పాక్‌ చేస్తున్న ప్రచారం తప్పు అని భారత సైనికాధికారులు తెలియజేశారు. ఎస్‌-400.. అనేది అత్యాధునిక రక్షణ వ్యవస్థ అని చెప్పొచ్చు. దీని రాడార్‌ రేంజి సుమారు 600 కిలోమీటర్ల వరకు ఉంటుంది. ఇందులో మొత్తం మూడు భాగాలు ఉంటాయి. క్షిపణి లాంచర్లు, శక్తివంతమైన రాడార్‌, కమాండ్‌ సెంటర్‌. ఇది విమానాలు, క్రూయిజ్‌ క్షిపణులతో పాటూ వేగంగా కదిలే ఇంటర్మీడియట్‌ రేంజ్‌ బాలిస్టిక్‌ క్షిపణులను కూడా ఢీకొట్టగలదు. ఈ రక్షణ వ్యవస్థను ప్రపంచంలో ఇప్పటివరకు రష్యా, చైనా, టర్కీలు వినియోగిస్తున్నాయి.

# సైనికదాడి ఆపితే మేమూ దిగివస్తాం

- పాక్‌ విదేశాంగ మంత్రి ఇషాక్‌ దార్‌ వెల్లడి



**ఇస్లామాబాద్‌, మే10 (జనంసాక్షి) :** భారత్‌ తమపై దాడి చేస్తే ఎదురుదాడికి దిగుతామని మేకపోతు గాంభీర్యం ప్రదర్శించిన పాక్‌ ఇప్పుడు మాట మార్చేసింది. పాక్‌ విదేశాంగ శాఖ మంత్రి ఇషాక్‌ దార్‌ మీడియాతో మాట్లాడుతూ.. భారత్‌ తమపై చేస్తున్న సైనిక దాడిని ఇక్కడితో ఆపితే తాము కూడా ఉద్రిక్తతలు తగ్గించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. పాకిస్తాన్‌ విదేశాంగమంత్రి ఇషాక్‌ దర్‌ ఈ మేరకు కీలక వ్యాఖ్యలు చేశారు. భారత్‌ దాడులు ఆపితే తాము ఆపుతామని ఇషాక్‌ దర్‌ స్పష్టం చేశారు. రెండు దేశాల మధ్య ఉద్రక్తతల నేపథ్యంలో తాము తగ్గింపునకు సిద్ధంగా ఉన్నామని, అయిత భారత్‌ దాడులు ఆపితే తాము తగ్గుతామని పేర్కొన్నారు. ఇదే విషయాన్ని అమెరికాకు స్పష్టం చేశామని వివరించారు. ఇరుదేశాల మధ్య దాడుల వల్ల పాక్‌ ఆర్థిక పరిస్థితి కుదేలవ్వడం, ప్రజల పరిస్థితులు అధ్వానంగా మారే ప్రమాదం ఉండడంతో.. ఈ యుద్ధ వాతావరణాన్ని రూపుమాపడం కోసం న్యూఢిల్లీతో చర్చలు జరపడానికి ఇస్లామాబాద్‌ సిద్ధంగా ఉందని పాక్‌ అధికారిక వర్గాలు వెల్లడించాయి. భారత్‌-పాక్‌ మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో పరిస్థితులు చేయి దాటకముందే దాడుల నివారణకు చర్యలు తీసుకోవాలని అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో ఇరుదేశాలకు సూచించారు. ఈ నేపథ్యంలో పాక్‌ విదేశాంగశాఖ మంత్రి ప్రకటన ప్రాధాన్యం సంతరించుకుంది. గురువారం రాత్రి నుంచి పాక్‌ భారత సరిహద్దు ప్రాంతాల్లో దుస్సాహసానికి ఒడిగడుతూనే ఉంది. బారాముల్లా నుంచి భుజ్‌ వరకు 26 ప్రాంతాల పైకి వరసగా డ్రోన్లు ప్రయోగించింది. ముఖ్యంగా శ్రీనగర్‌ విమానాశ్రయాన్ని, అవంతీపోరా వైమానిక స్థావరాన్ని లక్ష్యంగా చేసుకొని డ్రోన్లను ప్రయోగిస్తూ.. విఫలయత్నిం చేస్తుండగా, దాయాది చర్యలను భారత సైన్యం తిప్పి కొడుతోంది. శనివారం మరోసారి జమ్మూ, ఫిరోజ్‌పూర్‌, పఠాన్‌కోట్‌, జైసల్మేర్‌, బాడ్‌మేడ్‌, భుజ్‌ తదితర ప్రాంతాలపై వీటిని మళ్లీ పంపేందుకు ప్రయత్నించగా భారత సైనికులు వాటిని కూల్చివేశారు.

## నా సింధూరాన్ని దేశ రక్షణకు పంపుతున్నా

- జవాన్‌ భార్య ధీరత్వం



**ముంబై, మే10 (జనంసాక్షి) :** 'నా సిందూరాన్ని దేశ రక్షణ కోసం పంపుతున్నా' అంటూ నవ వధువు పెళ్లయిన మూడు రోజులకే భర్తను సరిహద్దుల్లోకి పంపి ఆదర్శంగా నిలుస్తోంది. ఇందుకు గర్విస్తున్నాని తెలిపింది. దేశం కన్నా తనకు మరేదీ ముఖ్యం కాదని తెలిపి ధీరత్వాన్ని చాటింది. భారత్‌-పాక్‌ మధ్య ఉద్రిక్తతల దృష్ట్యా పారా మిలిటరీ బలగాలకు సెలవులు రద్దయిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మహారాష్ట్రకు చెందిన జవాను మనోజ్‌ పాటిల్‌కు.. బోర్డర్‌కు తిరిగి రావాలని ఉన్నతాధికారుల నుంచి సమాచారం అందింది. అయితే మనోజ్‌కి ఈనెల 5నే వివాహం జరిగింది. పెళ్లయి వారం రోజులు కూడా గడవకముందే విధుల్లో చేరాల్సి రావడంతో భార్య యామిని, కుటుంబ సభ్యులు బాధను దిగమింగుకొని మనోజ్‌ను దేశ రక్షణ కోసం పంపారు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియో వైరల్‌ అవుతోంది.అలాగే ఆమెను అంతా అభినందించారు.

# బెంగుళూరు చేరుకున్న వీరజవాన్‌ భౌతికకాయం

- నివాళి అర్పించిన మంత్రి సవిత
- ఊరేగింపేగా స్వగ్రామానికి చేరిక
- నేడు అధికార లాంఛనాలతో అంత్యక్రియలు
- హాజరవుతున్న మంత్రులు పవన్‌, అనిత, లోకేశ్‌
- ఒక నెల జీతం సాయంగా ప్రకటించిన బాలయ్య



**శ్రీసత్యసాయి, మే10 (జనంసాక్షి) :** ఆపరేషన్‌ సిందూర్‌లో వీరమరణం పొందిన ఆర్మీ జవాన్‌ మురళీనాయక్‌ భౌతిక కాయం బెంగుళూరు ఎయిర్‌పోర్టుకు చేరుకుంది. సాయంత్రం జవాన్‌ స్వస్థలం గోరంట్ల మండలం కల్లితండాకు పార్థీవదేహం చేరుకోనుంది. బెంగళూరు ఎయిర్‌ పోర్ట్‌లో మురళీ నాయక్‌ భౌతికకాయానికి మంత్రి సవిత నివాళులర్పించారు. విమానాశ్రయం నుంచి జవాన్‌ భౌతికకాయాన్ని స్వయంగా మంత్రి సవితతో పాటు సత్యసాయి జిల్లా అధికారులు స్వగ్రామానికి తీసుకువస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌ సరిహద్దు కొడికొండ చెక్‌పోస్టు నుంచి జవాన్‌ భౌతికకాయాన్ని భారీ ర్యాలీతో స్వగ్రామం వరకు తీసుకెళ్లేందుకు పెద్ద ఎత్తున స్థానికులు తరలివస్తున్నారు. జవాన్‌ మురళీ నాయక్‌ అంత్యక్రియలు ఆదివారం స్వగ్రామం కల్లితండాలో జరుగ నున్నాయి. జవాన్‌ అంత్యక్రియలకు డిప్యూటీ సీఎం పవన్‌ కళ్యాణ్‌, హోంమంత్రి వంగలపూడి అనిత , మంత్రి నారా లోకేష్‌ హాజరుకానున్నారు. గుమ్మయ్యగారిపల్లి నుంచి భారీ ర్యాలీని నిర్వహించిన అనంతరం అంత్యక్రియలు నిర్వహించనున్నారు. పాక్‌ జరిపిన కాల్పుల్లో మరణించిన నేపథ్యంలో అధికారిక, సైనిక లాంఛనాలతో జరిగే అంత్యక్రియలకు డిప్యూటీ సీఎం, మంత్రులు లోకేష్‌, అనిత హాజరుకానున్నారు. ముందుగా మురళీ నాయక్‌ భౌతికకాయానికి నివాళి అర్పించి, కుటుంబసభ్యులను పరామర్శించిన అనంతరం అంత్యక్రియల్లో పాల్గొననున్నారు. డిప్యూటీ సీఎం, మంత్రుల రాక నేపథ్యంలో కల్లితండాలో యుద్ధ ప్రాతిపదికన అంత్యక్రియలకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. అలాగే అంత్యక్రియల్లో కేంద్ర మంత్రులు, రాష్ట్ర మంత్రులు, వీఐపీలు పాల్గొననున్నారు. వీఐపీల రాకతో పోలీసులు భారీ బందోబస్తును ఏర్పాటు చేస్తున్నారు. వీర జవాన్‌ మురళీ నాయక్‌ తల్లిదండ్రులను కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు మేనల్లుడు దేవినేని ధర్మతేజ పరామర్శించారు. ఈ సందర్భంగా జవాన్‌ తల్లిదండ్రులకు ఒక నెల వేతనం ఆర్థిక సాయం చెక్‌ను ధర్మతేజ అందజేశారు. మురళీ నాయక్‌ కుటు-ంబానికి అన్ని విధాలా అండగా ఉంటామంటూ కుటుంబ సభ్యులకు ఓదార్పునిచ్చారు. అలాగే మురళీనాయక్‌ కుటు-ంబాన్ని మహారాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి ఉదయ్‌ సమంత్‌ పరామర్శించారు. మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఏక్నాథ్‌ షిండే వీడియో కాల్‌ ద్వారా మురళీ నాయక్‌ తల్లిదండ్రులను పరామర్శించారు. వీర జవాన్‌ విగ్రహాన్ని మురళి నాయక్‌ జన్మస్థలమైన ముంబైలో ఏర్పాటు చేస్తామని ఈ సందర్భంగా మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. మరోవైపు ఆపరేషన్‌ సిందూర్‌లో భాగంగా జమ్మూ కశ్మీర్‌ యుద్ధ భూమిలో పోరాడుతూ అసువులు బాసిన తెలుగు జవాన్‌ మురళీ నాయక్‌కు హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ అండగా నిలిచారు. జవాన్‌ కుటుంబానికి తన వంతుగా ఆర్థిక సాయం అందజేశారు. ఒక నెల జీతాన్ని మురళీనాయక్‌ కుటుంబానికి ఇస్తున్నట్లు ప్రకటించారు. ఈనెల 12న మురళీ నాయక్‌ స్వగ్రామానికి ఎమ్మెల్యే బాలయ్య వ్యక్తిగత కార్యదర్శులు వెళ్లనున్నారు. ఈ సందర్భంగా జవాన్‌ కుటుంబ సభ్యులను పరామర్శించి.. ఆపై బాలయ్య ప్రకటించిన నగదును వారికి అందిజేయనున్నారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370